www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 19-4-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 3 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం,బహుళ పక్షం తిథి: షష్ఠి సా. 6:22 తదుపరి సప్తమి, నక్షత్రం:మూల ఉ.10:21 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం:ఉ.8:37-10:21, రా.8:31-10:13, దుర్ముహూర్తం: ఉ.6:00-7:39, అమృతఘడియలు: ఉ.6:42-8:24, రాహుకాలం: 9:00-10:30, సూర్యోదయం: 6:00, సూర్యాస్తమయం: 6:28 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జేఈఈ మెయిన్ ఫలితాల విడుదల

24 మందికి 100 పర్సంటైల్

ఏపీ నుంచి ఒకరు, తెలంగాణ నుంచి ముగ్గురు

రాజస్థాన్ విద్యార్థులకు తొలి రెండు ర్యాంకులు

8, 16, 22, 24వ ర్యాంకులు తెలుగువారికి

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శుక్రవారం రాత్రి

మిగతా 2వ పేజీలో...

భగవద్గీత, నాట్యశాస్త్రాలకు యునెస్కో గుర్తింపు



మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు

భారతీయులు గర్వించదగ్గ సమయం: ప్రధాని నరేంద్ర మోదీ

దేశ నాయకత్వానికి ప్రతీక: అమిత్ షా

2

ఎడారిలో వసంతం

థార్ ఎడారిలో పచ్చదనం పరవళ్లు

ఆశ్చర్యపరుస్తున్న ఆకస్మిక మార్పులు

2 దశాబ్దాల్లో 38% పెరిగిన వృక్ష సంపద

రుతుపవనాల వర్షపాతంలో 64 శాతం పెరుగుదల

భూగర్భ జలాలు పెరిగి సాగుకు ఊతం



థార్ ఎడారిలో పచ్చదనం పరుచుకున్న దృశ్యం

2

కాలేయంలో కలకలం..!

తెలియకుండానే కబళించే లివర్ వ్యాధులు

సమస్యేమిటో గుర్తించే సరికే ప్రాణాపాయ స్థితి

అధిక కొవ్వు, రసాయనాలున్న ఆహారం, మద్యం..

ఊబకాయం, హెపటైటిస్ తదితరాలే కారణం

ముందుగా గుర్తిస్తేనే రక్షణ సాధ్యం

నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



12

ఎస్సీ వర్గీకరణ రూల్స్ విడుదల

రాష్ట్రంలో అమలుకు అంతా సిద్ధం

3 గ్రూపులుగా రిజర్వేషన్ ఫలాలు

మహిళా రిజర్వేషన్ 33% ఆయా గ్రూపులకు సమాంతరంగా అమలు

అర్హులు లేకుంటే రెండో నోటిఫికేషన్

సందేహాలపై ప్రభుత్వంతో చర్చించే చాన్స్

రాష్ట్ర సర్కారు నియామకాలకు వర్తింపు



ఇవీ గ్రూపులు

గ్రూపు	కులాలు	రిజర్వేషన్
1	12	1.0%
2	18	6.5%
3	29	7.5%

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి సంబంధించి.. 'ఎస్సీ వర్గీకరణ రూల్స్-2025' నోటిఫికేషన్ విడుదల చేసింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏపీ షెడ్యూల్డ్ కులాల (వర్గీకరణ) ఆర్డినెన్స్-2025ను(ఏపీ ఆర్డినెన్స్ నంబరు-2/2025) గురువారం జారీచేసిన సంగతి తెలిసిందే. దీని అమలుకు విధివిధానాలతో కూడిన నిబంధనలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ రూల్స్ వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపింది. ఆర్డినెన్స్‌లో పేర్కొన్నట్లు ఎస్సీలను 3 గ్రూపులుగా వర్గీకరించారు. ఎస్సీ రిజర్వేషన్ 15 శాతాన్ని ఈ గ్రూపులకు పంపిణీ చేస్తారు. గ్రూప్-1లో 12 కులాలకు 1 శాతం, గ్రూప్-2లోని 18 కులాలకు 6.5 శాతం, గ్రూప్-3లో 29 కులాలకు 7.5 శాతం రిజర్వేషన్

మిగతా 12వ పేజీలో...

'బనకచర్ల' అనుమతులకు ప్రతిపాదనలు పంపండి

కేంద్ర జలసంఘం సానుకూల స్పందన


కేంద్ర, రాష్ట్ర అధికారులతో సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్

ప్రాజెక్టు ఒకే యూనిట్‌గా అనుమతులు తీసుకోవాలని నిర్ణయం

నిధుల సమీకరణపై జలవనరుల శాఖ దృష్టి

కంపెనీల రిజిస్ట్రార్ వద్ద 'జలహారతి కార్పొరేషన్' రిజిస్ట్రేషన్

12



"ఆనాడు లిక్కర్ పాలసీపై జరిగిన రెండు సమావేశాలకు వెళ్లాను. హైదరాబాద్, విజయవాడలో జరిగిన ఈ భేటీల్లో రాజ్ కసిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఇంకొందరు పాల్గొన్నారు. ముడుపుల విషయం నాకు తెలియదు. కానీ, వ్యాపారానికి అప్పు కావాలంటే వారిద్దరికి 'అరబిందో' శరత్ చంద్రారెడ్డికి చెప్పి 100 కోట్లు ఇప్పించా"

- విజయసాయిరెడ్డి

ముందస్తు బెయిలివ్వండి

అరెస్టు నుంచి కాపాడండి

దర్యాప్తునకు సహకరిస్తా

కోరినప్పుడు అందుబాటులో ఉంటా

హైకోర్టులో కసిరెడ్డి పిటిషన్

మీ అబ్బాయిని రమ్మనండి

విచారణకు సహకరిస్తే మీకే మంచిది

రాజ్ కసిరెడ్డి తండ్రికి సిట్ సూచన

కొడుకు ఆచూకీ తెలియదన్న ఉపేందర్‌రెడ్డి

చివరికి తన వంతు ప్రయత్నం చేస్తానని వెల్లడి

11



సూత్రధారి కసిరెడ్డే

ఆయన తోడల్లుడు లిక్కర్ నెట్‌వర్క్ నడిపాడు

స్కామ్‌లో బిగ్‌బాస్ ఉన్నదీ లేనిదీ తెలియదు: సాయిరెడ్డి

వ్యాపారం చేసుకుంటామంటే 'అరబిందో'కు చెప్పి కసిరెడ్డి, మిథున్‌రెడ్డికి 100 కోట్లు అప్పుగా ఇప్పించా

నాడు ప్రోత్సహించినందుకు బాధ పడుతున్నా

హైదరాబాద్, విజయవాడల్లో లిక్కర్ సమావేశాలు

హాజరైన మిథున్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్, కసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి

ముడుపుల విషయం నేను చెప్పలేను

సిట్‌కు అంతా చెప్పేశా..పిలిస్తే మళ్లీ వస్తానని చెప్పా

మీడియాకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడి

విజయవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో జరిగిన వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణం సూత్రధారి రాజ్ కసిరెడ్డేనని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఈ స్కామ్‌లో భాగంగా పక్కా నెట్‌వర్క్‌ను ఆయన తోడల్లుడు అవినాశ్‌రెడ్డి నడిపించారని తెలిపారు. లిక్కర్ పాలసీపై జరిగిన మొదటి రెండు సమావేశాల్లో మాత్రమే తాను పాల్గొన్నానని, అవి హైదరాబాద్, విజయవాడల్లో జరిగాయని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో అరబిందో శరత్‌చంద్రారెడ్డి నుంచి రూ. 100 కోట్లు అప్పుగా ఇప్పించానని ఆయన చెప్పారు. విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరయిన ఆయన, విచారణ అనంతరం మీడియాతో మాట్లాడారు. నాలుగు అంశాలకు సంబంధించి సిట్ అధికారులు ప్రశ్నించారని తెలిపారు. "2019లో హైదరాబాద్, విజయవాడల్లో లిక్కర్‌కు సంబంధించిన సమావేశం

మిగతా 11వ పేజీలో...

తెలివైన క్రిమినల్

రాజ్ కసిరెడ్డిని వైసీపీలోని వ్యక్తులు నాడు తనకు పరిచయం చేశారని విజయసాయి తెలిపారు. "2017-18లో కసిరెడ్డి పార్టీలోకి వచ్చారు. ఆయన ఒక తెలివైన క్రిమినల్. ఈ విషయం తెలియక ఆయనకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాను. మొట్టమొదట ఎన్‌ఆర్‌ఐ విభాగం అప్పగించాను. ఆ తర్వాత సోషల్ మీడియా విభాగం చూసుకోమని చెప్పాను. అనంతరం ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిశోర్ ప్రొటోకాల్ బాధ్యతలు అప్పగించాను. పార్టీ పెద్దలు చెప్పారని ఆయనను ప్రోత్సహించింది నేనే. ఈ విషయంలో తప్పు చేశానన్న భావన ఇప్పుడు కలుగుతోంది. రాజ్ కసిరెడ్డి గురించి ఐదేళ్లపాటు నేను ఎందుకు మాట్లాడలేదని అడుగుతున్నారు. ఆ రోజున మీడియా అడగలేదు. నేను చెప్పలేదు. రాజ్ కసిరెడ్డి వెనుక ఉన్న వ్యక్తుల గురించి మీడియా చెప్తే నేను సంతోషిస్తా. కానీ, ఆయన ఆనాడు పార్టీని, ప్రజలను మోసం చేశారు" అని విజయసాయి ఆగ్రహించారు.



భూకబ్జాలను సహించం

నేనే స్వయంగా జిల్లాల్లో పర్యటిస్తా

తొలుత కాకినాడ, విశాఖలో తిరుగుతా

భూదందా బాధితులతో మాట్లాడతా

అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి సంపాదించుకున్న చిన్నపాటి జాగాలను, వారసత్వంగా వచ్చిన భూములను కాపాడుకోవడానికి సామాన్యులు పడుతున్న ఇబ్బందులను తొలగిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. భూకబ్జాలను సహించబోమన్న ఆయన, దీనిపై నేరుగా బాధితులతో మాట్లాడేందుకు జిల్లాల్లో పర్యటించనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో అధికారులతో ఈ సమస్యపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా పవన్ కల్యాణ్ సమీక్షించారు. కొద్ది రోజులుగా భూకబ్జాలు, తప్పుడు రెవెన్యూ రికార్డుల సమస్యతో బాధపడుతున్న వారినుంచి అభ్యర్థనలు

మిగతా 12వ పేజీలో...

గనుల ఆదాయం పెంచుదాం



మినరల్ పాలసీలో సర్కారు కీలక మార్పులు

పెండింగ్ దరఖాస్తులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్

తగ్గనున్న ఫీజుల భారం.. పెరగనున్న లీజు కాలం

గ్రానైట్ లీజు కాలపరిమితి 20 నుంచి 30 ఏళ్లకు

రోడ్ మెటల్ లీజు 15 నుంచి 30 ఏళ్లకు పెంపు

ఇకపై అన్ని జిల్లాల్లో సీనరేజీ కాంట్రాక్ట్ అమలు

జగన్ సర్కారు పాలసీలో సమూల మార్పులు

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గనులు, ఖనిజాల తవ్వకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గణనీయంగా పెంచుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఆర్థిక పురోగమనంలో గనుల పాత్ర కీలకంగా ఉండేలా, ఈ రంగంలో పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా జగన్ సర్కారు 2020లో తీసుకొచ్చిన సూక్ష్మఖనిజాల పాలసీలో సమూల మార్పులు చేసింది. ఈ మేరకు కొత్తగా

మిగతా 11వ పేజీలో...

ప్రాథమికోన్నత స్కూళ్లలో ఎస్జీటీలా?

6 నుంచి 8 తరగతులకు స్కూల్ అసిస్టెంట్లు బోధించాలని టీచర్ల పట్టు

తాజా ప్రతిపాదనపై గరంగరం.. పాఠశాలల ఆధారంగా ఎస్జీటీల కేటాయింపు

మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెచ్ఎం పోస్టు.. ఫౌండేషనల్ స్కూల్‌లో 30:1గా నియామకం

జీవో 117కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు.. సరికాదంటున్న ఉపాధ్యాయ వర్గాలు

ఎస్జీటీలతో బోధించడం ఏంటని గతంలోనూ విమర్శలు.. గుర్తుచేస్తున్న టీచర్లు

టీచర్ల కేటాయింపు విషయంలో పాఠశాల విద్యాశాఖ నిర్ణయాలపై ప్రతికూల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ప్రాథమికోన్నత పాఠశాలలకు కేవలం సెకండరీ గ్రేడ్

మిగతా 10వ పేజీలో...

గోవిందుడి ఖజానా మరింత భద్రం!

భక్తులు సమర్పించే కానుకల డిపాజిట్లపై టీటీడీ దృష్టి



స్వామి సొమ్ము భద్రతతో పాటు ఆదాయంపై జాగ్రత్తలు

వందల కోట్ల కానుకల పెట్టుబడులపై నిపుణుల కమిటీ

ప్రభుత్వ, ప్రైవేట్ డిపాజిట్ల కొనసాగింపునకు నిర్ణయం

2024-25లో వడ్డీల ద్వారా 1,253 కోట్ల ఆదాయం

వడ్డీ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా టీటీడీ ప్రణాళికలు

12



మా చట్టాలు ఉల్లంఘించొద్దు

ధిక్కరిస్తే తీవ్ర పర్యవసానాలు తప్పవు

విదేశీ విద్యార్థులకు అమెరికా హెచ్చరిక

అక్రమంగా వచ్చిన వారందరూ దేశం విడిచి పోవాలని విజ్ఞప్తి

ఇప్పటికే వెయ్యిమందికి పైగా విద్యార్థుల వీసాలు రద్దు

ట్రాఫిక్ ఉల్లంఘనల వంటి స్వల్ప కారణాలతోనే చర్యలు

అరెస్టు భయంతో చదువు మధ్యలో వదిలేసి స్వదేశాలకు కొందరు

కోర్టులను ఆశ్రయిస్తున్న మరికొందరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: అమెరికా చట్టాలను ఉల్లంఘించడానికి ప్రయత్నించే విదేశీ విద్యార్థులు బహిష్కరణతో పాటు పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ దేశ విదేశాంగ శాఖ హెచ్చరించింది. అక్రమ వలసల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ చట్టాలను కఠినంగా అమలు చేస్తోందని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మార్గరెట్ మెక్‌లియోడ్ వెల్లడించారు. 'మా చట్టాలను పాటించేవారికి అమెరికా మంచి అవకాశాలు కల్పిస్తుంది. కానీ చట్టాన్ని ఉల్లంఘించేవారు తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటారు' అని ఆమె స్పష్టం చేశారు. ఓ వార్తా సంస్థకు వర్చువల్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. జరిమానా పడకుండా ఉండాలంటే అమెరికా చట్టాలకు, వీసా ప్రమాణాలకు కట్టుబడి ఉండాలని చెప్పారు. సరిహద్దు భద్రతకు తమ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో...

ఎండ.. వాన!

రాష్ట్రంలో విచిత్ర వాతావరణం

అల్లూరి జిల్లాలో పెనుగాలుల బీభత్సం

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

అంధకారంలో ఏజెన్సీ గ్రామాలు

నేడు, రేపు ఈదురుగాలులతో వర్షం

12



పాడేరు నుంచి విశాఖ వెళ్లే మార్గంలో కూలిన భారీ వృక్షం.. తెగిపడ్డ వైర్లు



రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వైరస్ లేదు

భోపాల్ ల్యాబ్‌లో నిర్ధారణ

వెటర్నరీ డైరెక్టర్ వెల్లడి

12

జేఈఈ మెయిన్ ఫలితాల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఫలితాలను విడుదల చేసింది. శుక్రవారం మధ్యాహ్నం తుది కీ విడుదల చేసిన అధికారులు.. విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోరుతో ఫలితాలను విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించగా.. 24 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. రాజస్థాన్‌కు చెందిన మహ్మద్ అనాస్ ఫస్ట్ ర్యాంకు, ఆయుష్ సింఘాల్ రెండో ర్యాంకు సాధించారు. 100 పర్సంటైల్ సాధించిన వారిలో తెలంగాణ నుంచి హర్ష ఎ.గుప్తా, వంగల అజయ్‌రెడ్డి, బనిబ్రత మజీ, ఏపీ నుంచి సాయిమనోజ్ఞ గుత్తికొండ ఉన్నారు. కాగా, హర్ష ఎ.గుప్తా దేశ వ్యాప్తంగా 8వ ర్యాంకు సాధించగా, అజయ్‌రెడ్డి ఆలిండియా 16వ ర్యాంకుతో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో టాప్‌లో నిలిచాడు. సాయిమనోజ్ఞ ఆలిండియా 22వ ర్యాంకు, బాలికల్లో 2వ ర్యాంకు సాధించింది. బనిబ్రత మజీకి ఆలిండియా 24వ ర్యాంకు లభించింది.

భగవద్గీత, నాట్యశాస్త్రాలకు యునెస్కో గుర్తింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి విశిష్ఠ గుర్తింపు లభించింది. హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతకు, భరతముని రాసిన నాట్యశాస్త్రానికి యునెస్కో తన మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు కల్పించింది. ప్రఖ్యాత రిజిస్టర్‌లో వీటికి స్థానం లభించడంపై ప్రధాని మోదీ శుక్రవారం 'ఎక్స్'లో స్పందించారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్న భారతీయులైనా ఇది గర్వించదగ్గ క్షణం అన్నారు. కాలానికి అతీతమైన మన జ్ఞానానికి, గొప్పదైన సంస్కృతికి దక్కిన గుర్తింపు ఇది అని చెప్పారు. శతాబ్దాలుగా మన నాగరికత, చైతన్యాన్ని భగవద్గీత, నాట్యశాస్త్రం పెంచి పోషించాయని చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ కేంద్రంగా దేశ సాంస్కృతిక జ్ఞానాన్ని ప్రతిష్ఠాపన చేయడానికి నరేంద్ర మోదీ నాయకత్వంలో నిర్విరామంగా కృషి జరుగుతోందని, దానికి లభించిన గుర్తింపే ఇది అని అమిత్ షా అన్నారు. వీటితో ఇప్పటివరకు మన దేశానికి చెందిన మొత్తం 14 ప్రతులకు స్థానం లభించినట్లయిందని షెకావత్ తెలిపారు. మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో మానవ జాతి వారసత్వానికి సంబంధించిన పుస్తకాలు, రాతప్రతులు, మ్యాప్స్, ఫొటోలు, ఆడియో, వీడియో రికార్డులకు చోటు కల్పిస్తారు. భగవద్గీత, నాట్యశాస్త్రంతో పాటు 74డాక్యుమెంటరీలకు కొత్తగా ఆ రిజిస్టర్‌లో స్థానం లభించింది.

యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధిస్తారన్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. రూ.2 వేలు పైబడిన యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ వేయాలని కేంద్రం యోచిస్తోందంటూ కొన్ని వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ వార్తలపై శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ స్పందించింది. అవన్నీ పూర్తిగా తప్పుదోవ పట్టించే, నిరాధార, తప్పుడు వార్తలని తెలిపింది. ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనేదీ ప్రభుత్వం వద్ద లేదని స్పష్టం చేసింది. యూపీఐ లావాదేవీలపై ప్రస్తుతం ఎలాంటి మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) రుసుములు వసూలు చేయడం లేదని, అలాగే ఆయా లావాదేవీలపై జీఎస్టీ కూడా విధించడం లేదని వెల్లడించింది.

'శాటిలైట్ టోల్'పై నిర్ణయం తీసుకోలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: దేశవ్యాప్తంగా శాటిలైట్ ఆధారిత టోల్ వ్యవస్థ అమలుకు సంబంధించి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. వచ్చే మే 1 నుంచి శాటిలైట్ ఆధారిత టోల్ వ్యవస్థ అమల్లోకి రానున్నట్టు మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో ఈమేరకు మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చింది. టోల్ ప్లాజాల ద్వారా వాహనాలు సజావుగా వెళ్లేందుకు, ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకుగాను ఎంపిక చేసిన టోల్ ప్లాజాల వద్ద 'ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్)-ఫాస్టాగ్ ఆధారిత బారియర్‌లెస్ టోలింగ్ వ్యవస్థ'ను అమలు చేయనున్నట్టు ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ అడ్వాన్స్‌డ్ టోలింగ్ వ్యవస్థ.. వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించే ఏఎన్‌పీఆర్ టెక్నాలజీ, ప్రస్తుత ఫాస్టాగ్ వ్యవస్థను విలీతం చేస్తుందని తెలిపింది.

రాష్ట్రపతికి గడువు పెట్టి ఉండాల్సింది కాదు

» సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రస్తోగి వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: రాష్ట్రపతికి బిల్లుల విషయంలో గడువు విధించడం సరికాదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 రాష్ట్రపతిని ఆదేశించేందుకు సుప్రీంకోర్టుకు అధికారం ఇవ్వలేదని చెప్పారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్నారు. కాగా.. సుప్రీంకోర్టుపై ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ చేసిన విమర్శలను సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ తప్పుపట్టారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లు మంత్రి మండలి సలహా మేరకు విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. అలాకాకుండా బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తనవద్దే పెట్టుకోవడం శాసనవ్యవస్థ అత్యున్నత అధికారాల్లోకి చొరబడటమేనన్నారు.

35 ఎఫ్‌డీసీ మందులకు సీడీఎస్‌సీవో అనుమతి లేదు

» ఆ కొత్త మందులతో ప్రజారోగ్యానికి ప్రమాదం

» తక్షణమే చర్యలు తీసుకోండి.. రాష్ట్రాలకు డీసీజీ లేఖ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్ లైసెన్సింగ్ అథారిటీ అనుమతులు లేని 35 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) మందుల ఉత్పత్తి, అమ్మకాలు, పంపిణీ కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డ్రగ్స్ కంట్రోలర్ జనరల్(డీసీజీ) సూచించారు. ఈమేరకు డీసీజీ అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల డ్రగ్స్ కంట్రోలర్లకు లేఖ రాశారు. 'ఇప్పటికే మార్కెట్లో వివిధ రకాల ఎఫ్‌డీసీ మందులు అందుబాటులో ఉన్నాయి. వాటిని పరిశీలించినపుడు సక్రమమైన అనుమతులు పొందకుండానే కొన్ని ఎఫ్‌డీసీ మందులను తయారు చేసి, పంపిణీ చేస్తూ అమ్ముతున్నారని గ్రహించాం. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత డ్రగ్ కంట్రోలర్లు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలి. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీవో) అనుమతి తీసుకోకుండా మార్కెట్‌లోకి వచ్చిన ఎఫ్‌డీసీ మందులు నిబంధనల ప్రకారం 'కొత్త మందు' కిందకు వస్తుంది. సక్రమ నిర్ధారణ లేకుండా కొత్త మందులు మార్కెట్లోకి వస్తే ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుంది. కనుక చట్ట నిబంధనలను అనుసరించి మందుల తయారీకి లైసెన్సులు మంజూరు చేయాలని కోరుతున్నాం. సీడీఎస్‌సీవో అనుమతి లేకుండా ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న 35 రకాల ఎఫ్‌డీసీ మందుల జాబితా ఇస్తున్నాం. అధికారులు తగు చర్యలు వెంటనే తీసుకోవాలి. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ 1940 సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి" అని రాజీవ్‌సింగ్ రఘువంశీ పేర్కొన్నారు.

మా చట్టాలు ఉల్లంఘించొద్దు!



(మొదటి పేజీ తరువాయి)

అధిక ప్రాధాన్యం ఇస్తోందని, చట్టాలను ఉల్లంఘించి దేశంలోకి చొరబడేవారిని స్వాగతించబోమని పేర్కొన్నారు. భారతీయుల బంధువులతో సహా అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారంతా స్వచ్ఛందంగా తమ దేశానికి తిరిగి వెళ్లిపోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. 'మీ స్వదేశాలకు తిరిగి వెళ్లడానికి ఇంకా అవకాశం ఉంది. అందుకోసం డీహెచ్ఎస్‌ను సంప్రదించాలి. లేదా సీబీపీ యాప్‌ను ఉపయోగించాలి' అని మార్గరెట్ సూచించారు. కాగా, 2023-24 విద్యా సంవత్సరంలో 3.3 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు అమెరికాలోని ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందారు. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 23 శాతం అధికం. అయితే ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసాల సంఖ్య 30శాతం తగ్గుదల నమోదైంది

విదేశీ విద్యార్థులకు గడ్డుకాలం

అమెరికాలో విదేశీ విద్యార్థులకు గడ్డుకాలం నడుస్తోంది. గత కొన్ని వారాల వ్యవధిలోనే వెయ్యి మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను, వారి చట్టబద్ధ హోదాను ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ బాధితుల్లో పలువురు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థుల చట్టపరమైన హోదాను రద్దు చేయడానికి ఫెడరల్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వందలాది మంది నిర్బంధం, బహిష్కరణ ముప్పు ముంగిట్లో నిలిచారు. చిన్నచిన్న కాలేజీలతో పాటు హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రైవేట్ వర్సిటీలు, యూనివర్సిటీ ఆఫ్ మేరీలాండ్, ఒహియో స్టేట్ యూనివర్సిటీ వంటి పెద్ద ప్రభుత్వ సంస్థల్లోని విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. అసోసియేటెడ్ ప్రెస్ అంచనాల ప్రకారం.. గత మార్చి చివరివారం నుంచి ఇప్పటి వరకూ అమెరికా వ్యాప్తంగా 160 కాలేజీలు, వర్సిటీలకు చెందిన కనీసం 1,024 మంది విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి. ఇంత హఠాత్తుగా తమ వీసాలు రద్దు చేయడానికి ప్రభుత్వం వద్ద సమర్థనీయ కారణాలేవీ లేవని డీహెచ్ఎస్‌కు వ్యతిరేకంగా కోర్టుల్లో దావాలు వేస్తున్న విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

వీసాల రద్దు ఎందుకంటే...?

అనేక కారణాల వల్ల వీసాలు రద్దయ్యే అవకాశం ఉన్నప్పటికీ ట్రాఫిక్ ఉల్లంఘనల వంటి చిన్న కారణాలే ఎక్కువగా ఉన్నాయని.. అదీ చాలాకాలం క్రితం నాటి ఘటనలు కూడా ఇప్పుడు తెరపైకి తెస్తున్నారని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నాయి. మరికొన్ని కేసుల్లో అసలు తమను ఎందుకు టార్గెట్ చేశారో అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో విదేశీ విద్యార్థి వీసాలను రద్దుచేసే విధానాన్ని డీహెచ్ఎస్ పాటిస్తోందని అర్థమవుతోందని మిషిగాన్ వర్సిటీ న్యాయవాదులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. డార్ట్‌మౌత్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న చైనా విద్యార్థి వీసా రద్దు చేసిన కేసులో న్యూహాంప్‌షైర్ ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి దాన్ని కొట్టివేస్తూ గత వారం ఉత్తర్వులు జారీ చేశారు. జార్జియా, కాలిఫోర్నియాల్లోనూ న్యాయవాదులు ఇటువంటి వ్యాజ్యాలను దాఖలు చేశారు. అయితే ఈ పరిణామాలపై డీహెచ్ఎస్ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. ఒకటి రెండు కేసులు మినహా చాలా కేసుల్లో పాలస్తీనా అనుకూల కార్యకలాపాల్లో తమ విద్యార్థులు పాల్గొన్న దాఖలాలు లేవని కాలేజీలు సైతం స్పష్టం చేస్తున్నాయి.

విద్యార్థుల్లో భయాందోళనలు

చట్టబద్ధమైన హోదా కోల్పోయిన విద్యార్థులు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. లేకుంటే వారిని ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించే ప్రమాదం ఉంది. అరెస్టు భయంతో ఇప్పటికే కొంతమంది విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే వదిలేసి అమెరికా విడిచి స్వదేశాలకు వెళ్లిపోయారు. వీసాల రద్దుపై ప్రభుత్వంతో సంప్రదిస్తున్నామని చెబుతూ కొన్ని కాలేజీలు తమ విద్యార్థులకు భరోసా కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రయాణ సమయంలో వీసా, పాస్‌పోర్టుతో పాటు ఇతర కీలక పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచిస్తున్నాయి. అయితే అరెస్టులు, వీసా రద్దు వంటి చర్యలు అంతర్జాతీయ విద్యార్థుల్లో అమెరికా పట్ల విముఖత కలిగిస్తాయని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ కారణంగా తమ వీసాను రద్దు చేస్తున్నారో స్పష్టత లేకపోవడం వారిలో భయాందోళనలకు కారణమవుతున్నాయని పేర్కొంటున్నారు.

విద్యార్థి వీసాల రద్దుపై కాంగ్రెస్ ఆందోళన

విదేశీ విద్యార్థుల వీసా రద్దు కేసుల్లో 50శాతం భారతీయులవేనని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ (ఏఐఎల్ఏ) పేర్కొనడంపై కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏఐఎల్ఏ విడుదల చేసిన ప్రకటనను కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ 'ఎక్స్'లో షేర్ చేశారు. వీసా రద్దుకు కారణాలు స్పష్టంగా లేకపోవడం భయాందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అసలు ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి దృష్టికి తీసుకెళ్లారా అని ఆయన ప్రశ్నించారు. కాగా, న్యాయవాదులు, విద్యార్థులు, వివిధ వర్సిటీల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం 327 మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దయ్యాయని, వారిలో సగం మంది భారత్ నుంచి వచ్చినవారు కాగా, మరో 14శాతం మంది చైనీయులని ఏఐఎల్ఏ వెల్లడించింది. బాధితుల్లో బంగ్లాదేశ్, నేపాల్, దక్షిణ కొరియా విద్యార్థులు కూడా ఉన్నారని తెలిపింది.

ఎలాన్ మస్క్‌కు ప్రధాని మోదీ ఫోన్





న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 : ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఈ సందర్భంగా తామిద్దరం భావించినట్లు ప్రధాని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ ఏడాది వాషింగ్టన్ డీసీలో తామిద్దరం సమావేశమై మాట్లాడుకున్న అంశాలూ తమ మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలిపారు. టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాల్లో అమెరికాతో మరిన్ని భాగస్వామ్యాలు పెంపొందించుకోవాలని భారత్ కృతనిశ్చయంతో ఉందని ప్రధాని మస్క్‌కు వివరించారు. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలకవర్గంలో మస్క్ కీలకంగా ఉన్నారు. ఆయన సంస్థ టెస్లా భారత్‌లో ఒక ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. అంతేగాక మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ ద్వారా 'స్టార్ లింక్' అత్యధిక వేగ ఇంటర్‌నెట్ సేవలను భారత్‌లో అందించేందుకు రిలయన్స్ జియో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది.

లోకం తీరు



ట్రంప్ దూకుడుకు కోర్టుల బ్రేకులు!

వాషింగ్టన్, ఏప్రిల్ 18: రెండో సారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చూపుతున్న దూకుడుకు అమెరికాలోని కోర్టులు బ్రేకులు వేస్తున్నాయి. వలస వచ్చినవారిని మూకుమ్మడిగా, వేగంగా వారి స్వదేశాలకు తిప్పిపంపేందుకు ట్రంప్ అమల్లోకి తెచ్చిన కొత్త పాలసీని నిలిపివేస్తూ అమెరికాలోని బోస్టన్ జిల్లా జడ్జి బ్రియాన్ మర్ఫీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా అమెరికాలోని వలసదారులు తమకు స్వదేశాల్లో ప్రాణహాని ఉందని, తిరిగి వెళితే తీవ్రంగా హింసిస్తారనే ఆందోళన వ్యక్తం చేస్తే.. వెంటనే తిప్పి పంపేయరు. ఈ అంశాన్ని లోతుగా పరిశీలించి, వలసదారులు చెప్పినది సరైనదే అయితే అమెరికాలోనే ఉండనిస్తారు. లేకుంటే తిప్పిపంపుతారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుంది. కానీ ట్రంప్ సర్కారు వేగంగా, మూకుమ్మడిగా వలసదారులను తిప్పిపంపేందుకు ఈ ప్రక్రియను పక్కనపెడుతూ కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. దాని అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ బోస్టన్ జిల్లా జడ్జి సుమారు నెల రోజుల క్రితమే ఆదేశాలు ఇచ్చారు. కోర్టులో వేసిన పిటిషన్లను, వివిధ అంశాలను పరిశీలించి.. కోర్టులో విచారణ ముగిసేవరకు కొత్త పాలసీని నిలిపివేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ప్రభుత్వ ఖర్చు తగ్గించే క్రమంలో పలు ఫెడరల్ సంస్థల రద్దు, ఉద్యోగుల తొలగింపు దిశగా ట్రంప్ సర్కారు చేపట్టిన చర్యలకు మరో జిల్లా జడ్జి చెక్ పెట్టారు. 'వినియోగదారుల ఆర్థిక రక్షణ బ్యూరో (సీఎఫ్‌పీబీ)'ను రద్దు చేసి, అందులోని సుమారు 15 వందల మంది ఉద్యోగులను తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని కొలంబియా జిల్లా జడ్జి అమీ బెర్మన్ జాక్సన్ నిలిపివేశారు. ఈ బ్యూరోను కొనసాగించాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ ముగిసి, తీర్పు ఇచ్చేవరకు ఉద్యోగులెవరినీ తొలగించవద్దని ఆదేశించారు.

కులవివక్ష అంతానికి 'రోహిత్ వేముల' చట్టం చేయండి

కర్ణాటక సీఎంకు రాహుల్‌గాంధీ లేఖ

న్యూఢిల్లీ/బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా భారత విద్యావ్యవస్థలో కులవివక్ష పోలేదని.. దీనికి స్వస్తి పలికేందుకు కర్ణాటకలో 'రోహిత్ వేముల చట్టం' తీసుకురావాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ సీఎం సిద్దరామయ్యకు సూచించారు. ఈ మేరకు ఈ నెల 16న లేఖ రాశారు. దానిని శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కులవివక్ష కారణంగా హెచ్‌సీయూకు చెందిన దళిత విద్యార్థి రోహిత్ వేముల 2016లో ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. "ప్రతిభావంతులైన రోహిత్ వేముల, పాయల్ తడ్వీ(మహారాష్ట్ర), దర్శన్ సోలంకీ (ముంబై) (ఆత్మ)హత్యలను ఎంత మాత్రం ఆమోదించలేం. దీనికి అంతం పలకడానికి ఇదే సమయం. అంబేడ్కర్, రోహిత్ సహా కోట్ల మందిలా మరే పిల్లవాడూ ఎదుర్కోకుండా రోహిత్ వేముల చట్టం చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరుతున్నా" అని తెలిపారు.

అగ్ని-5ని మించి.. ధ్వని


» 6వేల నుంచి 10 వేల కిలోమీటర్ల రేంజ్!.. డీఆర్‌డీవో ఘనత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: రక్షణ పరిశోధనల్లో పలు అద్భుతాలు సాధిస్తున్న మన డీఆర్‌డీవో.. ధ్వని హైపర్‌సానిక్ గ్లైడ్ వెహికల్ (హెచ్‌జీవీ) ఫుల్ స్కేల్ మోడల్‌ను ఇటీవలే ఆవిష్కరించడం ద్వారా ప్రపంచం దృష్టిని మరోసారి ఆకర్షించింది. దాదాపు 29.5 మీటర్ల పొడుగు, 8 అడుగుల వెడల్పు ఉండే ఈ ధ్వని హెచ్‌జీవీ రేంజ్ ఎంతో డీఆర్‌డీవో వర్గాలు బయటకు వెల్లడించనప్పటికీ.. అది మన అమ్ములపొదిలో ఇప్పటికే ఉన్న అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి రేంజ్ (5,500 కి.మీ) కన్నా ఎక్కువగా (6-10 వేల కిలోమీటర్ల దాకా) ఉంటుందని సమాచారం. అంటే.. మనదేశంలోని లాంచ్ సైట్ల నుంచి ఆసియా, యూరోప్‌తోపాటు ఉత్తర అమెరికాలోని కొన్ని భాగాల్లోని లక్ష్యాలను సైతం ఇది ఛేదించగలదు. కాగా.. ధ్వని హెచ్‌జీవీ ప్రయాణించే తీరు ప్రత్యేకంగా ఉంటుందని, తొలుత బాలిస్టిక్ బూస్ట్ దశ.. తర్వాత ఎక్స్‌టెండెడ్ గ్లైడ్ దశతో అది హైపర్‌సానిక్ వేగంతో సుదూరతీరాలకు ప్రయాణిస్తుందని రక్షణ నిపుణులు చెబుతున్నారు. గాల్లో వెళ్తుండగానే దిశ మార్చుకోగలిగే సామర్థ్యం ఉండే హెచ్‌జీవీలను సంప్రదాయ క్షిపణి రక్షణ వ్యవస్థలతో అడ్డుకోవడం దాదాపు అసాధ్యం.

ఐఎస్ఎస్‌కు భారతీయ వ్యోమగామి

» యాక్సియం-4 మిషన్‌లో భాగంగా మేలో వెళ్లనున్న పైలట్ శుభాన్షు

» రాకేశ్‌శర్మ తర్వాత ఓ భారతీయుడు రోదసిలోకి వెళ్లడం ఇదే తొలిసారి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భారత వాయుసేన పైలట్, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా.. వచ్చే నెలలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కి వెళ్లనున్నారు. భారత అంతరిక్ష పరిశోధనల సంస్థ (ఇస్రో) ప్రాజెక్టులను శుక్రవారం ఇక్కడ సమీక్షించిన కేంద్ర మంత్రి జితేంద్రసింగ్.. ఈ విషయాన్ని వెల్లడించారు. శుక్లా చేయబోయే ఈ ప్రయాణాన్ని ఆయన.. అంతరిక్ష అన్వేషణల నవశకంలోకి భారత్ ధైర్యంగా వేస్తున్న అడుగులకు సంకేతంగా, అంతర్జాతీయ అంతరిక్ష భాగస్వామ్యాల విస్తరణలో ఇండియా అధిగమిస్తున్న కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ అంతర్జాతీయ భాగస్వామ్యాలు, గగన్‌యాన్ వంటి ప్రాజెక్టులు.. స్పేస్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలన్న భారతదేశ చిత్తశుద్ధిని ప్రతిఫలిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే, శుక్లా ఐఎస్ఎస్‌కు వెళ్లేది ఇస్రో చేపట్టిన మిషన్‌లో భాగంగా కాదు. అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ 'యాక్సియం స్పేస్' చేపట్టిన 'యాక్సియం 4' మిషన్‌లో భాగంగా మరో ముగ్గురు విదేశీ వ్యోమగాములతో కలిసి ఆయన వెళ్లనున్నారు. అమెరికన్ వ్యాపారదిగ్గజం ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ వ్యోమనౌక క్రూడ్రాగన్ వారిని ఐఎస్ఎస్‌కు చేరవేయనుంది. ఫ్లోరిడాలోని కెనెడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా క్రూడ్రాగన్‌ను దిగువ భూ కక్ష్యలోకి ప్రవేశపెడతారు. అమెరికన్ వ్యోమగామి, నాసాకు చెందిన పెగ్గీ వాట్సన్ కమాండర్‌గా ఉండే ఈ మిషన్‌లో.. శుక్లా పైలట్‌గా వ్యవహరిస్తారు. వీరితో పాటు.. పోలండ్‌కు చెందిన స్వావోష్ ఊజ్‌నైన్‌స్కీ, హంగరీకి చెందిన టైబోర్ కాపూ వెళ్లనున్నారు. ఆయా దేశాల నుంచి రోదసిలోకి వెళ్లనున్న తొలి వ్యోమగాములు వారే కావడం విశేషం. అలాగే.. రోదసి నుంచి భారతదేశం ఎలా కనపడుతోందని అడిగితే.. 'సారే జహాఁసే అచ్ఛా' అంటూ తొలి భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ జవాబిచ్చిన నాలుగు దశాబ్దాల తర్వాత.. మరో భారతీయుడు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి!! ఈ మిషన్‌లో భాగంగా వారు రెండువారాలపాటు ఐఎస్ఎస్‌లోనే ఉంటారు. శుక్లా ఈ రెండువారాలూ అక్కడ పలు ప్రయోగాలు చేయనున్నారు.

శుక్లా నేపథ్యం..

శుభాన్షు శుక్లా 1985లో యూపీలోని లఖ్‌నవూలో జన్మించారు. 2006 జూన్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ వింగ్‌లో చేరారు. ఎస్‌యు-30 ఎంకేఐ, మిగ్ 21, మిగ్ 29, జాగ్వార్, హాక్, డోర్నియర్, ఏఎన్-32 సహా పలు రకాల విమానాలను 2000 గంటల పాటు నడిపి అపార అనుభవాన్ని గడించారు. 2024 నాటికి గ్రూప్‌కెప్టెన్ స్థాయికి చేరుకున్నారు. తన కెరీర్‌లో ఎన్నో అవార్డులు, పతకాలు సాధించిన శుక్లాకు 2019లో ఇస్రో నుంచి పిలుపు వచ్చింది. దరిమిలా ఆయన మాస్కో(రష్యా)లోని యూరీ గగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లో వ్యోమగామి శిక్షణ పొందారు. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు ఆయన్ను వ్యోమగామిగా ఎంపిక చేసినట్టు ప్రధాని మోదీ 2024 ఫిబ్రవరి 27న ప్రకటించారు.2024లోనే.. యాక్సియం 4 మిషన్‌కు ప్రధాన వ్యోమగామిగా శుక్లా ఎంపికయ్యారు. ఈ మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు వెళ్లడం వల్ల.. స్పేస్‌ఫ్లైట్ ఆపరేషన్స్, లాంచ్ ప్రోటోకాల్స్ వంటివాటిలో అనుభవం సంపాదించే అవకాశం ఆయనకు లభిస్తుంది. గగన్‌యాన్ మిషన్‌లో ఈ అనుభవాలు ఆయనకు ఎంతగానో ఉపకరిస్తాయి.

ఎడారిలో వసంతం



థార్ ఎడారి విస్తరించి ఉన్న ప్రాంతంలోని ఓ గ్రామం

థార్ ఎడారిలో పచ్చదనం పరవళ్లు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భూమిపై అత్యంత వేడి ప్రాంతాల్లో థార్ ఎడారి కూడా ఒకటి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఎడారుల విస్తీర్ణం కూడా పెరుగుతూ ఉంది. కానీ.. భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న థార్ ఎడారి మాత్రం అందుకు భిన్నంగా పచ్చదనాన్ని పరుచుకుంటోంది. ఎటు చూసినా ఇసుక తప్ప మరేమీ కనిపించని ఈ ఎడారిలో గత రెండు దశాబ్దాలుగా వృక్ష సంపద ఆశ్చర్యకరంగా 38% పెరిగింది. ఒకప్పుడు ఇసుక దిబ్బలతో నిండి ఉన్న ఈ నేల క్రమంగా ఆకుపచ్చగా మారుతోందని ఉపగ్రహ డేటా స్పష్టం చేస్తోంది. భారత్‌లోని అతిపెద్ద ఎడారిలో ఈ అనూహ్యమైన మార్పునకు కారణం ఏమిటి..? అంటే.. వాతావరణ మార్పులు, మారుతున్న వర్షపాత నమూనాలు, మానవ ప్రయత్నాలు.. వెరసి ఇక్కడ పచ్చదనాన్ని తీసుకొస్తున్నాయని.. 'సెల్ రిపోర్ట్స్ సస్టెయినబిలిటీ'లో ప్రచురితమైన తాజా అధ్యయనం వెల్లడించింది. వాయవ్య భారతం, ఆగ్నేయ పాకిస్థాన్‌లలో సుమారు 2లక్షల చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్న థార్ ఎడారి ప్రాంతంలో సుమారు 1.6 కోట్ల మందికిపైగా నివసిస్తున్నారు. అధ్యయనంలో భాగంగా 2001 నుంచి 2023 వరకు ఉపగ్రహ చిత్రాలను పరిశోధకులు పరిశీలించారు. ఈ క్రమంలో థార్ ప్రాంతంలో రుతుపవనాల వర్షపాతం 64 శాతం పెరిగిందని వారు గుర్తించారు. కాలానుగుణ వర్షపాతంలో పెరుగుదల కారణంగా ఇక్కడ నేల తేమగా మారిందని, భూగర్భ జలాలు పెరగడంతో వృక్ష సంపద కూడా పెరిగిందని వారు తెలిపారు. పచ్చదనంతో పాటు మౌలిక సదుపాయాలు కూడా పెరిగి నివాసయోగ్యంగా మారడంతో వ్యవసాయం అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఎడారి నేల పచ్చగా మారడం ఆనందించదగ్గ విషయమే అయినప్పటికీ.. సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భూగర్భజలాల మితిమీరిన వినియోగం దీర్ఘకాలిక క్షీణతకు దారితీస్తుందని, ఇప్పుడిప్పుడే సాధిస్తున్న పురోగతికి ఇది ముప్పు వాటిల్లేలా చేస్తుందని చెబుతున్నారు. అలాగే పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా ఈ ప్రాంత జనాభాపై ప్రభావం చూపిస్తాయని అన్నారు. కాబట్టి సుస్థిర అభివృద్ధి అన్నిటికంటే ముఖ్యమని చెప్పారు. పునరుద్ధాదక శక్తి, స్మార్ట్ నీటి నిర్వహణ వ్యవస్థలపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

ఈ మార్పు మంచిదేనా..?

థార్ ఎడారిలో పచ్చదనం, నీటి వనరులు, వ్యవసాయం పెరగడం.. శుభపరిణామమే. అదేసమయంలో కొత్త ప్రమాదాలు కూడా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. వ్యవసాయం ఎక్కువగా చేస్తే ఆహార భద్రత ఉంటుంది. అయితే దీనికి వాతావరణం కూడా సహకరించాలి. భవిష్యత్తులో వాతావరణంలో విపరీతమైన మార్పులు వస్తాయని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వరదలు ముంచెత్తితే మౌలిక సదుపాయాలు దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అలాగే పెరుగుతున్న వృక్షజాలం కారణంగా స్థానిక జీవవైవిధ్యానికి ముప్పు తప్పదని, ముఖ్యంగా ఎడారి వాతావరణానికి అలవాటు పడిన జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెబుతున్నారు.

ఏపీ నిట్‌కు మళ్లీ 480 సీట్లే!

- మౌలిక వసతుల కల్పనకు రూ.438 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు
- మూడేళ్లుగా మంజూరు కాని నిధులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో ఈ ఏడాది కూడా 480 సీట్లకే అడ్మిషన్లు కల్పించనున్నారు. గతంలో 750 సీట్ల వరకు పెంచినా హాస్టల్ వసతి, అధ్యాపక సిబ్బంది లేరన్న కారణంగా సీట్లను కుదించేశారు. దీనివల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. ఏటా అడ్మిషన్లలో 50 శాతం రాష్ట్ర విద్యార్థులకు లభిస్తాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ విద్యార్థులు నష్టపోకుండా కేంద్రం సీట్లు పెంచింది. ఏపీ నిట్ ప్రారంభ దశలోనే 480 సీట్లు మంజూరు చేశారు. క్రమంగా ఆ సీట్ల సంఖ్య 750కి పెరిగింది. గత ప్రభుత్వంలో నిట్‌పై పెద్దగా ఆసక్తి చూపలేదు. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలోనూ విఫలమైంది. కాగా.. హాస్టల్స్, అడకమిక్ భవనాలు, ఫ్యాకల్టీ క్వార్టర్స్ నిర్మాణం కోసం రూ.438 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. మూడేళ్ల క్రితమే కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లినా ఇప్పటికీ నిధులు మంజూరు కావడం లేదు. ఫలితంగా ఏపీ నిట్‌లో అదనపు మౌలిక వసతుల కల్పనకు అడ్డంకి ఏర్పడింది.

ఈఏపీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- ఉన్నత విద్యామండలి చైర్మన్
- ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుమూర్తి

అమరావతి/నూజివీడు టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఈఏపీసెట్‌కు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి తెలిపారు. ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ చాన్స్‌లర్‌గా శుక్రవారం మంగళగిరిలోని మండలి కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్జీయూకేటీల్లో నాణ్యతా ప్రమాణాలు పెంచడానికి చర్యలు చేపడతామన్నారు. వసతులపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఆర్జీయూకేటీల్లో చదివిన విద్యార్థులకు మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు వస్తున్నాయని వెల్లడించారు. అన్ని కోర్సుల ప్రవేశ పరీక్షలకు తేదీలు ప్రకటించామని, పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో ఆర్థిక సంఘం చైర్మన్


శ్రీవారి ఆలయంలో అరవింద్ పనగారియా, మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులు

తిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం వేకువజామున జరిగిన సుప్రభాతం, అభిషేకం సేవలో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా, సభ్యులు పాల్గొని మూలమూర్తిని దర్శించుకున్నారు. వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పార్లమెంటరీ ఇండస్ట్రీ కమిటీ సభ్యులు, క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ శ్రీవారి సేవలో పాల్గొన్నారు.


టీటీడీ ఈవో బంగ్లాలోకి పాము

- పట్టేందుకు వెళ్లిన విశ్రాంత ఉద్యోగికి కాటు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ ఈవో శ్యామలరావు బంగ్లాలోకి గురువారం అర్ధరాత్రి నాగుపాము వచ్చింది. దీనిని పట్టుకునేందుకు టీటీడీ విశ్రాంత ఉద్యోగి రవీందర్ నాయుడు వెళ్లారు. నాగుపామును పట్టుకొని సంచిలో వేసే క్రమంలో ఆయన చేతిపై కాటు వేసింది. వెంటనే రవీందర్‌నాయుడును స్విమ్స్ అత్యసర విభాగానికి తీసుకెళ్లారు. వైద్యులు మెరుగైన చికిత్స అందించడంతో ఆయన కోలుకున్నారు. దీంతో రవీంద్రనాయుడును శుక్రవారం సాధారణ వార్డుకు మార్చారు.

నేడు 'ఇ-చెక్' థీమ్‌తో స్వచ్ఛాంధ్ర

- ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ చేపట్టండి
- సురక్షిత పద్ధతుల్లో రీసైక్లింగ్‌పై దృష్టి
- ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు
- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- మున్సిపల్ కమిషనర్లకు మంత్రి నారాయణ నిర్దేశం



అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర-2047' సంకల్పంలో భాగంగా ప్రభుత్వం ప్రతినెలా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 19వ తేదీన (శనివారం) 'ఇ-చెక్' థీమ్‌తో కార్యక్రమం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఇ-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడంపై దృష్టి సారించనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు శుక్రవారం ఎక్స్‌లో స్పందించారు. చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యమవుతుందని, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అధికారులు, కలెక్టర్లు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు, కార్పొరేట్ సంస్థలు, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎక్కడికక్కడ ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వీటి నిర్వహణకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక గ్రూపు సభ్యులను గుర్తించి, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అనేది ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రాల నినాదం కావాలని పేర్కొన్నారు. మరోవైపు శనివారం జరిగే స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది జనవరి నుంచి ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమం జరుగుతోందని, ఈ నెల 19న 'ఇ-చెక్' అనే థీమ్‌తో కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రాలుగా ఆర్ఆర్ఆర్ సెంటర్లు

ఇ-చెక్ అంటే అన్ని మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లు, దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి రీయూజ్ చేయడమని మంత్రి వివరించారు. ఇందుకోసం మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీల్లో ఉన్న ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్లను ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రాలుగా మార్చనున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. ఈ కేంద్రాల్లో ఇ-వ్యర్థాలు సేకరించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు. ఇళ్లు, దుకాణాల్లో ఉన్న పాడైపోయిన మొబైల్ ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రాల్లో ఇవ్వడం ద్వారా తగిన నగదు కూడా చెల్లిస్తారన్నారు. ఇదే సమయంలో మహిళలకు కూడా ఉపాధి కలుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో మొత్తం 222 ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు అందుబాటులోకి రానున్నట్లు మంత్రి చెప్పారు. శనివారం నుంచి జరిగే ఇ-వేస్ట్ కలెక్షన్ కోసం మున్సిపల్ కమిషనర్లు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని విజయవంతం చేయాలని సూచించారు. కాగా, మంత్రి శనివారం నెల్లూరులో స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమంలో పాల్గొంటారు.

చిరుత మృతిపై విచారణ ప్రారంభం

- పొన్నేటిపాళెంలో ఘటనాస్థలాన్ని పరిశీలించిన పీసీసీఎఫ్
- చిరుతను బంధించేందుకే ఉచ్చు: చలపతిరావు


పొన్నేటిపాళెం వద్ద చిరుత మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ చలపతిరావు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం పొన్నేటిపాళెం గ్రామం వద్ద చిరుత మృతిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చలపతిరావు పేర్కొన్నారు. శుక్రవారం చిరుత మృతిచెందిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. చిరుత తిరుగాడిన ప్రదేశం, చుట్టుపక్కల చిట్టడవి, నీటి కుంటల చుట్టూ అడవి జంతువుల పాదముద్రలను ఆయన పరిశీలించారు. వేటగాళ్ల ఉచ్చులో చిరుత ఎన్ని గంటలకు చిక్కుకుని ఉండవచ్చు, ఎంత సేపు బందీగా ఉండిపోయింది తదితర విషయాలను సబ్ డీఎఫ్‌వోను అడిగి తెలుసుకున్నారు. అలాగే చిరుతను రక్షించడానికి తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం చలపతిరావు మీడియాతో మాట్లాడుతూ వేటగాళ్లు కావాలనే చిరుతను బంధించేందుకు పకడ్బందీగా జీఐ తీగలతో ఉచ్చులు బిగించారన్నారు. వన్యప్రాణుల వేటపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టంచేశారు. అనంతరం మదనపల్లె అటవీశాఖ రేంజర్ కార్యాలయంలో పీసీసీఎఫ్ చలపతిరావు అంతర్గతంగా ప్రతిఅధికారిని విచారించారు. చిరుత చిక్కుకున్నప్పటి నుంచి ఏ చర్యలు తీసుకున్నారు. ఏ సమయానికి ఘటనా స్థలానికి చేరుకున్నారు.. అని ఆరా తీశారు. పొన్నేటిపాళెంకు చెందిన ఆరుగురు రైతులనూ పీసీసీఎఫ్ విచారించారు.

ఉమ్మడి కృష్ణాలో ఐదు రోడ్డు ప్రమాదాలు

ఎనిమిది మంది దుర్మరణం


ప్రసాదంపాడు వద్ద ప్రమాదానికి కారణమైన లారీ

విజయవాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లాలో శుక్రవారం జరిగిన ఐదు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇబ్రహీంపట్నం నుంచి ఫ్లైయాష్ లోడ్‌తో గన్నవరం వైపునకు వెళ్తున్న లారీ డ్రైవర్ రామకృష్ణకు ప్రసాదంపాడు వచ్చేసరికి గుండెపోటు రావడంతో వాహనాన్ని నియంత్రణ కోల్పోయాడు. లారీ ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి, ఫుట్‌పాత్ ఎక్కడంతో పాదచారుడు రామసాయి చనిపోయాడు. గుండెపోటుతో రామకృష్ణ ప్రాణాలు కోల్పోయాడు. జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామానికి చెందిన పసుమర్తి భాస్కరరావు (48), రుద్రపోగు వెంకటేశ్వర్లు (39) ఏసుక్రీస్తు మాల వేసుకుని శ్రమదీక్ష ప్రారంభించారు. దీక్ష విరమించడానికి గుణదలకు వస్తుండగా అనాసాగరం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పామర్రుకు చెందిన భవన నిర్మాణ రంగ కార్మికుడు ఆరేపల్లి శ్రీనివాసరావు(58) గుడివాడకు మోటారు సైకిల్‌పై వెళ్తూ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి చనిపోయాడు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన షేక్ బాబాసాహెబ్(51)ను సర్వీసు రోడ్డులో కారు ఢీ కొట్టడంతో మరణించాడు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్ కారులో విజయవాడ వస్తూ జగ్గయ్యపేటలో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రవీణ్ దుర్మరణం చెందాడు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

గొర్రెల కొనుగోలుకు వెళ్లి నలుగురి మృతి


రక్షణ గోడను ఢీకొట్టిన వాహనం


నాగభూషణం, మురళి, నాగరాజు

- మృతుల్లో ముగ్గురు శ్రీసత్యసాయి జిల్లా వాసులు
- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

హిందూపురం/రాయచూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ముగ్గురు, కర్ణాటకు చెందిన ఒకరు మృతి చెందారు. రాయచూరు జిల్లా శాహపూర్ తాలూకాలో జరిగే సంతలో గొర్రెలు కొనేందుకు వెళుతుండగా శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. వీరి వాహనం అదుపుతప్పి అమరపురం క్రాస్ వద్ద రోడ్డు పక్క రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం గ్రామానికి చెందిన నాగభూషణం(42), శీగుపల్లికి చెందిన మురళి(44), హిందూపురం మండలం కొటిపికి చెందిన నాగరాజు(40), కర్ణాటకలోని గౌరీబిదునూరు తాలూకా చిన్న బీరేపల్లికి చెందిన సోము(43) అక్కడికక్కడే మృతిచెందారు. వాహన డ్రైవర్ ఆనంద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ మార్గంలో వెళ్లేవారు గమనించి, సమాచారం ఇవ్వడంతో గబ్బూరు పోలీసులు అతన్ని రాయచూరులోని రిమ్స్‌కు తరలించారు. మృతదేహాలను రాయచూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారులో చెలరేగిన మంటలు

తిరుమలలో ఘటన



తిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా మంటలు చెలరేగి తిరుమలలో శుక్రవారం ఓ కారు దగ్ధమైంది. ఒంగోలుకు చెందిన నరేంద్ర ఐదుగురు కుటుంబ సభ్యులతో శుక్రవారం వేకువజాము 4.30 గంటలకు తిరుమల చేరుకుని, సీఆర్వో వెనుకభాగంలో కారు నిలిపారు. ఈ క్రమంలో కారు ఇంజన్ నుంచి పొగలురావడం మొదలయ్యాయి. దీంతో కారు దూరంగా వెళ్లి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చేలోపే భారీగా మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్టాలిన్ సమరం

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కదనోత్సాహంలో ఉన్నారు. రోజుకో కొత్త అస్త్రాన్ని ప్రయోగిస్తూ, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల యుద్ధంలో నెగ్గుకొచ్చి, మళ్ళీ అధికారాన్ని వశం చేసుకోవడం, కుమారరత్నం వారసత్వాన్ని సుదృఢం చేసుకోవడం కోసం ఆయన అహరహం శ్రమిస్తున్నారు. ఎదురుగా కనిపించే ప్రధాన రాజకీయశత్రువు అన్నాడీఎంకేతో కంటే, తమిళనాడులోకి జొరబడుతున్న బీజేపీతో మరింత ప్రమాదం ఉన్నది కనుక బలమైన అస్త్రాలన్నింటినీ ఆ పార్టీ మీదే ఎక్కువగా సంధిస్తున్నారు. నీట్ పరీక్ష వంటివి ముందుకు తెచ్చి, ఈ రెండుపార్టీల మధ్య మళ్ళీ పొత్తుపొడవకుండా చేయాలన్న స్టాలిన్ ప్రయత్నాలు అంతిమంగా ఫలించలేదు. రెండాకుల మీద ఆధారపడనిదే తమిళనాట సొంతంగా కమల వికాసం సాధ్యంకాదని బీజేపీ నాయకులకూ, కేంద్రం అండదండలు లేనిదే స్టాలిన్‌ను నెగ్గుకురాలేమని పళనికీ అర్థమైపోవడంతో మళ్ళీ పొత్తు చిగురించింది. మూడు ఎన్నికల్లో పెదవి విరిచిన జనం, రేపటిరోజున మెచ్చుతారా, అమిత్ షా అంటున్నట్టుగా 2026లో ఈ కూటమికే అధికారం కట్టబెడతారా అన్నది అటుంచితే, రాబోయే రోజుల్లో స్టాలిన్ రాజకీయయుద్ధం మరింత తీవ్రరూపం దాల్చడం తథ్యం.

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి తన చర్యలూ చేష్టలతో స్టాలిన్‌కు చేజేతులా మేలు చేశారు. స్టాలిన్‌ను ఇరకాటంలో పెట్టాలని, మూడుచెరువుల నీళ్ళు తాగించాలన్న ప్రయత్నంలో కాస్తంత అతిగా, దూకుడుగా పోయి పరువుపోగొట్టుకున్నారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఆయనతో పాటు, ఆయనను వెనకేసుకొస్తున్న బీజేపీ పెద్దలకు కూడా పెద్ద ఎదురుదెబ్బ. విపక్షపాలిత గవర్నర్లందరికీ పెద్ద హెచ్చరిక. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులమీద నిర్దిష్టకాలపరిమితిలోగా ఆమోద ముద్రవేయాలంటూ గవర్నర్లకు గడువు విధించిన ఆ తీర్పు ఫెడరల్ వ్యవస్థమీద, ప్రజాస్వామ్యం మీద గౌరవం ఉన్న అందరికీ నచ్చింది. రాష్ట్రపతికి కూడా ఆదేశాలిస్తారా, హద్దులుపెడతారా అంటూ ఇప్పుడు ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ ఆగ్రహిస్తున్నారు కానీ, పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా ఆయన ఎలా వ్యవహరించారో తెలియనిదేమీ కాదు. విపక్షాలు ఏలుతున్న రాష్ట్రాలన్నీ వరుసపెట్టి సుప్రీంకోర్టు శరణుజొచ్చవలసి వస్తూ, సదరు గవర్నర్లు అనునయంగా ఎంత చెప్పినా దారికిరానందువల్లనే రవి కేసులో సర్వోన్నత న్యాయస్థానం గట్టిగా, ఘాటుగా వ్యవహరించాల్సివచ్చింది.

ఈ తీర్పు అందించిన ఉత్సాహం కాబోలు, ఇప్పుడు స్టాలిన్ రాష్ట్రాల స్వయంసాధికారతమీద ముగ్గురు సభ్యులతో ఒక ఉన్నతస్థాయి కమిటీ ప్రకటించారు. బీజేపీ ఏలుబడిలో రాష్ట్రాల హక్కులన్నీ హరించుకుపోతున్న నేపథ్యంలో, ఈ కమిటీ అవసరమని, రాజ్యాంగంలోని విధివిధానాలన్నింటినీ గుదిగుచ్చి, సమీక్షించి, రాష్ట్రాల చట్టబద్ధ హక్కులను రక్షించడంతోపాటు, సహకార సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు దీని అవసరం ఉందని స్టాలిన్ అంటున్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మినహా మిగతా ఇద్దరికీ డీఎంకెతో ఉన్న అనుబంధం ఏనాటిదో నంటూ విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి. ఈ కమిటీ ఏర్పాటు లక్ష్యం తెలిసిందే కనుక, అది ఏమి చెప్పబెబుతున్నదో ఊహకు అందనిదేమీ కాదు. ఇక, ఇదేరీతిలో, అదే లక్ష్యంతో దాదాపు ఐదుదశాబ్దాల క్రితం రాజమన్నార్ కమిటీని అన్నాదురై నియమించడం, రాష్ట్రాలకు రాజ్యాంగం దఖలుపరిచిన అధికారాలు అన్నీఇన్నీ కావంటూ ఆ కమిటీ తన నివేదికలో కేంద్రాన్ని తీవ్రంగా తప్పుబట్టడం, స్టాలిన్ తండ్రి కరుణానిధి అందించిన ఈ నివేదికను ప్రధాని ఇందిరాగాంధీ తేలికగా కొట్టిపారేయడం చాలామందికి గుర్తు. సర్కారియా, పూంఛీ కమిషన్ల వంటివి ఎన్ని చెప్పినా కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చిందేమీ లేదు.

కేంద్రంతో స్టాలిన్ సాగిస్తున్న ఈ యుద్ధం వెనుక రాజకీయ అవసరాలు, ప్రయోజనాలు ఉన్నప్పటికీ, రాష్ట్రాల హక్కులు హరించుకుపోతున్న తరుణంలో ఇది అవసరం. నీట్, డీలిమిటేషన్ ఇత్యాది విషయాల్లో స్టాలిన్ వాదనలు విస్తృతమైన చర్చకు అవకాశం ఇచ్చాయి. విద్యమీద రాష్ట్రాలకు ఉన్న అధికారాలను హస్తగతం చేసుకొని కొత్త విద్యా విధానాన్నీ త్రిభాషా సూత్రాన్నీ రుద్దడం, వద్దూకాదూ అంటున్న రాష్ట్రాలను ఆర్థికంగా శిక్షించడం వంటివి జోరుగా సాగుతున్న కాలం ఇది. అడ్డుతోవలో సర్‌చార్జీలను తెచ్చి పన్నుల్లో రాష్ట్రాలకు అందించాల్సిన వాటాను సైతం కేంద్రం కుదించింది. జస్టిస్ జోసెఫ్ కురియన్ కమిటీ అసెంబ్లీ ఎన్నికల్లోగా మధ్యంతర నివేదిక సమర్పిస్తుంది కనుక, రాజకీయంగా స్టాలిన్ లక్ష్యం నెరవేరుతుంది. కానీ, అంతిమంగా వెలుగుచూడబోయే పూర్తినివేదిక కచ్చితంగా కేంద్రరాష్ట్ర సంబంధాలమీద కొత్త చర్చకు, మరింత లోతైన విశ్లేషణలకు వీలుకల్పిస్తుంది.

వినాశనబాటలో విశ్వవిద్యాలయాలు

'హార్వర్డ్ విశ్వవిద్యాలయం తన స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వాధీనం చేయబోదు. తన రాజ్యాంగ హక్కులు వదులుకోబోదు... ఏ పార్టీ ప్రభుత్వమైనా సరే ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఏమి బోధించాలి, ఏ విద్యార్థులను చేర్చుకోవాలి, ఏ సిబ్బందిని నియమించుకోవాలి, ఏ పరిశోధనలు జరపాలి అనే విషయాలు ఆదేశించజాలదు'... విశ్వవిద్యాలయ వ్యవహారాల నిర్వహణలో పాలకుల జోక్యానికి ప్రతిస్పందిస్తూ ఏ భారతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఇంత నిక్కచ్చిగా మాట్లాడి ఉంటారు? సమాధానం 'ఎవ్వరూ కారు' అని మాత్రమే.

ఈ కాలమ్ ప్రారంభ మాటలు హార్వర్డ్ విశ్వవిద్యాలయ (అమెరికా సంయుక్త రాష్ట్రాల కంటే పురాతన సంస్థ) అధ్యక్షుడు అలాన్ గార్బర్‌వి. ఈ ధరిత్రిపై తన కంటే శక్తిమంతుడు అయిన వ్యక్తి మరొకడు లేడని విశ్వసిస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలను గార్బర్ ధిక్కరించారు. అందుకు ఆగ్రహించిన ట్రంప్ హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధుల విడుదలను నిలిపివేశారు. అయినప్పటికీ శ్వేత సౌధ ఆసామీ ఆదేశాలను పాటించేందుకు హార్వర్డ్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. గత నెలలో మరో ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం కొలంబియాకు 400మిలియన్ డాలర్లను మంజూరు చేసేందుకు ట్రంప్ నిరాకరించారు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆయన షరతులకు కొలంబియా సమ్మతించింది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వెబ్‌సైట్ ప్రకారం జనవరి 25, 2023 నాటికి భారత్‌లో 1074 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు 460; డీమ్డ్ విశ్వవిద్యాలయాలు 128, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు 56, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు 430 వెరసి మొత్తం 1074. స్వాతంత్ర్య సాధనకు చాలా పూర్వమే 1857లో ప్రారంభమైన కలకత్తా, మద్రాస్, బొంబే విశ్వవిద్యాలయాలు కూడా వీటిలో ఉన్నాయి. యూజీసీ గవర్నర్–ఛాన్సలర్ మధ్య అభిప్రాయ విభేదాలు కారణంగా మద్రాసు విశ్వవిద్యాలయానికి ఆగస్టు 2023 నుంచి వీసీ నియామకం జరగనేలేదు.

పార్లమెంటు చేసిన చట్టాలు, యూజీసీ చట్టం–1956ను యూజీసీ అమలుపరుస్తున్న తీరుతెన్నుల పుణ్యమా అని భారతీయ విశ్వవిద్యాలయాలు స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించలేకపోతున్నాయి. యూజీసీ చట్టంలోని 12వ సెక్షన్ ప్రకారం బోధనా ప్రమాణాలను నిర్ణయించడం, పరీక్షలు, పరిశోధనల నిర్వహణకు విశ్వవిద్యాలయాలకు యూజీసీ నిధులు ఇస్తుంది. 1984లో సెక్షన్ 12ఎ ను చేర్చి సెక్షన్ 14ను సవరించడం ద్వారా యూజీసీ అధికారాలను విస్తృతపరిచారు. నిధుల పంపిణీ అధికారాలు ఉన్న కారణంగా యూజీసీ విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ప్రతి వ్యవహారంలోను నియమ విరుద్ధంగా జోక్యం చేసుకోవడం అధికమయింది. సదరు నిబంధనలు ఇచ్చిన అధికారాలతో ఒక విశ్వవిద్యాలయం స్వతంత్ర ప్రతిపత్తిని యూజీసీ పూర్తిగా హరించి వేయగలుగుతోంది.



విద్యావిషయక స్వేచ్ఛ కుదించుకుపోతోంది. యూజీసీ చట్టాన్ని రద్దు చేసి, పునః రూపొందించి, అమలుపరచని పక్షంలో విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తి ఒక సుదూర లక్ష్యంగా మాత్రమే ఉండిపోతుంది. పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో ఆర్థిక వనరులను సమకూర్చుకోకపోతే విద్యావిషయక స్వేచ్ఛ ఒక ఎండమావి అవుతుంది.

యూజీసీపై నియంత్రణ ద్వారా భావజాల పక్షపాతంతో వ్యవహరించే కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయ అధ్యాపకుల నియామకాలు, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, పరిశోధనా రంగాలు, పరీక్షల నిర్వహణను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తోంది. యూజీసీ నిర్దేశిస్తున్న కొన్ని అనుచిత నిబంధనలు: అధ్యాపకులు, ఇతర బోధనా సిబ్బంది విద్యార్హతలు, నియామకాలకు సంబంధించిన నిబంధనలు; నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్); నేషనల్ ఎలిజిబిలిటీ అండ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (నీట్); జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ); కామన్ యూనివర్శిటీ ఎంట్రెన్స్; ది లెర్నింగ్ అవుట్ కమ్స్ –బేస్డ్ ఫ్రేమ్‌వర్క్ (ఎల్ఓసీఎఫ్); చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్), నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్). వైస్ ఛాన్సలర్లు 'అవశిష్ట' అధికారాలను ఉపయోగించుకుంటున్న కారణంగా వీసీల ఎంపిక, నియామకం వ్యవహారాలను యూజీసీ తన నియంత్రణలోకి తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నది. నా అభిప్రాయంలో ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల బోధన, బోధనేతర సిబ్బంది, ముఖ్యంగా వీసీల ఎంపిక, నియామకాలలో యూజీసీకి పాత్ర లేదు, ఉండకూడదు. మరి యూజీసీ అటువంటి పాత్ర నిర్వహించేందుకు అనుమతిస్తే అది విశ్వవిద్యాలయాల జాతీయాకరణకు రంగాన్ని సిద్ధం చేయడమే అవుతుంది.

విశ్వవిద్యాలయాపై విస్తృత నియంత్రణ ఉన్నత విద్యారంగంలో పరిస్థితుల మెరుగుదలకు దోహదం చేస్తుందా? ఏ భారతీయ విశ్వవిద్యాలయానికి ప్రపంచ అగ్రగామి 100 విశ్వవిద్యాలయాలలో స్థానం లభించడం లేదు. అత్యున్నత ర్యాంక్ పొందిన భారతీయ ఉన్నత విద్యాసంస్థ బొంబే ఐఐటి. ఈ సంస్థకు లభించిన ర్యాంక్ 118. అక్టోబర్ 21, 2024 నాటికి కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టుల సంఖ్య 5182 అని ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. ఐఐటీ గ్రాడ్యుయేట్ల ఉద్యోగ నియామకాలు (ప్లేస్‌మెంట్స్) తగ్గిపోయాయని విద్యాశాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం వెల్లడించింది. 2021–22 నుంచి 2023–24 సంవత్సరాల మధ్య ఈ నియాకాలు పది శాతానికి పైగా తగ్గిపోయాయి. ఎన్ఐటీ గ్రాడ్యుయేట్ల ప్లేస్‌మెంట్‌లు కూడా 10.77 శాతం మేరకు తగ్గిపోయాయి. భారతీయ విశ్వవిద్యాలయాలలో శిక్షణపొంది నోబెల్ పురస్కారం పొందిన ఒకే ఒక్క భారతీయ శాస్త్రవేత్త సి.వి. రామన్ మాత్రమే.


విద్యావిషయక స్వేచ్ఛ కుదించుకుపోతోంది. ఇదొక ఆందోళనకరమైన పరిణామం. అసహన సమూహాలు జేఎన్‌యూ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, జమియా మిలియా, ఏఎమ్‌యూ, జాదవపూర్, జమ్ము సెంట్రల్ వర్శిటీలతో సహా పలు విశ్వవిద్యాలయాలు (వాటి అధ్యాపకులు, విద్యార్థులు)పై విమర్శానాస్త్రాలను సంధిస్తున్నాయి. భౌతిక దాడులకూ పాల్పడుతున్నాయి. యూజీసీ చట్టాన్ని రద్దు చేసి, పునః రూపొందించి, అమలుపరచనిపక్షంలో విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తి ఒక సుదూర లక్ష్యంగా మాత్రమే ఉండిపోతుంది. పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో ఆర్థిక వనరులను సమకూర్చుకోకపోతే విద్యావిషయక స్వేచ్ఛ ఒక ఎండమావి అవుతుంది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు బదులు సంపన్న కుటుంబాలు, కార్పొరేట్ సంస్థలు నిధులు సమకూర్చి ప్రమోట్ చేసే ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పెరిగిపోతాయి. వితరణశీలతే ఆ భాగ్యవంతుల సంకల్పం కావచ్చు కానీ ఫలితం మాత్రమే పక్కా వ్యాపారమే సుమా!

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

భారత ప్రస్థానం: జాలువారిన జ్ఞాపకాలు

గోపాల్‌కృష్ణ గాంధీ జీవన యాత్ర అష్ట పదులలోకి ప్రవేశించనున్నది. 22 ఏప్రిల్ 2020న ట్విట్టర్‌పై (అప్పటికింకా అది Xగా మారలేదు) ఒక థ్రెడ్ (ట్వీట్‌ల పరంపర)ను పోస్ట్ చేశాను. 'మన మధ్య నడయాడుతున్న ఒక విశిష్ట భారతీయుని 75వ జన్మదినోత్సవ సందర్భమిది: ఆ ప్రముఖుడు ప్రజాసేవకుడు, దౌత్యవేత్త, రచయిత, విద్వజ్జుడు గోపాల్‌కృష్ణ గాంధీ'. మాతృదేశానికి ఆయన అందించిన సేవలు, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, సౌహార్ద పూర్వకమైన నడవడి గురించి ప్రస్తుతిస్తూ చివరకు ఆయనకు నేను వ్యక్తిగతంగా ఎలా రుణపడి ఉన్నదీ పేర్కొన్నాను. ఆధునిక భారతదేశ చరిత్ర, మహాత్మాగాంధీ గురించి మరెవ్వరి కంటే కూడా ఎక్కువగా ఆయన నాకు బోధించారు'.

ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. మరి మూడు రోజుల్లో గోపాల్ 80వ వసంతంలోకి వెళ్లనున్నారు. ఇప్పుడు ఆయన, తన సొంత జీవన ప్రస్థానంతో సమాంతరంగా సాగిన మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య పురోగతి, తిరోగతిపై ఒక జ్ఞానదాయక గ్రంథాన్ని కానుకగా అందించడం ద్వారా నన్ను (ఇంకా ఎంతో మంది భారతీయులను) మరెంతగానో రుణగ్రస్తుడిని చేసుకున్నారు. తన విస్తృత అధ్యయనం, భారత్ గురించిన ప్రగాఢమైన అవగాహనతో చారిత్రక ఘటనల వృత్తాంతాలతో మేళవించిన వ్యక్తిగత జ్ఞాపకాల విలక్షణ చరిత్ర అది. ఆయన వచనం అద్భుతమైనది. మన ఆలోచనాశీలతను సునిశితం చేసేది, రచయిత స్ఫూర్తిదాయక జీవిత గమనాన్ని, మన రిపబ్లిక్ సమున్నత, సంక్షోభ భరిత ప్రస్థానాన్ని, మునుపెన్నడూ చూడని చాలా అరుదైన ఛాయచిత్రాలతో సహా అక్షరీకరించిన గ్రంథమది. హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ, తమిళ చలనచిత్రాల గురించిన ప్రేమ పూర్వకమైన ప్రస్తావనలు ఎన్నో ఉన్నాయి. సాహిత్యం, వైదుష్యం, ప్రజాసేవతో పాటు సినిమాలు సైతం ఆయన జీవితాన్ని ప్రభావదాయకంగా తీర్చిదిద్దాయన్నది స్పష్టం.



గోపాల్‌కృష్ణ గాంధీ 'Undying Light : A Personal History of Independent India' స్వతంత్ర భారతదేశ ప్రస్థానాన్ని వివరించింది. ఈ విశిష్ట కథనం, జాతి గమనాన్ని ప్రభావితం చేసిన ప్రధాన సంఘటనలు, వివాదాలను వ్యాఖ్యాన సహితంగా వర్ణించింది. 'భారత్ వెలుగు మసకబారవచ్చు కానీ అది అంతరించదు. భారత్ ఆత్మ తేజస్సు ప్రకాశిస్తూనే ఉంటుంది' అని గోపాల్ తన పుస్తకాన్ని ఈ ఆశావహమైన వాక్యంతో ముగించారు.

గోపాల్ తాజా గ్రంథం 'Undying Light : A Personal History of Independent India' స్వతంత్ర భారత తొలి సంవత్సరాలను, ప్రత్యేకించి మహాత్ముని చివరి నిరాహార దీక్షలు, ఆయన బలిదానం, నెహ్రూ–పటేల్ మధ్య విభేదాలు, దేశ హితానికై వారి సమన్వయ కృషి గురించి విశదమైన కథనాలతో ప్రారంభమవుతుంది. ఆ తరువాత కాలక్రమానుసారంగా ప్రతి సంవత్సరం గురించి క్లుప్త, ఉల్లాసకరమైన కథనాలతో కొనసాగి, చివరి దశాబ్దంన్నర కాలం గురించి ఒక ఏకీకృత అధ్యాయంతో ముగుస్తుంది.

స్వాతంత్ర్య ఆగమనం, దేశ విభజన తరుణంలో జన్మించిన గోపాల్‌కృష్ణ గాంధీ మన రిపబ్లిక్‌తో పాటు ఎదుగుతూ వచ్చారు. దేశభక్తి ప్రపూరితులైన తల్లిదండ్రులు దేవదాస్ (మహాత్ముని కుమారుడు), లక్ష్మి (రాజాజీ కుమార్తె) ఆయన మేధో పరిణామాన్ని ప్రభావితం చేశారు. తన తోబుట్టువులు తార, రాజ్‌మోహన్, రామచంద్ర గురించి కూడా గోపాల్ అవ్యాజ ప్రేమాదరాలతో రాశారు. ఇంకా వివాదాస్పద ప్రధానమంత్రులు, లోక విఖ్యాతులుకాని ఉపాధ్యాయులు, సంఘ సేవకులు, ఎంతో మంది ఆసక్తిదాయక ప్రభావశీల వ్యక్తుల గురించిన విశేషాలు కూడా మనకు గోపాల్ గ్రంథం ద్వారా తెలుస్తాయి. గోపాల్ తన మాతామహుడు చక్రవర్తుల రాజగోపాలాచారి (రాజాజీ) గురించి సహజంగానే ప్రముఖ ప్రాధాన్యంతో రాశారు. స్వతంత్ర భారతదేశంలో అత్యున్నత పదవిని అధిష్ఠించిన రాజాజీ, తన రాజకీయ జీవితోన్నతికి బాటలు వేసిన భారత జాతీయ కాంగ్రెస్‌ను విడనాడి 'స్వతంత్ర పార్టీ' అనే ప్రతిపక్షాన్ని వ్యవస్థాపించారు. 'తన జీవితంపై ఏకైక అతి పెద్ద ప్రభావం' తన మాతామహుడేనని గోపాల్ వివరించారు.

గోపాల్ పదే పదే ప్రస్తావించిన రెండో వ్యక్తి సాటిలేని సంగీత విదుషీమణి ఎమ్ఎస్ సుబ్బులక్ష్మి. కుటుంబ స్నేహితురాలు అయిన సుబ్బులక్ష్మి సంగీతం, సమున్నత వ్యక్తిత్వం గోపాల్ జీవితంపై ఒక అజరామరమైన ప్రభావం. ఆయనను బాగా ప్రభావితం చేసిన మూడో వ్యక్తి జయప్రకాశ్ నారాయణ్. ఆయన పరిపూర్ణ చిత్త శుద్ధి, ప్రశాంత వక్తృత్వం, ముఖ వర్చస్సు, అన్నిటినీ మించి ఆయన ఆంగ్ల భాషా గరిమ తనను బాగా ప్రభావితం చేశాయని గోపాల్ రాశారు. భారత్–చైనా సంఘర్షణ కాలంలో తన అభిమాని ఆహ్వానంపై జయప్రకాశ్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కళాశాలలో ఒక ఉపన్యాసం వెలువరించారు. 'స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతీయవాదం అంటే వలస పాలన నుంచి విముక్తికై పోరాడడం, కోల్పోయిన ఆత్మగౌరవాన్ని పునః సాధించుకోవడం, స్వావలంబన అహింసాత్మకంగా శాసనోల్లంఘన చేయడంగా వర్థిల్లిందని చెప్పారు. స్వాతంత్ర్య సాధన అనంతరం అసహనం, యుద్ధోన్మాదం, ఇరుగు పొరుగు దేశాలను బెదిరించడం, శ్రుతి మించిన దేశభక్తిని జాతీయ వాదంగా అర్థం చేసుకుంటున్నారని జయప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు'.



■ రామచంద్ర గుహ

గతానుగతం

గోపాల్ మనో ప్రపంచం నుంచి జాలువారిన ఈ జ్ఞాపకమూ, 1960ల్లో ప్రభుత్వ వ్యవహారాల్లో ఆంగ్లభాష వాడకాన్ని పూర్తిగా త్యజించేందుకు జరిగిన ప్రయత్నాలపై కథనమూ రెండూ నేరుగా వర్తమానంతో సంభాషించేవే. గోపాల్ ఇలా రాశారు: 'నేను బాధతప్త హృదయంతో నలిగిపోయాను. హిందీని అభిమానిస్తాను, అయితే దాని సామ్రాజ్యవాద డాంబికాన్ని ద్వేషిస్తాను. భాష విషయమై రాజాజీ భావాలతో ప్రభావితుడిని అయిన నేను అధికార భాషగా ఇంగ్లీష్‌కు స్వస్తిచెప్పాలన్న ప్రతిపాదనను ఎటువంటి మినహాయింపు లేకుండా తీవ్రంగా వ్యతిరేకించాను'.

గోపాల్‌కృష్ణ గాంధీ 'Undying Light : A Personal History of Independent India' స్వతంత్ర భారతదేశ ప్రస్థానాన్ని వివరించింది. ఈ విశిష్ట కథనం, జాతి గమనాన్ని ప్రభావితం చేసిన ప్రధాన సంఘటనలు, వివాదాలను వ్యాఖ్యాన సహితంగా వర్ణించింది. ఈ నేపథ్యంలో, కర్ణాటక సంగీత కచేరిలో గాత్ర విద్వాంసుడికి వాద్య సహకారం అందించే వాయులీన వాద్యకారుడు సృజించే నాద లయలా, గోపాల్ స్వీయ జీవనయానం మనకు అవగతమవుతుంది. ఐఏఎస్ అధికారిగా గోపాల్ ఉద్యోగ జీవితం గ్రామీణ తంజావూరు ప్రాంతంలో ప్రారంభమయింది. ఆ తొలినాళ్లలో ఆయన ఒక సిరియన్ క్రైస్తవుడు, ఒక తమిళ జైనుడు, ఒక ముస్లిమ్‌తో కలిసి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆ ఉద్యోగ జీవితం ఉచ్చదశలో రాష్ట్రపతి కార్యదర్శిగా, పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పని చేశారు. ఆ తరువాత మూడు ఖండాలలో నాలుగు దేశాలలో ఐదు వేర్వేరు దౌత్య బాధ్యతల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఈ ఉన్నత విధుల నిర్వహణ గురించి గొప్ప ఖచ్చితత్వం, స్పష్టతతో గోపాల్ రాశారు. దక్షిణాఫ్రికా, శ్రీలంక రాజకీయాలపై ఆయన ఆలోచనాత్మకమైన వృత్తాంతాలు ఎంతో విలువైనవి.

తమిళులు, బెంగాలీలు, ఢిల్లీవాలాలు ఆయనకు బాగా సుపరిచితులే అయినప్పటికీ ఈ సువిశాల భారతదేశంలోని సకల సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాల గురించి గోపాల్‌కు మంచి అవగాహన ఉన్నది. ఈశాన్య భారత సమస్యాత్మక సరిహద్దు ప్రాంతాలు, కశ్మీర్‌కు గోపాల్ తన కథనంలో సముచిత ప్రాధాన్యమిచ్చారు. ఆయన 'Undying Light' పలు ఆసక్తికరమైన ఉదంతాలను వెల్లడించింది. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైన తరువాత రాజాజీ, ఆయన కుమార్తె నామగిరి హైదరాబాద్‌ను సందర్శించారు. ఆ సందర్భంగా గవర్నర్–జనరల్ కుమార్తెకు నిజాం నవాబు వజ్రాలు పొదిగిన ఒక నెక్లెస్‌ను బహుమానంగా ఇచ్చారు. అయితే రాజాజీ ఆ ఆభరణాన్ని తీసుకునేందుకు అంగీకరించలేదు. వితంతువు అయిన తన కుమార్తెకు అటువంటి విలువైన ఆభరణాన్ని ఇవ్వటం సముచితం కాదని రాజాజీ అభిప్రాయపడ్డారు. ఆ తరువాత నామగిరి తన తండ్రి వైఖరిని ఆక్షేపించారు. వజ్రాల నెక్లెస్‌ను తిరిగి ఇచ్చివేస్తూ 'మేము గాంధీ గారి శిష్యులం. అంత ఖరీదైన వస్తువులు మాకు అవసరం లేదు' అని చెప్పి ఉండవలసింది.

గాంధీ, రాజాజీల మనుమడుగా గోపాల్‌కు తమ కుటుంబ విశిష్ట నేపథ్యం గురించి, ఆ గొప్పదనం తన జీవితోన్నతికి ఎలా దోహదం చేసిందో, అప్పుడప్పుడూ ఎలా ఆటంకమయిందో గోపాల్‌కు బాగా తెలుసు. న్యూఢిల్లీలోని తమ స్వగృహానికి నిత్యం ఎంతో మంది అసాధారణ వ్యక్తులు వస్తూ పోతుండడాన్ని బాల్యం నుంచి సన్నిహితంగా పరిశీలించిన గోపాల్ ఇలా రాశారు: 'హరిజన సేవ' విషయమై మా కుటుంబానికి ఉజ్వలమయిన యశస్సు ఉన్నది. అయితే మా కుటుంబ సన్నిహిత, స్నేహితులలో దళిత వ్యక్తి ఎవరూ లేరు. అవును, ఒక దళితుడు కూడా లేదు. మాకు ముస్లిమ్ క్రిస్టియన్, సిక్కు స్నేహితులు ఉన్నారు. అమెరికాలో ఆఫ్రికన్ అమెరికన్లు ఎంతో మంది మాకు స్నేహితులే. యూదు మతస్థులూ ఎంతో మంది మాకు స్నేహితులే. అయితే ఒక్క భారతీయ దళితుడు కూడా లేడు'.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి గోపాల్ ఇలా రాశారు: 'ఆయన పాత నౌక ఎస్.ఎస్ ఇండియాకు కొత్త కెప్టెన్ కాదు; కొత్త నౌక ఎస్.ఎస్ భారత్‌కు కొత్త సరంగు. పాత నౌకకు ప్రజాస్వామిక గణతంత్రవాదం, లౌకికవాదం అనే ఇంజన్లు ఉండగా కొత్త నౌక మెజారిటేరియన్ జాతీయవాదం, హిందుత్వ అనే ఇంజన్లతో నడుస్తున్నది'. డిసెంబర్ 1992లో బాబ్రీమసీదు కూల్చివేతకు సంబంధించిన కథనంలో గోపాల్ తన డైరీ నుంచి రెండు వ్యాఖ్యలను ఉటంకించారు: '30 జనవరి 1948 తరువాత భారతదేశ చరిత్రలో ఇది (6, డిసెంబర్ 1992న బాబ్రీ కూల్చివేత) 'చీకటి క్షణం' అని పేర్కొంటూ ఆయన ఒక ప్రశ్నను సంధించారు: 'మనం ఒక నాగరికత పతనం అంచున ఉన్నామా?'

'అన్‌డైయింగ్ లైట్ ముగింపు అధ్యాయంలో వర్తమాన భారతదేశం ఎదుర్కొంటున్న కొన్ని ప్రధాన సమస్యల గురించి గోపాల్ ప్రస్తావించారు. అవి: విశృంఖలంగా పర్యావరణ విధ్వంసం, మత విద్వేషం, రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి క్షీణించడం, రాజకీయ ఎజెండాలకు గతాన్ని ఆయుధంగా ఉపయోగించుకోవడం మొదలైనవి. గోపాల్‌కృష్ణ గాంధీ తన యవ్వనంలో ఆవాహన చేసుకుని, ఉద్యోగ, మేధో జీవితంలో స్ఫూర్తిదాయకంగా నిబద్ధమైన భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య ఆదర్శాలకు అవి పెనుసవాళ్లుగా పరిణమించాయి. అయినప్పటికీ గోపాల్ తన పుస్తకాన్ని ఈ ఆశావహమైన వాక్యంతో ముగించారు: 'భారత్ వెలుగు మసకబారవచ్చు కానీ అది అంతరించదు. భారత్ ఆత్మ తేజస్సు ప్రకాశిస్తూనే ఉంటుంది'.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

వెన్నాడుతున్న 'ఇంద్రవెల్లి' జ్ఞాపకాలు

అది ఏప్రిల్ 20, 1981. ఆదివాసీ గూడేలు, పల్లెలలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించే సభ ఉందని, అదే రోజు అంగడి కూడా ఉండడంతో రెండు పనులూ చూసుకువద్దామని, మన కొరకు పెట్టిన సంఘం వారు చెప్పేది విందాం అన్న ఉత్సాహంతో ఇంద్రవెల్లి సభకు గుంపులు గుంపులుగా కదిలారు ఆదివాసీలు.

ఈ సభకు వారం రోజుల ముందు నుంచే నిర్మల్, ఉట్నూర్, ఆదిలాబాద్ డివిజన్ ప్రజలకు రైతు కూలీ సంఘం వారు కరపత్రాలు పంచి, గూడేల ప్రజల సమస్యల పరిష్కారానికి సభకు రావాలని చాటింపు వేయించారు. పోలీసు అధికారుల అనుమతి కూడా తీసుకున్నారు. ఆ సభకు జనం తండోపతండాలుగా కదలడం చూసి ఇంద్రవెల్లి షావుకార్లు, దోపిడీదారులు, వలసవాదుల గుండెలు అదిరాయి. వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు అబద్ధపు సమాచారం ఇచ్చారు. 'ఆదివాసులు దాడులు చేయడానికి ఇంద్రవెల్లిని చుట్టుముడుతున్నారు. పల్లెలు, గోండు గూడేలు కదిలినాయి. మాకు ప్రాణ భయం ఉంది రక్షించండ'ని చెప్పడంతో, అప్పటి ఆదిలాబాద్ ఎస్పీ పోలీసు బలగాలను దించి, ఆదివాసీలను చుట్టుముట్టారు. అమాయక గోండు ప్రజలకు ఇదంతా అర్థం కాలేదు. దీనికి తోడు వారికి తెలుగు భాష అర్థం కాదు. పోలీసులకు గోండు భాష అర్థం కాలేదు. ఒక పోలీసు అధికారి వచ్చి 'ఇక్కడ (ఇంద్రవెల్లి) చుట్టపక్కల కూర్చోవడానికి, గుంపులు గుంపులుగా ఉండడానికి అనుమతి లేదు. వెళ్లిపోండి' అని హెచ్చరికలు జారీచేశారు. తొడసం కట్టి అనే ఆదివాసీ నాయకుడు లేచి ఆరు రోజుల ముందే సభ అనుమతి తీసుకున్నాం అన్నాడు. అతన్ని అరెస్టు చేశారు. కొంత మంది ముఖ్య నాయకులను 19వ తేదీనే అరెస్టు చేశారు. పోయినోళ్లను పోయినట్లే అరెస్టు చేస్తున్నారు. ఏం జరుగుతుందో వచ్చిన ప్రజలకు అర్థం కావడం లేదు. సభలో ఏం చెబుతారో, సమస్యలకు పరిష్కారం దొరుకుతుందేమోనని గుంపులు.. గుంపులుగా ఇంకా జనం వస్తూనే ఉన్నారు. సభ అయిన తరువాత అంగడి చేద్దామనుకున్నారు.

కనక హన్మంతు (నిజాం గూడ) రైతుకూలి సంఘం నాయకత్వంలో జనాన్ని కంట్రోల్ చేస్తున్నారు. జనం సభ స్థలానికి పోవడానికి తహతహలాడుతున్నారు. పోలీసులు పంపడం లేదు. విసుగు చెంది మన సభ, మన స్థలం ఎవరిదైనా గుంజుకుంటున్నామా! మన సభలో ఈ పోలీసులు ఎందుకూ! సభ స్థలంకై పోదం పదండని మహిళలు దండు పిట్టబొంగరం, వెట్టి ఇస్రూబాయి ధైర్యంతో ముందడుగు వేశారు. మహిళా దండు కదిలింది. అంతలోనే మగ పోలీసులు సభకు వెళ్లొద్దని ఆపే క్రమంలో మహిళల ఛాతీపై చేతులు వేసి వెనక్కి దొబ్బడంతో, కోపంతో ఆమె ఆ పోలీసును కొట్టి చంపింది. ఇదే అదునుగా పోలీసులు గోండు ప్రజలపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. భయంకరమైన శబ్దాలతో సభా ప్రదేశం దద్దరిల్లుతోంది. హాహాకారాలు, అరుపులు, కేకలు, ఏం జరుగుతుందో తెలియని స్థితి. గంట, గంటన్నర తరువాత చూస్తే భయంకరమైన దృశ్యాలు రక్తంతో భూమి తడిసింది. శరీరాల నుంచి రక్తం కారుతూనే ఉంది. శవాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఒకే లారీలో శవాలతో పాటు గాయాలతో ఉన్న వారిని, కొన ఊపిరితో కొట్టుకుంటున్నవారిని ఒకరి మీద ఒకరిని కట్టెల మోపులాగా వేయడంతో ఇంకొందరు ఊపిరాడక చనిపోయారు. ఆ కాల్పుల్లో 130 మంది వరకు చనిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కనిపించకుండా పోయిన వారి సంఖ్యకు అంతులేదు. ఆ సంఘటన తరువాత నుంచి వడ్గాం గ్రామం కనకరాము కనిపించకుండా పోతే కొన్ని నెలల తరువాత పోలీసులు వచ్చి అతడు కాల్పుల్లో మరణించాడని చెప్పి ఐదు వందల రూపాయలు చేతిలో పెట్టి పోయారు. ఇలా దాదాపు నాలుగున్నర దశాబ్దాల నుంచి జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉన్నాయి.

ప్రభుత్వాలు మారుతున్నాయి. అన్ని పార్టీలలో ఆదివాసీ నాయకులున్నారు. అయినా ఈ రోజుకీ అమరులందరినీ గుర్తించలేక పోతున్నారు. సమస్యల్ని పరిష్కరించలేకపోతున్నారు. గుర్తించిన అమరుల కుటుంబాలకైనా పరిహారం ఇచ్చారా అంటే అదీ లేదు. 45 ఏళ్ల క్రితం ఉన్న స్థితే నేటికీ కొనసాగుతోంది.



ప్రభుత్వాలు మారుతున్నాయి. నాయకులు మారుతున్నారు. అన్ని పార్టీలలో ఆదివాసీ నాయకులున్నారు. అయినా ఈ రోజుకీ అమరులందరినీ గుర్తించలేకపోతున్నారు. సమస్యల్ని పరిష్కరించలేకపోతున్నారు. గుర్తించిన అమరుల కుటుంబాలకైనా పరిహారం ఇచ్చారా అంటే అదీ లేదు. దోపిడీలు, షావుకార్ల, వడ్డీ వ్యాపారుల, చౌకీదార్ల, పోలీసుల బూటకపు హత్యలు, ఏజెన్సీ ఆదివాసీ రక్షణ చట్టాల ఉల్లంఘన... 45 సంవత్సరాల క్రితం ఉన్న స్థితే నేటికీ కొనసాగుతోంది. రూపాలు వేరు కాని దోపిడి పాతదే. ఆదివాసీ గోండుల సాంప్రదాయం ప్రకారం చనిపోయిన వారికి పూజలు కూడా చేయనీయకుండా, స్థూపాలు కట్టకుండా చేశారు. ఒకవేళ కట్టినా దొంగచాటుగా వాటిని కూల్చేసేవారు. 1982 నుంచి 1999 వరకు ఉన్న ప్రభుత్వాలు గ్రామాల్లో పోలీసు బలగాల పహారా ఏర్పరచి, నిషేధాజ్ఞలు పెట్టాయి. తెలంగాణ ఉద్యమంలో స్థూపం వద్దకు వచ్చిన నాయకులు ప్రమాణాలు చేసి, ఇంద్రవెల్లి అమరులు ఏ ఆశయం కోసం ప్రాణాలర్పించారో... తెలంగాణ వస్తే వారి ఆశయాలను నెరవేరుస్తామని చెప్పారు. నిషేధాజ్ఞలను ఎత్తివేస్తామని, ఆ ప్రదేశాన్ని స్మృతి వనం చేస్తామని, అటవీ హక్కుల చట్టాలు అమలుపరుస్తామని చెప్పారు.

2017లో ప్రస్తుతం ఉన్న అమరవీరుల స్థూపం స్థలంలో స్మరించుకోవడానికి, పూజకు అనుమతి కొరకు హైకోర్టులో ఈ వ్యాస రచయిత, తదితరులు కోర్టులో పిటిషన్ వేసి అనుమతి తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్, 20న పూజలు జరుగుతున్నాయి. 2017 నుంచి కోర్టు ఆదేశాలతో గూడేలలో పోలీసు కూంబింగ్ తగ్గించారు కానీ, 144 సెక్షన్ ఇప్పటికి అమలు చేస్తూనే ఉన్నారు.

ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఏజెన్సీ అటవీ హక్కుల చట్టాలు అమలుచేస్తామని నమ్మబలికి, పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్. ఇది ఎవరి అభివృద్ధి కోసం? ఆదివాసులు ఈ దేశ పౌరులు కాదా? అడవి, ఆదివాసులకు రక్షణ లేదు. ఎప్పుడేం జరుగుతుందోనని అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కు బిక్కుమంటు ఆదివాసులు రోజులు గడుపుతున్నారు. వారిని రక్షించడం ప్రభుత్వాల బాధ్యత కాదా?

■ ఆత్రం భుజంగరావు
ఇంద్రవెల్లి అమరవీరుల ఆశయ సాధన సమితి వ్యవస్థాపకులు

చెడగొట్టు వాన

అంతవరకూ దూపతో
బీళ్ల చినుకు కోసం
నోళ్లు తెరిచి ఎదురుచూసాయి

భూమికి పచ్చల కంఠాభరణ
హారాన్ని కానుకగా
వర్షం సమర్పించింది

జనవరి పైరగాలికి
మామిడి తోట ఎదమీంచి
జారుతున్న ఓణీని సవరించుకుంది

వరిపంట కోతకు వచ్చిందనే
సంబురంతో రైతు పోచమ్మకు
కర్రె కోడిని బలిచ్చి కల్లు సాక పోసిండు

ఎండాకాలం వాకిట్లో
నులక మంచంపై పక్కవేసి
వేపచెట్టు విసనకర్రతో విసిరినా
నిశిరాత్రికి ఉక్కపోస్తుంది


హోరుగాలి వడగండ్ల వాన ఉరుములు
భయాందోళనతో అరచినా
ఏ ఒక్క అర్జునుడు వచ్చి
పిడుగుపాటును ఆపలేకపోయాడు

తీరా తెల్లారి చూస్తే వరిపంట
వీరునిలా నేలకొరిగింది
నల్లపూసల దండ పెరిగిపోయినట్టు
నేల రాలిన వడ్లగింజలు

ఇరగ్గాసిన మామిడి చెట్టు
బిడ్డల్లాంటి కాయల్ని పోగొట్టుకున్న
శోక మాతృమూర్తిలా నిలబడింది


ఇంతవరకూ జీవగంజి పోసిన వర్షం
ఇప్పుడు పంటల కడుపు మంట
కడగండ్ల చెడగొట్టు వాన అయ్యింది

– జూకంటి జగన్నాథం



కదిలింది కరుణరథం





గుణదల కొండ దిగువ నుంచి శిఖరాగ్రాన శిలువ మార్గం వరకు భక్తుల యాత్ర (ఇన్‌సెట్‌లో) పెజ్జోనిపేటలో క్రీస్తు శిలువ యాత్ర

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు శిలువయాత్రలు నిర్వహించారు. శిలువను మోస్తూ క్రీస్తు వేషధారి ముందుకు సాగగా, భక్తులు ర్యాలీగా అనుసరించారు. అంతకుముందు ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తుకు క్షమా స్వాగతం పలికారు.

అందాల కీర్తి



ఆర్ఎస్ బ్రదర్స్ రెండో అతిపెద్ద షోరూమ్ శుక్రవారం నగరంలో ప్రారంభమైంది. బీసెంట్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన ఈ షోరూమ్‌ను మహానటి ఫేమ్ కీర్తి సురేశ్ ప్రారంభించారు. ఆమెను చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అమరావతి శంకుస్థాపనకు ఏర్పాట్లు

ప్రధాని మోదీ పర్యటనకు సన్నాహాలు

- సభాస్థలి పనులు ప్రారంభం
- అందంగా సీడ్ యాక్సెస్ రోడ్డు



6లో

రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి కృష్ణాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. పదిమంది మృతి

ఉమ్మడి కృష్ణాజిల్లా రహదారులు శుక్రవారం రక్తసిక్తమయ్యాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 10 మంది మృతిచెందారు. ఒక్క జగ్గయ్యపేట నియోజకవర్గంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మొత్తం నలుగురు కన్నుమూయడం విషాదకరం. క్రైస్తవ శ్రమదీక్ష తీసుకుని కాలినడకన గుణదల బయల్దేరిన ఇద్దరు భక్తులను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఇక ప్రసాదంపాడులో లారీ బీభత్సం సృష్టించగా, డ్రైవర్‌తో పాటు పాదచారి మృతిచెందారు. ఘటనాస్థలాల్లో మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు కాగా, స్వగ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి/నెట్‌వర్క్





ప్రసాదంపాడులో బీభత్సం సృష్టించిన లారీ ఇదే.. (ఇన్‌సెట్‌లో) పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్న యాక్టివా వాహనం

ఒక్క జగ్గయ్యపేటలోనే మూడు ప్రమాదాలు

- ప్రసాదంపాడులో డ్రైవర్‌కు గుండెపోటు.. లారీ బీభత్సం
- పాదచారిపైకి దూసుకెళ్లిన లారీ.. అక్కడికక్కడే మృతి
- గుణదలకు కాలినడకన బయల్దేరిన ఇద్దరు భక్తులు
- మార్గంమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం
- ఆటో ప్రయాణికులను కాపాడి వాహన డ్రైవర్ కన్నుమూత
- స్వగ్రామాల్లో మిన్నంటిన రోదనలు

క్రీస్తు శ్రమదీక్షలో దారుణం

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం

గుడ్‌ఫ్రైడే సందర్భంగా శ్రమదీక్ష విరమించడానికి గుణదలకు బయల్దేరిన ఇద్దరిని గుర్తుతెలియని వాహనం బలి తీసుకుంది. జగ్గయ్యపేట మండలం వేదాద్రికి చెందిన పసుమర్తి భాస్కరరావు (48),

మిగతా 6లో..



ప్రసాదంపాడులో మృతిచెందిన రామకృష్ణ, రామసాయి (ఫైల్), జగ్గయ్యపేటలో వాహనం ఢీకొని మృతిచెందిన వెంకటేశ్వర్లు, భాస్కరరావు (ఫైల్), తిరుమలగిరి ప్రమాదంలో మృతిచెందిన హైదరాబాద్‌వాసి ప్రవీణ్, పాపవినాశనం ప్రమాదంలో మృతుడు వెంకటేశ్వరరావు (ఫైల్)

ప్రసాదంపాడులో లారీ బీభత్సం

లారీడ్రైవర్‌కు గుండెపోటు.. పాదచారి మృతి

విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని జాతీయ రహదారిపై మృత్యువు వేర్వేరు రూపాల్లో ఇద్దరిని బలి తీసుకుంది. డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో లారీ బీభత్సం సృష్టించింది. గుండెపోటుతో లారీడ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఓ పాదచారుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. పామర్రు మండలం నిమ్మకూరుకు చెందిన జంపాని రామకృష్ణ (54) లారీ డ్రైవర్. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్ నుంచి ఫ్లైయాష్ లోడుతో లారీ గన్నవరం వైపు వెళ్తోంది. ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి వచ్చిన రామకృష్ణకు ఇన్నోటెల్ హోటల్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. అక్కడి నుంచి లారీని అదుపు చేసుకుంటూ ప్రసాదంపాడులోని ఉప్పలబజారు వద్దకు వచ్చాడు. నొప్పి ఎక్కువ కావడంతో నియంత్రణ కోల్పోయాడు. దీంతో లారీ బీభత్సం సృష్టించింది. రహదారిపై అటూ ఇటూ తిరుగుతూ వాహనదారులు, పాదచారులను భయపెట్టింది. ముందుగా రోడ్డు డివైడర్‌ను, ఆ తర్వాత పార్క్ చేసిన కారు, బైక్‌ను ఢీకొంది. అనంతరం ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్న రామవరప్పాడుకు చెందిన బలుగూరి రామసాయి (18)ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని ట్రాఫిక్ పోలీసులు అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రామసాయి ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు నిర్ధారించారు. రామవరప్పాడుకు చెందిన రామసాయి ఆటోనగర్‌లో వెల్డింగ్ పనిచేస్తుంటాడు. టీ తాగడానికి ప్రధాన రహదారిపైకి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ప్రసాదంపాడుకు చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తూ.. బల్లెం వారి వీధి వద్ద కూల్‌డ్రింక్ తాగుదామని రోడ్డు పక్కన ఆగారు. వాహనాన్ని ఫుట్‌పాత్ వద్ద నిలిపి షాపు వద్దకు వెళ్లారు. ఇంతలో లారీ దూసుకొచ్చింది. త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

కిడ్నీ వ్యాధితో బాలిక మృతి

ఆరో తరగతి చదువుతున్న విద్యార్థినికి కిడ్నీలు ఫెయిల్

గంపలగూడెం మండలం గోసవీడులో విషాదం



అశ్విత (ఫైల్)

గంపలగూడెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధికి ఓ చిన్నారి బలైంది. గోసవీడు దళితవాడకు చెందిన పల్లెకంటి నాగరాజు రెండో కుమార్తె అశ్విత (13)కు ఆరేళ్లకే ముఖం వాచిపోవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించారు. అయితే, డాక్టర్లు థైరాయిడ్‌గా నిర్ధారించారు. థైరాయిడ్ మందులు వాడుతున్నా బాలిక అనారోగ్యంగా ఉండటంతో విజయవాడలో వైద్యం చేయించారు. కాగా, నాలుగు నెలల క్రితం మంగళగిరిలోని ఎయిమ్స్‌లో డాక్టర్లు పరీక్షలు చేసి కిడ్నీలు ఫెయిల్ అయినట్లు నిర్ధారించి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. అప్పటి నుంచి జీజీహెచ్‌లో డయాలసిస్ చేయిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. శుక్రవారం మరోసారి బాలికను జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించింది. బాలిక తోటమూలలోని ఓ స్కూల్లో ఆరో తరగతి చదువుతోంది. తండ్రి నాగరాజు తాపీ పని చేసుకుంటూ జీవిస్తుంటాడు. బాలిక మృతితో దళితవాడలో విషాదఛాయలు అలముకున్నాయి.

వావ్ జీనీ విక్రయాలపై విచారణ చేయండి

» విజిలెన్స్ అధికారులకు ఏపీ మునిసిపల్ వర్కర్స్ అసోసియేషన్ వినతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వావ్ జీనీ యాప్ ద్వారా వస్తువుల విక్రయాల వ్యవహారంపై దర్యాప్తు చేపట్టాలని విజిలెన్స్‌కు

మిగతా 6లో..

రూ. 257.14 కోట్లు కావాలి

జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అంచనాలు

పనులకు రూ.220 కోట్లు, కాంట్రాక్టర్లకు రూ.36 కోట్లు

జిల్లాలో టిడ్కో ఇళ్ల పనుల్లో కదలిక మొదలైంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదలై, వైసీపీ హయాంలో నిలిచిపోయిన విగులు పనులను పూర్తి చేయటానికి రూ.257.14 కోట్ల నిధులు కావాలని యంత్రాంగం అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి తెలియజేసింది.

- గతంలో టీడీపీ హయాంలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- వైసీపీ హయాంలో ఐదేళ్లు మూలనపడిన భవనాలు
- కూటమి ప్రభుత్వ రాకతో ఇన్నాళ్లకు మళ్లీ కదలిక
- 30 శాతం మిగులు పనులకు అంచనాలు



జక్కంపూడిలోని టిడ్కో ఇళ్లు

టిడ్కో ఇళ్ల పరిస్థితి ఇదీ..

జిల్లావ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 11,520 టిడ్కో ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయి. 300 చదరపు అడుగుల ఇళ్లు 3,984, 365 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇళ్లు 2,544, 430 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇళ్లు 4,992 ఉన్నాయి. 70.08 శాతం పురోగతి ఉంది. నగరంలో మూడు నియోజకవర్గాలకు సంబంధించి జక్కంపూడిలో 6,576 ఇళ్లకు శ్రీకారం చుట్టారు. వీటి పనుల్లో 71.22 శాతం పురోగతి ఉంది. జగ్గయ్యపేటలో 3,168 ఇళ్ల నిర్మాణ పనులకు గాను 73 శాతం, నందిగామలో 240 ఇళ్ల నిర్మాణాలకు గాను 62 శాతం, తిరువూరులో 1,536 ఇళ్లకు గాను 74.10 శాతం చొప్పున పురోగతిలో ఉన్నాయి. 30 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఈ పనులు పూర్తి చేస్తేనే లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకునే అవకాశం ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లావ్యాప్తంగా నాలుగు పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలను మూడొంతులకు కుదించేసింది. కేవలం టెండర్లు పూర్తయ్యి.. క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్న వాటినే అలా ఉంచింది. పనులను కూడా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఐదేళ్లగా లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో టిడ్కో ఇళ్లను ముందుకు తీసుకెళ్లడానికి వీలుగా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. దీంతో జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందించుకుంది. మిగులు పనులు పూర్తి చేయటానికి బడ్జెట్ ఎంత కావాలో నిర్దేశించింది. ఈ విషయాన్ని ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి కూడా తీసుకెళ్లింది. ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లి కాంట్రాక్టర్ల బకాయిలతో పాటు మిగులు పనులు పూర్తి చేయటానికి తగిన బడ్జెట్ కేటాయింపులు జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

» కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు

జక్కంపూడిలో టిడ్కో ఇళ్లు నిర్మిస్తున్న కాంట్రాక్టు సంస్థ ఎఫ్‌సీసీకి రూ.13.38 కోట్లు, తిరువూరు, జగ్గయ్యపేట (గురుకుల పాఠశాల-1), నందిగామలోని హనుమంతపాలెంలో ఇళ్లు నిర్మిస్తున్న ఎల్‌అండ్‌టీ సంస్థకు రూ.1.46 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. జగ్గయ్యపేట (గురుకుల పాఠశాల-2)లో పనులకు ఎల్‌అండ్‌టీ సంస్థకు రూ.18.22 కోట్లు చెల్లించాలి. జగ్గయ్యపేట (గురుకుల పాఠశాల-ఆర్‌టీ)లో ఇళ్లను ఐజేఎం సంస్థ చేపట్టగా, రూ.3.21 కోట్లు చెల్లించాలి. మొత్తంగా జిల్లాలో కాంట్రాక్టర్లకు రూ.36.27 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఈ బకాయిలను చెల్లించి అదనంగా రూ.220.86 కోట్లు ఉంటే ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయి.

» బడ్జెట్ అవసరం

జిల్లావ్యాప్తంగా టిడ్కో ఇళ్ల విగులు పనులు పూర్తి చేయటానికి రూ.257.14 కోట్ల బడ్జెట్ కావాలి. జక్కంపూడిలోని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయటానికి రూ.141.50 కోట్లు అవసరం. దీని మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.442.13 కోట్లు కాగా, రూ.314.01 కోట్ల మేర నిధులు ఖర్చు చేశారు. మిగులు పనులకు రూ.128.12 కోట్లు మాత్రమే ఉన్నా.. కాంట్రాక్టర్ బకాయిలతో కలిపి రూ.141.50 కోట్లు అవసరం అవుతాయి. జగ్గయ్యపేట టిడ్కో ఇళ్లకు రూ.89.97 కోట్లు, నందిగామ టిడ్కో ఇళ్లకు రూ.6.96 కోట్లు, తిరువూరులోని టిడ్కో ఇళ్లకు రూ.18.70 కోట్ల మేర నిధులు అవసరం.

రాజీనా.. రాజీనామానా..?

» పదవులకు, పార్టీకి రాజీనామా చేస్తామని వైసీపీ కౌన్సిలర్ల అల్టిమేటం

తిరువూరులో మళ్లీ రచ్చకెక్కిన చైర్‌పర్సన్ వివాదం

- రాజీనామా ఆమోదం సమయానికి చైర్‌పర్సన్‌కు అస్వస్థత
- కౌన్సిల్ సమావేశం నుంచి ఆసుపత్రికి..
- ఆగ్రహంగా ఉన్న వైసీపీ అసమ్మతివాదులు
- రాజీనామా చేయడానికి సన్నాహాలు
- బుధవారం వరకూ ఆగాలని స్థానిక నాయకుల బుజ్జగింపు



గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం మధ్యలోనే వెళ్లిపోతున్న చైర్‌పర్సన్

తిరువూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మునిసిపల్ చైర్‌పర్సన్ రాజీనామా అంశం నాటకీయ పరిణామాల మధ్య మరో గందరగోళానికి దారితీసింది. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం మధ్యలో చైర్‌పర్సన్ కస్తూరిబాయి అర్ధంతరంగా వెళ్లిపోవడం, ఆ తర్వాత అస్వస్థతకు గురికావడం, రాజీనామా ఆమోదం పొందకపోవడం.. వంటి పరిణామాలపై కొందరు వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు గుర్రుగా ఉన్నారు. రాజీనామా విషయంలో తాడోపేడో తేల్చుకుంటామని, లేదంటే ముకుమ్మడిగా తమ పదవులు, పార్టీకి రాజీనామా చేస్తామని వారంతా అల్టిమేటం జారీ చేయడంతో అధిష్ఠానం ఈ సమస్య పరిష్కారంపై మల్లగుల్లాలు పడుతోంది.

ఆది నుంచీ వివాదమే..

తిరువూరు మునిసిపాలిటీకి చెందిన 20 వార్డుల్లో 17 వార్డులు గెలుచుకున్న వైసీపీ.. చైర్‌పర్సన్ నియామకంలో తొలి నుంచి వివాదాలు ఎదుర్కొంటోంది. మొదట్లో చైర్‌పర్సన్‌గా మోదుగు ప్రసాద్ పేరును అప్పటి

మిగతా 6లో..

టీడీపీ కార్యాలయంపై రాళ్లదాడి

» నందిగామలో కలకలం

6లో



మూలపాడులో అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ పోటీల ప్రారంభం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

దేశానికి క్రీడా రాజధానిగా అమరావతి

- సీఎం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి చెందుతుందని ఎంపీ కేశినేని చిన్ని ఆశాభావం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం క్రీడాంధ్రప్రదేశ్ కావడంతో పాటు రాజధాని అమరావతి ప్రాంతం దేశానికే క్రీడా రాజధానిగా అభివృద్ధి చెందుతుందని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మూలపాడులో ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించే అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ పోటీలను శుక్రవారం శాప్ చైర్మన్ రవి నాయుడితో కలిసి ఆయన ప్రారంభించారు. కేశినేని ఫౌండేషన్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, శాప్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ప ది టీమ్‌లు తపడుతున్నాయి. టోర్నమెంట్‌ను ఎంపీ ప్రారంభించారు. జాతీయ పోటీల నిర్వహణకు రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఏపీకి ఐపీఎల్ టీమ్ కూడా ఏర్పాటు కానుందని స్పష్టం చేశారు. మూలపాడు ప్రాంతంలోనే స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నెలకొల్పేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని, అ త్యుత్తమ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం అభివృద్ధికి ఐసీసీ చైర్మన్ జైషా హామీ ఇచ్చారని తెలిపారు. సెలవుల్లో 5 లక్షల మంది పిల్లలకు వేసవి శి క్షణ ఇప్పిస్తున్నట్లు శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండమూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తలపడిన జట్లు..

మూలపాడులోని ఏసీఏ స్టేడియంలోని ఏ గ్రౌండ్‌లో ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఐ అండ్ పీఆర్ టీమ్‌పై విజయవాడ మీడియా టీం విజయం సాదించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐ అండ్ పీఆర్ టీం 89 పరుగులకు ఆలౌట్ కాగా, విజయవాడ మీడియా జట్టు మూడు వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. బీ గ్రౌండ్‌లో సచివాలయం ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ టీవీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేబుల్ టీవీ జట్టు గెలుపొందింది. మధ్యాహ్నం ఏ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో సచివాలయం ప్రింట్ మీడియా టీమ్‌పై అమరావతి మీడియా జట్టు విజయం సాధించింది.

రాజధాని మీడియా జట్టు ఘన విజయం



విజయచిహ్నం చూపుతున్న రాజధాని మీడియా జట్టు

బీ గ్రౌండ్‌లో మధ్యాహ్నం సచివాలయం కెమెరామెన్ జట్టు, రాజధాని మీడియా జట్టు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన రాజధాని మీడియా జట్టు ఏడు వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సచివాలయం కెమెరామెన్ జట్టు 51 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఈ మ్యాచ్‌లో రాజధాని మీడియా జట్టు 105 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

ఆర్థిక నేరాల్లో రాజకీయ నేతల హస్తం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఆరోపణ

గవర్నర్‌పేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకుల్లో జరుగుతున్న ఆర్థిక నేరాలు, ఎగవేతల్లో ఎక్కువగా రాజకీయ పార్టీ నేతల హస్తం ఉంటోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ముఖ్య నేతల సమావేశం శుక్రవారం లెనిన్ సెంటర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. సహకార బ్యాంకు ఉద్యోగుల సంఘం వజ్రోత్సవ సమావేశాల నిర్వహణపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. సహకార బ్యాంకులు సొసైటీల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని, సహకార ఉద్యమ లక్ష్యాలు నెరవేర్చాలని అన్నారు. అన్ని సంఘాలు ఒకే తాటిమీదకు వచ్చి వజ్రోత్సవ సమావేశాలు నిర్వహించుకోవడం శుభపరిణామమన్నారు. ఐక్యంగా ఉద్యమి స్తే సమస్యలు పరిష్కరించుకోవచ్చని, రెండంచెల విధానం వల్ల రైతుల కు రుణభారం తగ్గుతుందని అన్నారు. దీని కోసం ముఖ్యమంత్రిని కలిసి అమలు అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. కార్మిక, ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు సృష్టించే శక్తుల కుట్రలను ఎండగట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు కోరారు. ఫెడరేషన్ చైర్మన్ వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి రవికుమార్, సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని రాజా, ప్రతినిధులు కిషోర్, ఏఐటియూ నేతలు ఆర్.రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విజయవాడలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయాలి

- ప్రభుత్వానికి యూటీఎఫ్ వినతి

విజయవాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, దివ్యాంగులను గుర్తించడానికి బందరులో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడంపై పునరాలోచన చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) ఎన్టీఆర్ జిల్లా శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 24, 25, 26 తేదీలలో నిర్వహించబోయే మెడికల్ క్యాంపును బందరుతో పాటు విజయవాడలో కూడా ఏర్పాటుచేయాలని కోరింది. ఉపాధ్యాయ బదిలీలు 1998 నుంచి జరుగున్నప్పటి నుంచి విజయవాడలో కూడా మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి క్యాంపులు జరుపుతున్నారన్నారని తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జిల్లా వ్యాప్తంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడే ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, దివ్యాంగులను తెచ్చుకోవడానికి ఇబ్బందిపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తమ విన్నపాన్ని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకెళ్లి విజయవాడలో మెడికల్ క్యాం పు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ శాఖ కోరింది.

21న దుర్గగుడి హుండీ కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 21వ తేదీన హుండీలను తెరిచి కానుకలను లెక్కిస్తామని ఈవో కె.రామచంద్ర మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7.30 గంటల నుంచి మల్లేశ్వర మహామండపం 6వ అంతస్థులో లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, సేవా బృందం సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ పునర్నియామకం

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో పనిచేసి రిటైర్ అయిన చీఫ్ ఇంజనీర్ పి.రవికృష్ణరాజును తిరిగి అమరావతి అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్‌గా నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన ఆ యన ఏడాది పాటు బాధ్యతలు నిర్వర్తిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

గోనె సంచులు ఇవ్వండి

రోజుల తరబడి కల్లాల్లో ధాన్యాన్ని కాపాడుకోలేకపోతున్నాం

రాజుగూడెం సొసైటీ వద్ద రైతుల ఆందోళన



రాజుగూడెం సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

(ఆంధ్రజ్యోతి-తిరువూరు): ధాన్యాన్ని మిల్లులకు తోలేందుకు గోనెసంచులు ఇవ్వాలంటూ శుక్రవారం రైతులు రాజుగూడెం సొసైటీ వద్ద ఆందోళనకు దిగారు. మండలంలోని వావిలాల శివారు రాజుగూడెం పీఏసీఎస్ పరిధిలోని వావిలాల, ఎర్రమాడు, పెద్దవరం పంచాయతీల్లో మూడువేల ఎకరాల్లో వరి కోతలు పూర్తవడంతో ధాన్యం కల్లాల్లో ఎండబెట్టిన రైతులు ధాన్యం అమ్మేందుకు సంచులకోసం సొసైటీ చుట్టూ తిరుగుతున్నారు. సిబ్బంది పట్టించుకోకపోవడంతో, కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. సొసైటీకి వస్తున్న సంచులను కొందరు పెద్దలు మధ్యలోనే ఇళ్లకు తరలిస్తున్నారని, ముందుగా ధాన్యం కోసిన వారికి సంచులు అందించకుండా, వరికోతలు చేపట్టని వారికి సొసైటీ నుంచి సంచులు అందిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి కల్లాలో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడలేకపోతున్నామని, వర్షం కురిసి తడిసి దెబ్బతింటుందని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సంచులు సత్వరమే అందిస్తాం: ఆర్డీవో మాధురి

డివిజన్ పరిధిలో రైతులకు అవసరమైన గోనె సంచులు సత్వరమే అందిస్తామని ఆర్డీవో మాధురి తెలి పారు. రాజుగూడెం సొసైటీ పరిధిలోని రైతులు ధాన్యం సంచులు అందక పడుతున్న ఇబ్బందుల్ని ఆర్డీవో దృష్టికి ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవతద్ తీసుకెళ్లారు. దీంతో ఆర్డీవో స్పందించి సొసైటీకి అవసరమైన సంచులు అందిస్తామని, అవసరమైన వాహనాలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

20 రోజుల నుంచి కల్లాల్లోనే ధాన్యం

వరికోతలు పూర్తిచేసి 20 రోజులయింది. సొసైటీ చుట్టూ సంచులకోసం తిరుగుతున్నాం. గతంలో దిగుమతి చేసిన సంచులు ఎవరికి ఇచ్చారో తెలియదు. సొసైటీకి సంచులు వస్తున్నా సన్న, చిన్నకారు రైతులకు అందడం లేదు.

\- కొమ్మినేని కోటేశ్వరరావు, రైతు, రాజుగూడెం

వర్షం వస్తే తీవ్రంగా నష్టపోతాం

సొసైటీకి కావాల్సిన సంచులు అందేలా అధికారులు చూడాలి. కోసిన ధాన్యాన్ని కల్లాల్లో, ఖాళీ స్థలాల్లో ఎండబెట్టాం. అకాలవర్షం వస్తే తీవ్రంగా నష్టపోతాం.

\- కొమ్మినేని వీరయ్య, రైతు, రాజుగూడెం

కోతలు పూర్తిచేసిన రైతులకే సంచులు

ఈ క్రాప్ బుకింగ్ అయ్యి వరి కోతలు పూర్తిచేసిన రైతులకే సంచులు అందిస్తున్నాం. కొందరు రైతులు తమ సొంతవాహనాల్లో మిల్లుల నుంచి సంచులు తెచ్చుకుంటున్నారు. ఇప్పటి వరకు 25, 600 సంచులు అందించాం. సంచుల కోసం నివేదిక అందించాం, వస్తున్నాయి.

\-సూర్యారావు, రాజుగూడెం సొసైటీ సీఈవో

టీడీపీ కార్యాలయంపై రాళ్లదాడి

నందిగామ రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నందిగామలోని రైతుపేట టీడీపీ కార్యాలయంపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్ల దాడి చేశారు. దీంతో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సీఐ లచ్చునాయుడు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అకతాయిల పనా.. లేక రాజకీయ కోణంలో జరిగిందా అని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.





కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీఐ లచ్చునాయుడు, పగిలిన కిటికీ అద్దాలు

అమరావతి శంకుస్థాపనకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి పునర్నిర్మాణ పనులకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మే 2వ తేదీ జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రానుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం వెనుక భాగంలోని సభాస్థలి ప్రాంగణంలో పనులు ఇప్పటికే మొదలయ్యాయి. భారీ టెంట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల కోసం ఒక టెంట్ ఆఫీసును సిద్ధం చేశారు. సభాస్థలిలో గ్యాలరీల భాగాన్ని భారీ ఎత్తున యంత్రాలు, రోడ్డు రోలర్లతో చదును చేయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది రానుండటంతో భారీ గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. అలాగే, రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలను, మట్టి కుప్పలను తొలగిస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అందంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రీన్‌బెల్టుల్లో భారీగా లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పూల మొక్కలు నాటుతున్నారు. విద్యుత్ స్తంభాలకు రంగురంగుల ఎల్ఈడీ దీపాలను అమర్చారు. ఇక సభాస్థలిని కొండపల్లి బొమ్మలతో అందంగా అలంకరించనున్నారు.





మెట్లపై పొర్లు దండాలు పెడుతూ ఇంద్రకీలాద్రిపైకి వెళుతున్న నార్ల ఈశ్వర్

పవన్ అభిమాని సోపాన సేవ

- మార్క్ శంకర్ కోలుకోవడంతో మెట్లపై పొర్లుదండాలు పెడుతూ కొండపైకి వెళ్లి దుర్గమ్మ దర్శనం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ కోలుకోవడంతో పవన్ అభిమాని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు మొక్కు తీర్చుకున్నారు. మార్క్ శంకర్ ఆరోగ్యం బాగుంటే మెట్ల(సోపాన సేవ) ద్వారా పొర్లుకుంటూ వచ్చి దర్శనం చేసుకుంటానని తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రపురం మండలానికి చెందిన నార్ల ఈశ్వర్ మొక్కుకుని అమ్మవారి దీక్ష తీసుకున్నారు. తాజాగా మార్క్ శంకర్ కోలుకోవడంతో శుక్రవారం ఇంద్రకీలాద్రికి కుటుంబ సభ్యులతో వచ్చి మెట్ల మార్గం గుండా ఒక్కొక్క మెట్టుకు నమస్కారం చేసుకుంటూ పొర్లు దండాలు పెట్టుకుంటూ కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నాడు. మెగా కుటుంబానికి తాను వీరాభిమానినని, ఇప్పటికే 23సార్లు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించానని ఈశ్వర్ తెలిపారు. వారిలో ఎవరికి ఏ కష్టం కలిగినా తన మనస్సు కలచివేస్తుందని, వెంటనే భగవంతుని వద్దకు వెళ్లి వారికి క్షేమం కలగాలని కోరుకుంటానని తెలిపారు.

విద్యుత్‌శాఖ ద్వారా వేతనాలు చెల్లించండి



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యుత్‌శాఖ కాంట్రాక్టు కార్మిక సంఘం నేతలు

గుణదల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఉన్న దళారీ వ్యవస్థను రద్దు చేయాలని, విద్యుత్‌శాఖ ద్వారా వేతనాలు చెల్లించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఏపీ విద్యుత్‌శాఖ కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి పుట్లూరి నాగార్జున కోరారు. నగర పర్యటనకు వచ్చిన మంత్రిని శుక్రవారం సంఘం నేతలు కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 26వేల మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని తెలిపారు. సంస్థనే నమ్ముకుని పనిచేస్తున్న వారికి వైద్య సదుపాయాలు, పదవీ విరమణ చేసే వారికి టెర్మినల్ బెనిఫిట్స్ లభించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పలు చోట్ల వాచ్‌మెన్లు లేకుండా ఆపరేటర్లు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారని ఇది చాలా ఇబ్బందిగా ఉందన్నారు.

డీఎస్సీ జనరల్ అభ్యర్థులకు వయోపరిమితి 47ఏళ్లకు పెంచాలి

- ప్రభుత్వానికి ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్ కుమార్ విజ్ఞప్తి

బెంజిసర్కిల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రభుత్వం విడుదల చేసే డీఎస్సీ నోటిఫికేషన్‌లో జనరల్ అభ్యర్థులకు వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ప్రభుత్వానికి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వీరి వయోపరిమితి 44 ఏళ్లుగా ఉందని పేర్కొన్నారు. వయస్సు కట్ ఆఫ్ డేట్‌ను 2024 జూల్ 1వ తేదీగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో డీఎస్సీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఎంతోమంది నిరుద్యోగుల వయోపరిమితి పెరిగిందని పేర్కొన్నారు. ఈ కట్ ఆఫ్ డేట్ వల్ల ఎంతో మంది నిరుద్యోగులకు మేలు చేకూరుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో డీఎస్సీ రద్దుకారణంగా అభ్యర్థులు చెల్లించిన పరీక్ష రుసుంను ఈ డీఎస్సీకి చెల్లుబాటు అయ్యేవిధంగా చూడాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ ఒకే రోజు నిర్వహించాలని, ఇలా చేయడం వల్ల వివిధ రకాల ప్రశ్నపత్రాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని సూచించారు. అలాచేయని పక్షంలో కొంతమందికి కష్టమైన, మరికొంతమందికి సులభతరమైన ప్రశ్నపత్రాలు వచ్చి ర్యాంక్‌లో తేడా వచ్చే అవకాశం ఉందని హేమంత్ కుమార్ పేర్కొన్నారు.

చేనేత, హస్తకళ రంగాల అభివృద్ధే లక్ష్యం

- హస్తకళ అభివృద్ధి సలహాదారు సుచిత్ర ఎల్ల

విజయవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చేనేత, హస్తకళ రంగాల అభివృద్ధే ధ్యేయమని సుచిత్ర ఎల్ల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు సుచిత్ర ఎల్లను చేనేత, హస్తకళ అభివృద్ధి సలహాదారుగా నియమించిన సందర్భంగా శుక్రవారం ఆప్కో భవన్‌లో అధికారికంగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. చేనేత, హస్తకళ రంగాలకు మూలమైన పాలసీ మార్పులపై సలహా, సుస్థిర అభివృద్ధి, మార్కెట్‌ను పెంచడం, డిజిటల్ వేదికలు, బయోగ్రాఫికల్ ఇండికేషన్ గుర్తింపులపై దృష్టి సారిస్తానని సుచిత్ర ఎల్ల పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో సుచిత్ర ఎల్లకు ఉన్న అనుభవం, నాయకత్వ లక్షణాలు చేనేత రంగ అభివృద్ధికి దోహదపడుతుందని చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖా రాణి అన్నారు. చేనేత, హస్తకళా రంగాల బలోపేతానికి కృషి చేయాలని సుచిత్ర ఎల్లను ఆమె కోరారు. ఆప్కో అధికారులు నాగేశ్వరరావు, కన్నబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

చలపతి, విజయవర్ధనరావుల విడుదలపై

హైకోర్టు తీర్పును అమలుచేయాలి

- జీవిత ఖైదీల విడుదల సాధన కమిటీ విజ్ఞప్తి
- నేడు న్యాయవాదులతో విజయవాడలో సమావేశం

విజయవాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బస్సు దహనం ఘటనలో జీవిత ఖైదు అనుభవిస్తున్న చలపతిరావు, విజయవర్ధనరావుల విడుదల విషయంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జీవిత ఖైదీల విడుదల సాధన కమిటీ కన్వీనర్ ఆర్.భరద్వాజ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వారిద్దరి విడుదలకు సంబంధించిన చట్టపర అంశాలను పరిశీలించాలని ఈ నెల తొమ్మిదిన హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. అయితే, వారం ముందే సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలతో రాష్ట్ర ప్రభుత్వం జీవో 71 విడుదల చేయడంతో కోర్టు తీర్పు అమలుకాని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అందువల్ల జీవో 71ను కోర్టు ఆదేశాలనుగుణంగా సవరించి వారిద్దరి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన కోరారు. సమస్యపై న్యాయవాదులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

భోగవల్లి శ్రీధర్ మృతి బీజేపీకి తీరనిలోటు



శ్రీధర్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

చిట్టినగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న భోగవల్లి శ్రీధర్ అకాల మరణం పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి నూకల మధుకర్, పశ్చిమ ఎమ్మె ల్యే సుజనా చౌదరి అన్నారు. సిండికేట్ కాలనీలో శుక్రవారం శ్రీధర్ భౌతికకాయానికి వారు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీధర్ గురువారం మృతి చెందారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పోతిన బేసి కంఠేశ్వరుడు, పట్నాయక్, పైలా సురేష్ ఉన్నారు.

రాజీనా.. రాజీనామానా..?

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే ప్రతిపాదించగా, అధిష్ఠానం కస్తూరిభాయిని ఖరారు చేసింది. అయితే, రెండేళ్ల తర్వాత రాజీనామా చేయాలని, మరొకరికి అవకాశం కల్పించాలని అప్పటి ఎమ్మెల్యే ఆదేశించారు. నాటి నుంచి వైసీపీ కౌన్సిలర్లలో విభేదాలు మొదలయ్యాయి. రెండేళ్ల తర్వాత ఆమె రాజీనామా చేయకపోవడంతో కొందరు వైసీపీ కౌన్సిలర్లు సహాయ నిరాకరణ చెపట్టారు. అధిష్ఠానం కూడా పట్టించుకోకపోవడంతో వివాదం ముదిరింది. పాలన నాలుగేళ్లు పూర్తవడంతో అసమ్మతి కౌన్సిలర్లు, కలెక్టర్, ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్‌కు అవిశ్వాసం నోటీసు అందించారు. వివాదం తీవ్రం కావడంతో అధిష్ఠానం అసమ్మతివాదుల్ని బుజ్జగించే ప్రయత్నం చేసింది. దీంతో గత నెల 3న కస్తూరిబాయి రాజీనామా సమర్పించారు. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ రాజీనామా ఆమోదించాల్సి ఉంది. అయితే, సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే ఆమె అస్వస్థతకు గురయ్యారు. సమావేశం మధ్యలోనే ఆసుపత్రికి వెళ్లిపోయారు. దీంతో సమావేశం వాయిదా పడటంతో, వైసీపీ అమ్మతి కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక వైసీపీ నాయకులను కలిశారు. సమస్యను పరిష్కరించకుంటే, పార్టీకి, పదవులకు రాజీనామా చేసి, సొంత పనులు చేసుకుంటామని కౌన్సిలర్లతో పాటు పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు తెగేసి చెప్పారు. బుధవారం వరకు ఓపిక పట్టాలని, అన్ని సమస్యలు సర్దుకుంటాయని నాయకులు అసమ్మతి వాదుల్ని బుజ్జగించినట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్ రాజీనామాను ఆమోదిస్తే, బోర్డుకు ఉన్న 10 నెలల కాలంలో నూతన చైర్‌పర్సన్ ఎన్నుకునే అవకాశం ఉంటుందా, లేదా అనుమానాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు.

వావ్ జీనీ విక్రయాలపై విచారణ చేయండి

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు అందింది. కార్పొరేషన్ యూసీడీ విభాగంలో ఉజ్వల టీఎల్ఎఫ్ ఖాతాలో అనుమానాస్పదంగా రూ.18 లక్షల మేర డబ్బు జమకావటం, వాటిని వేర్వేరు ఖాతాలకు మళ్లించాల్సిందిగా యూసీడీ అధికారులు టీఎల్ఎఫ్ సభ్యులపై ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో మెప్మా ఎండీకి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. కాగా, ఈ వ్యవహారంపై ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసింది. నగరంలోని డ్వాక్రా సంఘాలేవీ వావ్ జీనీ యాప్ ద్వారా విక్రయాలు జరపలేదని, విక్రయాలు జరిపినట్టుగా టీఎల్ఎఫ్ ఖాతాలో డబ్బు పడటం అనుమానాస్పదంగా ఉందని, దీనిపై దర్యాప్తు చేయాలని వారు విజిలెన్స్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇది రాష్ట్రస్థాయిలో జరిగిన మోసమని, సమగ్ర పరిశీలన జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు.

రహదారులు రక్తసిక్తం

(5వ పేజీ తరువాయి)

రుద్రపోగు వెంకటేశ్వర్లు (39) ఏసుక్రీస్తు మాల వేసుకుని శ్రమదీక్ష ప్రారంభించారు. ఇద్దరూ కూలీలు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా గుణదల మేరీమాత ఆలయంలో ఇరుముడి సమర్పించడానికి గురువారం రాత్రి వేదాద్రి నుంచి కాలినడకన బయల్దేరారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో నందిగామ రూరల్ మండలం అనాసాగరం ఫ్లైఓవర్ మీద 65వ నెంబరు జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొంది. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. భాస్కరరావుకు భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా, మరో ముగ్గురు చదువుకుంటున్నారు. వెంకటేశ్వర్లుకు భార్య లక్ష్మీతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆగిన లారీ ఢీకొని హైదరాబాద్‌వాసి..

జగ్గయ్యపేటలోని జాతీయ రహదారిపై తిరుమలగిరి క్రాస్ రోడ్డు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. హైదరాబాద్‌కు చెందిన ధర్మేజు ప్రవీణ్‌కుమార్ (35) అక్కడికక్కడే మృతిచెందాడు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్‌లు పనిమీద హైదరాబాద్ నుంచి కారులో విజయవాడ వస్తుండగా, జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు.

ఆటో ప్రయాణికులను కాపాడి..

జగ్గయ్యపేటలో గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చెన్నంపల్లికి చెందిన రాజు (43) ఎస్ఆర్ఎంటీ ట్రాన్స్‌పోర్టు వాహనం డ్రైవర్‌గా 15 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరాడు. జగ్గయ్యపేటలోని కార్యాలయంలో పనిచూసుకుని విజయవాడకు వెళ్తుండగా, ముందు వెళ్తున్న కారు టైర్ పంక్చరై డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా తిరిగింది. దాని వెనుక ఉన్న ఆటోను ఢీ కొట్టకుండా ఉండేలా రాజు లారీ ఒక్కసారిగా పక్కకు తప్పించాడు. ఈ క్రమంలో లారీ పల్టీ కొట్టింది. ఆటోలో ఉన్న రూపన పుల్లయ్య, శివరాత్రి వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ రాజు అక్కడికక్కడే చనిపోయాడు.

డివైడర్‌ను ఢీ కొట్టి భవన నిర్మాణ కార్మికుడు..

పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై అడ్డాడ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పామర్రుకు చెందిన ఆరేపల్లి శ్రీనివాసరావు (58) భవన నిర్మాణ కార్మికుడు. యాక్టివా మోటరు సైకిల్‌పై గుడివాడ వైపు వెళ్తుండగా, రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీనివాసరావు రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై ప్రాణాలు వదిలాడు.

కారు ఢీకొని బైకర్..

తేలప్రోలు నుంచి హనుమాన్ జంక్షన్‌కు వెళ్లే జాతీయ రహదారికి ఎడమ వైపు ఉన్న సర్వీసు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ ఫక్రుద్దీన్ బాబా (51) మృతిచెందాడు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన బాబా తేలప్రోలు పట్టు రీలింగ్ కేంద్రంలో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది.

చెట్టును బలంగా ఢీకొని..

ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామ సమీపంలోని కరకట్టపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోగినేనిపాలెం గ్రామానికి చెందిన దాసి వెంకటేశ్వరరావు (42) మృతి చెందాడు. గరికముక్కు శ్రీనుతో కలిసి వెంకటేశ్వరరావు శుక్రవారం ఉదయం విజయవాడ వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటి వస్తున్న క్రమంలో శివసిద్ధిని కుండలిని యోగాశ్రమం సమీపంలో కరకట్ట పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. శ్రీనుకు కాలు విరిగింది. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఎదురుగా వెళ్తున్న వ్యక్తిని ఢీకొని బైకర్..

ముందు వెళ్తున్న పాదచారిని ఢీకొని బైకర్ మృతిచెందిన ఘటన గంపలగూడెం మండలం వినగడప గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గంధం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంటి సరుకులు తీసుకుని బైక్‌పై వెళ్తుండగా, గోపాలస్వామి కుంట వద్దకు రాగానే, ముందు నడుస్తున్న పాదచారుడు నంద్రు కృష్ణయ్యను ఢీకొట్టాడు. వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలై మృతిచెందగా, కృష్ణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి.

విద్య వైద్యం ఉచితంగా అందిస్తున్న కూటమి ప్రభుత్వం

మొగల్రాజపురం/మధురానగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్య, వైద్యం ప్రజలకు అందించడం ద్వారానే పేదరికాన్ని జయించగలమని సీఎం చంద్రబాబు నమ్మి వాటిని పేదలకు అందిస్తున్నారని ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. తూర్పు నియోజకవర్గం 6వ డివిజన్ చుట్టుగుంట లయన్స్ క్లబ్ రోడ్డులో రూ. 5లక్షలతో డాక్టర్ అనిల్ నిర్మించిన సీతారామస్వామి దేవస్థాన కల్యాణ మండపాన్ని, అనిల్ న్యూరో అండ్ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. పడాల గంగాధర్, పల్లి దుర్గాప్రసాద్, పిట్టల గోవింద్, పునుగుపాటి పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ నేడు

బెంజిసర్కిల్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పురస్కరించుకొని ఫెడరేషన్ ఆఫ్ చర్చిస్, అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో బెంజిసర్కిల్‌లోని సెయింట్ పాల్స్ కథెడ్రల్(చర్చి) ప్రాంగణం నుంచి శనివారం ఉదయం 6 గంటలకు రన్ ఫర్ జీసెస్ శాంతి ర్యాలీ నిర్వహిస్తారు. విజయవాడ కేథలిక్ డయోసిస్ బిషప్ మోస్ట్ రెవ. తెలగతోటి జోషఫ్ రాజారావు, కృష్ణా, గోదావరి డయాసిస్ సీఎస్ఐ బిషప్ తంటపూడి జార్జి కొర్నెలియస్‌లు జెండా ఊపి శాంతి ర్యాలీని ప్రారంభిస్తారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు ఇవే

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం సబ్‌స్టేషన్ పరిధిలోని సూర్యారావు పేట, మారుతినగర్, గీతామందిర్, సత్యసాయి ఫీడర్ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీంద్ర బాబు, విజయవాడ పట్టణ ఎఫ్‌బీవో బి.వెంకట్రావ్ శుక్రవారం తెలిపారు. కొత్తవంతెన రోడ్డు, కాట్రగడ్డ వారి వీధి, బోడేపూడి వారి వీధి, దుర్గా అగ్రహారం, కాల్వ గట్టు, అంకమ్మ తల్లి గుడి ఏరియా, చుట్టుగుంట రైవస్ కాల్వ గట్టు, సీతారామపురం కాల్వ గట్టు, లాల్ బహదూర్‌శాస్త్రి వీధి, ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ రోడ్డు, కాకాని నగర్, గీతామందిర్ రోడ్డు, మేదర బజారు, కోటి లింగాల వారి వీధి, నెహ్రూ స్ట్రీట్, చాప రాల వారి వీధి, ఐనవోలు వారి వీధి, రామా కార్పొరేషన్ ఏరియా, శాతవాహన కాలేజ్ వెనుక వైపు, ఐకాన్ పబ్లిక్ స్కూల్ ఏరియా, మల్లెల శ్రీరామమూర్తి వీధి, కొల్లిపర వారి వీధి, వీరమాచినేని వారి వీధి, వారణాసి వారి వీధి, ఏలూరు రోడ్డు, సీతారామపురం సిగ్నల్స్ ఏరియా, మారుతీనగర్ కాల్వ గట్టు, సిమెంట్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, కాకర్ల వారి వీధి, వీరయ్య వీధి, మాగంటి వారి వీధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

22న ఆటో కార్మికుల ర్యాలీని జయప్రదం చేయండి

రైల్వే స్టేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓలా, ఉబర్, ర్యాపిడో యాప్‌లను రద్దు చేయాలంటూ ఈనెల 22న బీఆర్‌టీఎస్ రోడ్డులో జరిగే ఆటో కార్మికుల ర్యాలీని జయప్రదం చేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. విజయవాడ పార్శిల్ కార్యాలయం వద్ద శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి వి దేశీయుల జపం చేస్తుందని వి మర్శించారు.

పాపుల రక్షణార్థమే ఏసుక్రీస్తు శిలువ మరణం

- విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు
- గుడ్‌ఫ్రైడే సంర్భంగా బెంజిసర్కిల్‌లో ఘనంగా శిలువ మార్గం


ఏసుక్రీస్తు శిలువను ముద్దాడుతున్న బిషప్ జోషప్ రాజారావు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాపుల రక్షణార్థమే ఏసుక్రీస్తు సిలువ మరణం పొందారని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. గుడ్‌ఫ్రైడే (పవిత్ర శుక్రవారం) సందర్భంగా శుక్రవారం బెంజిసర్కిల్ వద్ద సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చి నుంచి విచారణకర్తలు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ ఆధ్వర్యంలో పరిశుద్ధ సిలువ మార్గం నిర్వహించారు. ఈసందర్భంగా జోసఫ్ రాజారావు మాట్లాడుతూ పరిశుద్ధ సిలువ క్షమాగుణాన్ని, ప్రేమను, కరుణను తెలియజేస్తుంద న్నారు. అంతకు ముందు సెయింట్ పాల్స్ కథెడ్రల్ నుంచి వందలాదిమంది క్రైస్తవులతో ప్రారంభమైన సిలువ మార్గం నిర్మాలా కాన్వెంట్ రోడ్డు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్, పంటకాల్వ రోడ్డు, మారీస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియం మీదుగా సాగి సెయింట్ పాల్స్ కథెడ్రల్‌కు చేరింది. సిలువ మార్గంలో క్రీస్తు కల్వరికొండపై సిలువ మోస్తూ అనుభవించిన శ్రమలను, కష్టాలను, పాటులను స్మరించుకొంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ భక్తులకు సిలువ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం భక్తులు బారులుతీరి పవిత్ర సిలువను ముద్దాడారు. కార్యక్రమంలో సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణ సహాయ గురువు ఫాదర్ ఉపేంద్ర, ఫాదర్ వినోద్, మారీస్ స్టెల్లా కళాశాల, నిర్మలా హైస్కూల్ సిస్టర్స్ ఉపదేశి రెంటాల మరియన్న, సంఘ నేతలు కోరుకొండ అశోక్‌కుమార్, బండి బాబూరావు, పీఆర్ మోహనరావు, బెర్నాండ్ పాల్గొన్నారు.

క్రీస్తును అనుసరిస్తే జీవితం శుఖమయం

గుణదల : కార్మెల్‌నగర్ విచారణ గురువులు ఫాదర్ బుర్రి జాన్‌పీటర్ గుడ్‌ఫ్రైడేని పురస్కరించుకుని గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం వద్దకు శుక్రవారం ఉదయం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సిలువ మోస్తూ కొండ దిగువ నుంచి క్రీస్తు అనుభవించిన 14 శ్రమలను గుర్తు చేసుకుంటూ కొండ శిఖరాగ్రాన గల సిలువ వద్దకు చేరుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులతో గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. భక్తులను ఉద్దేశించి ఫాదర్ బుర్రి జాన్‌పీటర్ మాట్లాడుతూ జాలీ, దయ, ప్రేమ తత్వాలను ప్రతి ఒక్కరూ అలవర్చు కోవాలన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని మండల దినం ఉపవాస దీక్షలు చేపట్టారు. రేపటితో ఉపవాస దీక్షలు ముగియను న్నాయన్నారు. అనంతరం దివ్యపూజాబలి సమర్పించారు.

ఆటోనగర్ : లోకరక్షకుడైన ఏసుక్రీస్తు తన రక్తాన్ని చిందించి లోకానికి శాంతి సందేశ వి చ్చారని పాస్టర్ సజ్జా రత్నకుమార్ అన్నారు. ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు మెస్సీయ ఫెలోషిప్‌లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసం గిస్తూ క్రీస్తు ఎంతో క్షోభను అనుభవిస్తూ ప్రజలకు సంకల్పంతో శోధించి ఎదిరించాలని, ఆరోగ్యానికి, పాపం నుంచి ముక్తిని ప్రసాదించారన్నారు. కార్యక్రమంలో మాధవి, ప్రసన్న, కమల ప్రణుతి, కీర్తి, ప్రబోధ కుమార్, బంకా రవి, జోయల్ చిన్న సందేశాన్నిచ్చారు.





గుణదల కొండపైన శిలువ వద్ద దివ్యపూజాబలి సమర్పిస్తున్న గురువులు..ప్రసంగిస్తున్న పాస్టర్ సజ్జా రత్నకుమార్ దంపతులు.. ఎన్టీఆర్ సర్కిల్‌లో శిలువ యాత్ర


ఎమ్మెల్యే గద్దెను కలిసిన ముస్లిం నాయకులు

ముస్లింలకు అండగా చంద్రబాబు

పటమట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుపై ముస్లింలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, సీఎం చంద్రబాబు అండగా ఉంటారని ముస్లింలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ భరోసా ఇచ్చారు. ముస్లింలు శుక్రవారం తన కార్యాలయంలో కలిశారు. వక్ఫ్ సవరణ బిల్లులో కొన్ని అంశాలు అభ్యంతరంగా ఉన్నాయని వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో అన్యమతస్థులను సభ్యులుగా చేర్చే అవకాశం ఉండదన్నారు. కేంద్ర పెద్దలతో సీఎం చంద్రబాబు ఈవిషయంపై చర్చించారన్నారు. సవరణలు చేసిన తర్వాత మాత్రమే బిల్లును పార్లమెంట్‌లో పెట్టినట్లు తనకు సమాచారం ఉందన్నారు. ఏపీలోని ముస్లింలు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో నసీర్ అహమ్మద్, అబ్దుల్ వాహిద్, షఫీ ఉర్‌రహమాన్, హతాఉర్‌రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యాన్నదాన పథకానికి మండవ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తరలిస్తున్న 10 టన్నుల కూరగాయలు

నిత్యాన్నదాన పథకానికి కూరగాయలు

గుణదల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి నిత్యాన్నదాన పథకానికి నగరంలోని మండవ భోజనం రెస్టారెంట్ నుంచి 10 టన్నుల కూరగాయలు తరలించినట్లు మండవ శ్రీనివాస్ తెలిపారు. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో కూరగాయల సేకరణ జరిగిందన్నారు. కూరగాయల లోడు వాహనాన్ని ఎమ్మెస్ఎంఈ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు, ఆంధ్రజ్యోతి ప్రింటర్ అండ్ పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు జెండా ఊపి ప్రారంభించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ వేంకటేశ్వరుని సన్నిధికి కూరగాయల తరలింపున కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, ఆటో క్లస్టర్ చైర్మన్ అన్నే శివనాగేశ్వరరావు, ఐలా జేఆర్‌డీ టాటా చైర్మన్ తాతినేని వినోద్‌బాబు, ఇందిరా ఫుడ్స్ అధినేత మండవ వెంకటరత్నం, పొన్నం శ్రీరామ్ ప్రసాద్, మండవ వెంకట ఆంజనేయ కుమార్, మాదాల శ్రీనివాసరావు శీరం చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎప్పుడూ ప్రజల పక్షమే

టీడీపీ నాయకుడు గద్దె క్రాంతికుమార్

పటమట/ కృష్ణలంక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పేద పక్షాన నిలబడుతుందని అందుకోసమే విద్య, ఉపాధి, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని టీడీపీ నాయకుడు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. జేడీనగర్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం వైద్యం, చదువు నిమిత్తం రూ.75 వేలను గద్దె క్రాంతి కుమార్ అందించారు. 2014-19 టీడీపీ హయాంలో పెద్ద ఎత్తున సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించి సీఎం చంద్రబాబు పేదల ఆరోగ్యానికి పెద్దపీ ట వేశార న్నారు. చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, మోటేపల్లి చిన్న, గద్దె ప్రసాద్, చింతా వెంకటేశ్వరరావు, ఎన్.శ్రీనివాస్, గల్ల శ్రీను, మాదిరెడ్డి రవి పా ల్గొన్నారు. కృష్ణలంక 20వ డివిజన్‌కు చెందిన భూపతి హరికృష్ణ-సుజాత దంప తుల ఏడాదిన్నర కుమార్తె చిన్నారి గ్రీష్మిక కాలుకు ఆపరేషన్ చేయించే నిమిత్తం నక్కల రోడ్‌లోని మిత్ర హాస్పటల్‌కు వెళ్లి హాస్పటల్ వారితో మాట్లాడి వారి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.


నర్రాను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

కష్టపడే వారికి గుర్తింపు

ఎమ్మెల్యే సుజనా చౌదరి

గొల్లపూడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పని చేసే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని అందుకు గొల్లపూడి ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన నర్రా వాసునే నిదర్శమని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శుక్రవారు వాసు ముగ్గురు ఎమ్మెల్యేలను వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారు ఆయనను అభినం దించారు. టీడీపీ నేతలు బొమ్మసాని సుబ్బారావు, గూడపాటి పద్మశేఖర్, నూతులపాటి వెంకటేశ్వరరావు, అబ్దుల్ ఖాదర్, ఎదుపాటి రామయ్య, బొర్రా తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థినికి వేధింపులు

యువకుడితోపాటు తల్లిదండ్రులు, సోదరిపై కేసు

విద్యాధరపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై మా యమాటలు చెప్పి డబ్బులు తీసుకుని ఆ తరువాత ప్రేమించాను.. పెళ్లి చేసుకో మంటూ ఎంబీబీఎస్ విద్యార్థినిని బెదిరిస్తున్న యువకుడు, అతనికి సహకరిస్తున్న అతని తల్లిదండ్రులు, సోదరిపై శుక్రవారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం కొండవీటి కల్యాణ మండపం సమీపంలో ఉంటున్న విద్యార్థిని(29) ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీకి ప్రిపేర్ అవుతుంది. లబ్బీపేట పైడయ్యవీధికి చెందిన డి.సాయివెంకట శివకుమార్ రెండేళ్ల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. మాయమాటలు చెప్పి బాధితురాలి వద్ద పలు దఫాలుగా రూ.3.50లక్షలు తీసుకున్నాడు. వాటిని తిరిగి ఇవ్వాలని బాధితురాలు ఒత్తిడి తీసుకు రావడంతో యువకుడు ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటే ఆ తరువాతే డబ్బులు ఇస్తానన్నాడు. పీజీ పూర్తిఅయిన తరువాతే పెళ్లి చేసుకుంటానని బాధి తురాలు చెప్పినా శివకుమార్, అతని తల్లిదండ్రులు పూర్ణకుమారి, వెంకటప్పయ్య, శివకుమార్ సోదరి పెళ్లిచేసుకోమ బలవంత పెడుతున్నారు. బాధితురాలు హాస్టల్ వద్ద శివ కుమార్ దాడికి తెగబడ్డాడు. డబ్బులు ఇవ్వను, చేతనైంది చేసుకో అంటూ బెదిరిం చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు.

ప్రేక్షకులను ఆలోచింప చేసిన శిథిలజీవి


శిథిలజీవి నాటికలో ఒక సన్నివేశం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్, ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్య మండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న 44వ జాతీయ స్థాయి నాటికల పోటీల్లో భాగంగా శుక్రవారం రెండు నాటికలు ప్రద ర్శించారు. గాంధీనగర్ జింఖానా గ్రౌండ్స్ సమీపంలోని శ్రీకందుకూరి కల్యాణ మండపం వేదికగా ఈ వేడుకలు కొనసాగుతున్నాయి. చంద్రన్న వజ్రో త్సవ వేడుకల సందర్భంగా జరుగుతున్న నాటికల పోటీల్లో భాగంగా శుక్ర వారం తొలి ప్రదర్శనంగా గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ బృందం రూపొం దించిన 'అమ్మ చెక్కిన బొమ్మ' ప్రేక్షకులను ఆకట్టుకొంది. జ్యోతి రాజ్ బీ శెట్టి రచన, వెంకట్ గౌడ్ గోవాడ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ నాటిక భావోద్వేగాలకు తోడు గాఢమైన సందేశాన్ని అందించింది. అనంతరం నటరాజ డ్రమెటిక్ అసోసియే షన్, పెందుర్తి వారు ప్రదర్శించిన మరో నాటిక 'శిథిలజీవి' కూడా ప్రేక్షకులను ఆలోచింపచేసేలా సాగింది. రావి నాగేశ్వరరావు రచనకు పిళ్లా నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు.

వక్ఫ్‌ను రక్షించండి..రాజ్యాంగాన్ని పరిరక్షించండి

కృష్ణలంక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్‌ను రక్షించండి.. రాజ్యాంగాన్ని పరిరక్షించండి అంటూ ఇమామ్ హజీజుర్ రెహ్మాన్ కమిటీ సభ్యులు శుక్రవారం కృష్ణలంకలోని మసీదు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దావూద్ అలీబేగ్, ఇనయ్‌తుల్లా మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు అనేది ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అన్నారు. ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డులో చేయిచేయి కలపాలని పిలుపు నిచ్చారు. సవరణ చట్టం పేరుతో వక్ఫ్ ప్రాథమిక స్ఫూర్తి మౌలిక అంశాల్లో మార్పుల ద్వారా రూపురేఖలు మార్చేసి పూర్తి వ్యవస్థను బలహీనప రచడం జరిగిందన్నారు. బిల్లును వెనక్కి తీసుకో వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం లు బిల్లును వ్యతిరేకించాలని కమిటీసభ్యులు కోరారు. కార్యక్రమంలో ఉమర్ అలీ, ఫారూఖ్, తదితరులు పాల్గొన్నారు.


వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా కృష్ణలంకలోని మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు


పప్పుల మిల్లు సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న ముస్లింలు

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా మానవహారం

పటమట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు, మహిళలు ప్ల కార్డులు చేపట్టి శుక్రవారం పప్పుల మిల్లు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. పప్పుల మిల్లు వద్ద నుంచి ఆటోనగర్ సిద్దికీయా మసీద్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 19 ఏప్రిల్ 2025

బచ్చలి ఆరోగ్యానికి నెచ్చెలి

కారం, వగరు, తీపి ఈ మూడురుచులు కలగలసిన ఆకు కూర బచ్చలి. దీనిలో పాలకూరతో సమానమైన పోషకతత్వాలు ఉంటాయి. ఇది తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. భోజన కుతూహల గ్రంథంలో దీనిని పోతకి లేదా ఉపోదకీ అని పేర్కొన్నారు. ఈ బచ్చలిలో రెండు రకాలు ఉన్నాయి. ఆకుపచ్చ కాండం, ఆకుపచ్చ ఆకులతో ఉన్న బచ్చలిని బసెల్లా ఆల్బా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. ఎర్రని కాండం, ముదురు ఆకుపచ్చ ఆకులు కలిగిన బచ్చలిని బసెల్లా రుబ్రా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. దీని గింజలు ఊదా రంగులో ఉంటాయి. ఈ రంగును తెలుగు వారు బచ్చలిపండు రంగు అనే పిలుస్తారు.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

చాలా మంది బచ్చలి కూర వేడి చేస్తుందని భావిస్తారు. కానీ ఇది వాతాన్ని, వేడిని- రెండింటినీ అదుపు చేస్తుంది. ఆయుర్వేద గ్రంథాల్లో బచ్చలి కూర వల్ల ప్రయోజనాలను వివరించారు. ఆ ప్రయోజనాలు..

- ఇది రక్తశుద్ధికి తోడ్పడుతుంది. ఎముకలకు పుష్టినిస్తుంది.
- అనేక రకాల స్త్రీ సమస్యలకు ఇది పరిష్కారం. సంతాన ప్రాప్తినిస్తుంది. గర్భాశయపోషకంగా పనిచేస్తుంది.
- బచ్చలి ఆకును నమిలితే నోటిపూతను నివారిస్తుంది. ఈ ఆకు రసంలో పసుపు కలిపి పెడితే గాయాలు త్వరగా మానతాయి. కాలిన గాయాలకు ఈ ఆకు రసం మందుగా పనిచేస్తుంది. ఈ రసాన్ని రాస్తే దురదలు తగ్గుతాయి.
- బచ్చలి కూరకు మూత్ర పిండాల్లో రాళ్లను కరిగించే స్వభావముంది.
- బచ్చలి కూరలో జిగురు పదార్థం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మలబద్ధకం ఉన్నవారు బచ్చలికూరను తింటే మంచిది.

• గంగరాజు అరుణాదేవి

రకరకాల వంటలు

తెలుగువారు కంద బచ్చలి కూరను అన్ని శుభ కార్యాల్లోనూ వండుతారు. ఇక బచ్చలికూరతో రకరకాల రుచికరమైన వంటలు చేసుకోవచ్చు.

- బచ్చలికూరలో నూనె వేసి తాలింపు వేసి మూత పెట్టి మగ్గనిస్తే మెత్తగా అవుతుంది. దీనిలో ఉడికిన కందిపప్పు లేదా పెసర పప్పు వేసి పప్పుగా చేసుకోవచ్చు.
- బచ్చలికూరను సన్నగా తరిగి దీనిలో శనగ పిండి లేదా మొక్కజొన్న పిండి కలిపి కొద్దిగా నూనె వేసి వేయిస్తే రుచికరమైన కూర అవుతుంది. దీనిలో కొందరు కొబ్బరి తురుము, నువ్వుపప్పు కూడా వేస్తారు.




- బచ్చలి కూరను సన్నగా తరిగి దానిని నూనెలో దోరగా వేయించాలి. ఆ తర్వాత దానిలో తాలింపు, కొద్దిగా చింతపండు వేయాలి. దీనిని మిక్సీలో వేసి రుబ్బి పచ్చడిగా కూడా చేసుకోవచ్చు.

దోసకాయ చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు: చేప ముక్కలు- పావు కిలో, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, నూనె- పావు కప్పు, ఆవాలు- పావు చెంచా, మెంతులు- పావు చెంచా, ఎండు మిర్చి- 4, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పసుపు- అర చెంచా, కారం- ఒక చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, టమాటా గుజ్జు- అర కప్పు, ఉప్పు- తగినంత, చింతపండు రసం- ఒక కప్పు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం: ముందుగా చేప ముక్కలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత వీటిని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో పావు చెంచా పసుపు, పావు చెంచా ఉప్పు, పావు చెంచా కారం వేసి చేత్తో కలపాలి.

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడిచేయాలి. తరవాత ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకు, పావు చెంచా పసుపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా కలపాలి. ఇవన్నీ దోరగా వేగాక అర చెంచా ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత దోసకాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత ముప్పావు చెంచా కారం, గరం మసాలా పొడి వేసి కలపాలి. ఇవి కొద్దిగా వేగాక టమాటా గుజ్జు, చింతపండు రసం వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరవాత అర చెంచా ఉప్పు వేసి, రెండు గ్లాసుల నీళ్లు పోసి మరిగించాలి. తరవాత చేప ముక్కలు వేసి మూతపెట్టి మగ్గించాలి. ఆరు నిమిషాల తరవాత మూత తీసి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పులుసు వేడి వేడి అన్నంలోకి బాగుంటుంది.



జాగ్రత్తలు

- రోహు, కట్లా, శీలావతి, కొరమీను చేపలతో ఈ పులుసు చేసుకోవచ్చు. కానీ ముల్లు ఉండే రోహు చేపతో చేసిన పులుసు రుచికరంగా ఉంటుంది.
- దోసకాయ, చేప ముక్కలను మరీ మెత్తగా మగ్గించకూడదు.

వంటిల్లు

మనం దోసకాయలతో ఇగురు, పప్పు, ఆవకాయ... ఇలా ఎన్నో రకాలు చేస్తూ ఉంటాం. టమాటా, చిక్కుళ్లు లాంటివి చేర్చి రకరకాల కూరలు కూడా వండేస్తూ ఉంటాం. ఇవి కాక దోసకాయలతో మాంసాహార రుచులు కూడా ప్రయత్నించవచ్చు. దోసకాయలను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ వంటకాలు.

దోసకాయతో వెరైటీగా..



దోసకాయ వంకాయ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

- దోసకాయ ముక్కలు- ఒక కప్పు, వంకాయ ముక్కలు- ఒక కప్పు, టమాటా ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- పన్నెండు, చింతపండు- నిమ్మకాయంత, కొత్తిమీర- ఒక చిన్న కట్ట, కరివేపాకు- రెండు రెమ్మలు, జీలకర్ర- ఒక చెంచా, అవాలు- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, నూనె- నాలుగు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, పచ్చిశనగపప్పు- ఒక చెంచా, మినప్పప్పు- ఒక చెంచా, ఎండు మిర్చి- ఒకటి, ఇంగువ- చిటికెడు

తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నెపెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, కొద్దిగా పసుపు, పచ్చిమిర్చి ముక్కలు, వంకాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు, చింతపండు, కొద్దిగా ఉప్పు వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత అర కప్పు దోసకాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. మిక్సీ గిన్నెలో వెల్లుల్లి రెబ్బలు, వేయించిన వంకాయ-టమాటా ముక్కల మిశ్రమం వేసి కచ్చాపచ్చాగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద తాలింపు గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, ఆవాలు, ఇంగువ, కొద్దిగా పసుపు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి, కరివేపాకు, కొత్తిమీర తరుగు, అరకప్పు దోసకాయ ముక్కలు వేసి కలపాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని పచ్చడిలో వేసి బాగా కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఈ పచ్చడి అన్నంలోకి రుచిగా ఉంటుంది.




దోసకాయ...
పులుపు, తీపి కలగలసిన రుచిలో ఉంటుంది. ఇందులో ఐరన్, కాల్షియం, పొటాషియం లాంటి మినరల్స్‌తోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా పుష్కలంగా ఉంటాయి. దోసకాయను తరచూ తినడం వల్ల ఎముకలు బలపడతాయి. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీరానికి కావాల్సినంత తేమ లభిస్తుంది. చర్మం మృదువుగా బిగుతుగా మారుతుంది. రక్తపోటు, మూత్రపిండాల సమస్యలు తగ్గుతాయి. దోసకాయలో ఉండే కుకుర్బిటాసిన్ ... మూత్రాశయ క్యాన్సర్‌ను నివారిస్తుంది.

జాగ్రత్తలు

- దోసకాయను చిన్న ముక్కలుగా కోయాలి. పొడవాటి వంకాయలు తీసుకుంటే పచ్చడి రుచిగా ఉంటుంది.
- గ్రైండ్ చేసేటప్పుడు కొన్ని వేయించిన పల్లీలు వేస్తే పచ్చడికి కమ్మదనం వస్తుంది.
- ఈ పచ్చడిని రోట్లో చేస్తే రుచి అద్భుతంగా ఉంటుంది.

దోసకాయ చికెన్ కూర



కావాల్సిన పదార్థాలు

- చికెన్- 300 గ్రాములు, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చిమిర్చి- మూడు, కారం- ఒకటిన్నర చెంచాలు, ఉప్పు- ఒకటిన్నర చెంచాలు, పసుపు- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, ఎండుమిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ధనియాల పొడి- అర చెంచా, నూనె- మూడు చెంచాలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం

- ఒక గిన్నెలో చికెన్ ముక్కలు, అర చెంచా ఉప్పు, అర చెంచా కారం, అరచెంచా అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలిపి అరగంటసేపు నానబెట్టాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, పసుపు వేసి దోరగా వేపాలి. ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. ఇవన్నీ వేగాక నానబెట్టిన చికెన్ ముక్కలు వేసి కలపాలి. గిన్నెమీద మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత దోసకాయ ముక్కలు, ఒక చెంచా కారం, ఒక చెంచా ఉప్పు, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. అరగ్లాసు నీళ్లు పోసి మరో అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరలో కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూర రోటీ, చపాతీ, పుల్కా, వేడి అన్నంలోకి బాగుంటుంది.

జాగ్రత్తలు

- చికెన్ ముక్కలు మగ్గుతున్నప్పుడు అందులో ఒక గరిటెడు పెరుగు కలిపితే కూర రుచిగా ఉంటుంది.
- దోసకాయను పెద్ద ముక్కలుగా కోయాలి.

పర్సనల్ కేర్

చెవిలో పురుగు దూరితే..!

ఒక్కోసారి చెవిలోకి చీమలు, బొద్దింకలు లాంటి చిన్న చిన్న పురుగులు దూరి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. లోపలికి వెళ్లినంత సులువుగా అవి బయటికి రావు. వీటిని బయటికి రప్పించడానికి నిపుణులు చెబుతున్న చిట్కాలివి...

- చెవిలోకి ఏదైనా పురుగు ప్రవేశిస్తే వెంటనే చీకటి గదిలోకి వెళ్లి టార్చ్ లేదా మొబైల్ లైట్‌ను చెవిలో చూపించాలి. వెలుగును చూసిన వెంటనే కొన్ని రకాల పురుగులు బయటికి వచ్చేస్తాయి.
- చెవిలో ఆలివ్ నూనె లేదంటే బేబీ ఆయిల్ చుక్కలు వేస్తే ఆ నూనెతోపాటే పురుగు బయటికి వస్తుంది.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ నీటిని చుక్కలుగా చెవిలో వేస్తే లోపలికి వెళ్లిన పురుగు బయటికి వచ్చేస్తుంది.



- ఆల్కహాల్‌లో చిన్న దూది వుండను ముంచి దాన్ని చెవి రంధ్రం దగ్గర పెడితే ఆ ఘాటుకి పురుగు బయటికి వచ్చేస్తుంది. ఆలా రాని పక్షంలో ఒక చుక్క ఆల్కహాల్‌ని వేలితో తీసుకుని చెవిలోపల రాస్తే ఫలితం కనిపిస్తుంది.
- చెవిలోకి పురుగు దూరినప్పుడు బడ్స్, పిన్నీసు, అగ్గిపుల్ల, సూది లాంటి వాటితో దాన్ని బయటికి తీసే ప్రయత్నం చేయకూడదు. ఇలా చేస్తే చెవి నొప్పి పెరుగుతుంది.
- ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పురుగు బయటికి రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.

సెలెబ్ టాక్

ఎప్పటికీ కొత్త కొత్త ఫ్యాషన్ పోకడలు పుట్టుకొస్తూనే ఉంటాయి. దాంతో పాత దుస్తులను బీరువాలకే పరిమితం చేసేస్తూ ఉంటాం. కానీ పాతబడిపోయిన పట్టు చీరలు, కుర్తాలకు కొత్త రూపాన్ని ఎందుకు ఇవ్వకూడదు? అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ తార, రచయిత్రి, ఇంటీరియర్ డెకార్ ఔత్సాహికవేత్త, **ట్వింకిల్ ఖన్నా**! పాత వస్త్రాలకు కొత్త హంగులు జోడిస్తూ, వాటికి ఇంటి అలంకరణలో చోటు కల్పిస్తున్న ట్వింకిల్ ఇంకా ఏమంటోందో తెలుసుకుందాం!



పాత వాటికి కొత్త కళ

"ఇంటికి పండుగ శోభ తీసుకురావడం కోసం అలంకరణ వస్తువుల మీద డబ్బును వృథా చేయవలసిన అవసరం ఏమాత్రం లేదు. దుకాణంలో కొనే ఖరీదైన అలంకరణ వస్తువులకు బదులుగా, ఇంట్లో ఉపయోగించకుండా భద్రపరిచిన వస్త్రాలను పునర్వినియోగించుకునే మార్గాల మీద దృష్టి పెట్టండి. పాత చీరలు, కుర్తాలు, దుపట్టాలతో ఒక గ్యాలరీని రూపొందించుకోండి. మన ఇంట్లో గోడలకు పెయింటింగ్‌లు, ఫొటోలను వేలాడదీస్తూ ఉంటాం. ఆకట్టుకునే వాల్ హ్యాంగింగ్స్‌ను తగిలిస్తూ ఉంటాం. ఇవన్నీ అందరి ఇళ్లలో ఉండేవే! కానీ వినూత్నంగా కనిపించడం కోసం కొంత సృజనాత్మకంగా ఆలోచించాలి.

పాత జ్ఞాపకాలు పదిలంగా...

మన పెళ్లి నాటి పట్టుచీరలు, బహుమతులుగా అందుకున్న పట్టు కుర్తాలు, సెక్విన్ వర్క్‌తో కూడిన లెహంగాలు, దుపట్టాలు లాంటివి మన బీరువాల్లో ఏళ్ల తరబడి మగ్గుతూ ఉంటాయి. పాతబడేకొద్దీ అవన్నీ పిగిలిపోయి, వాడుకోడానికి వీల్లేకుండా పాడైపోతూ ఉంటాయి. ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఆ వస్త్రాలతో ముడిపడి ఉంటాయి కాబట్టి వాటిని పారేయలేం. అలాగని వాడుకోలేం! ఇలాంటి మీమాంసకు చెక్ పెట్టి, వాటితో ఆకర్షణీయమైన వాల్ డెకార్ తయారు చేసుకోండి.



అంతులేనన్ని ప్రత్యామ్నాయాలు

పాత చీరలు, స్కార్ఫ్‌లు, కుషన్ కవర్లు, పాత దుపట్టాలను బయటకు తీసి, వాటికి మన పాత ఆర్ట్‌వర్క్స్ జోడించి కొత్త రూపాన్ని అందించాలి. అలాగే పాత వస్త్రాలను లెక్కలేనన్ని అవసరాలకు కూడా వాడుకోవచ్చు. వాటితో కుషన్ కవర్లు కుట్టుకోవచ్చు. టేబుల్ రన్నర్స్, ల్యాంప్‌షేడ్స్, కర్టెన్లు తయారుచేసుకోవచ్చు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీలను జోడించి, ఫ్రేమ్ కట్టించి గోడలకు తగిలించుకోవచ్చు. ఇలా పాత వస్త్రాలు, దుస్తులకు కొత్త కళను జోడించి వాడుకోవడం వల్ల పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకోవచ్చు. అలాగే దాంతోపాటు, ఇంటి అలంకరణ కూడా వినూత్నంగా మార్చుకోవచ్చు. మీరూ ప్రయత్నించి చూడండి."

మేకప్

ఎండల్లో చూడచక్కగా...

ఎండ వేడి, ఉక్కపోత పెరుగుతున్నాయి. కాబట్టి పాత మేకప్ సాధనాలకు స్వస్తి చెప్పి, వేసవికి తగిన వాటిని ఎంచుకోవాలి. అందుకోసం...

ప్రైమర్: గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పని చేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె...సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జిడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.

పౌడర్: మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్‌సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.

ఫౌండేషన్: వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్‌వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.



మస్కారా: ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమయం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

లిప్ టింట్: టింట్ వల్ల పెదవులు సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటాయి. టింట్ లేకపోతే, పౌడర్ బ్లష్, లిప్ బామ్‌లను సమపాళ్లలో కలుపుకుని లిప్ టింట్‌గా వాడుకోవచ్చు. బ్లష్ లేకపోతే దానికి బదులుగా లిప్ లైనర్ లేదా క్రీమీ లిప్‌స్టిక్‌ను కూడా వాడుకోవచ్చు.

స్పోర్ట్స్

విజయవాడ ● శనివారం 19 ఏప్రిల్ 2025

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	6	5	1	0	10	0.744
పంజాబ్	7	5	2	0	10	0.308
గుజరాత్	6	4	2	0	8	1.081
బెంగళూరు	7	4	3	0	8	0.446
లఖ్‌నవూ	7	4	3	0	8	0.086
కోల్‌కతా	7	3	4	0	6	0.547
ముంబై	7	3	4	0	6	0.239
రాజస్థాన్	7	2	5	0	4	-0.714
హైదరాబాద్	7	2	5	0	4	-1.217
చెన్నై	7	2	5	0	4	-1.276

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

క్రికెటర్లు నగ్న చిత్రాలు పంపేవారు
అనయ బంగర్



న్యూఢిల్లీ: లింగ మార్పిడి చేయించుకున్న మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె అనయ బంగర్ సంచలన వ్యాఖ్యలు చేసింది. కొంత మంది క్రికెటర్లు తనకు వారి నగ్న చిత్రాలు పంపి వేధించేవారని పేర్కొంది. ఆర్యన్ బంగర్‌గా ఉన్న అతడు.. గతేడాది అమ్మాయిగా మారిన విషయం తెలిసిందే. అబ్బాయిగా ఉన్నప్పుడు అనయకు అండర్-19 స్థాయిలో ముషీర్, సర్ఫరాజ్, జైస్వాల్ తదితర ఆటగాళ్లతో క్రికెట్ ఆడిన అనుభవం ఉంది. 'లింగ మార్పిడి చేయించుకున్నాక సహచర ఆటగాళ్ల నుంచి మిశ్రమ స్పందన లభించింది. కొందరి నుంచి లైంగిక వేధింపులు ఎదుర్కొన్నా. వారు తరచూ నాకు నగ్న ఫొటోలు పంపి ఇబ్బందిపెట్టేవారు. ఒకతను అందరి ముందు నన్ను తిడుతూ.. ఎవరూ లేనప్పుడు నా ఫొటోలు అడిగేవాడు. ఒకసారి సీనియర్ క్రికెటర్‌కు నా ఇబ్బందికర పరిస్థితి గురించి చెబితే.. పద కారులో వెళ్దామని చెప్పి, నాతో పడుకోవాలనుందని అన్నాడు' అని ప్రస్తుతం ఇంగ్లండ్‌లో చదువుకుంటున్న అనయ ఓ ఇంటర్వ్యూలో పేర్కొంది.

చెన్నై జట్టులోకి బ్రెవిస్

చెన్నై: దక్షిణాఫ్రికా డాషింగ్ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ ఈ ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరపున బరిలోకి దిగనున్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జప్‌నీత్ సింగ్ గాయంతో ఈ సీజన్‌కు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానాన్ని 21 ఏళ్ల బ్రెవిస్‌తో భర్తీ చేస్తున్నట్టు చెన్నై ఫ్రాంచైజీ ప్రకటించింది. రూ.75 లక్షల కనీస ధర కలిగిన బ్రెవిస్‌ను వేలంలో ఎవరూ కొనుగోలు చేయలేదు. అయితే ఇప్పుడు అతడిని గుర్జప్ ధర అయిన రూ. 2.2 కోట్లకు చెన్నై జట్టు తీసుకోవడం విశేషం. లీగ్‌లో అత్యంత పేలవ బ్యాటింగ్ లైనప్ కలిగిన ధోనీ సేనకు హిట్టర్ బ్రెవిస్ రాకతో కాస్త బలం చేకూరినట్టయ్యింది. గత మూడు సీజన్లపాటు అతడు ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్నాడు.

వాంఖడేలో స్టాండ్..అరుదైన గౌరవం



రోహిత్

ముంబై: స్థానిక వాంఖడే మైదానంలోని దివేచా పెవిలియన్ లెవెల్ 3 స్టాండ్‌కు తన పేరును పెట్టడం.. అరుదైన గౌరవంగా భావిస్తున్నానని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. 'వాంఖడేలో నా పేరుపై ఓ స్టాండ్‌ను ఊహించలేదు. ఇది నాకు దక్కిన గౌరవం' అని రోహిత్ తెలిపాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన ముంబై టీ20 లీగ్ కార్యక్రమంలో రోహిత్ పాల్గొన్నాడు. ఇక, క్రికెట్‌కు అందించిన సేవలకు గుర్తుగా స్టేడియంలో ఓ స్టాండ్‌కు రోహిత్, అలాగే మరో రెండు స్టాండ్లకు భారత మాజీ కెప్టెన్ అజిత్ వాడేకర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శరద్ పవార్ పేర్లను పెట్టినట్టు ముంబై క్రికెట్ సంఘం తెలిపింది.

సెమీస్‌కు అనహత్, వీర్



కౌలాలంపూర్: ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ ఈవెంట్ (ఆసియా)లో భారత స్టార్లు అనహత్ సింగ్, వీర్ చోత్రాని పతకాల దిశగా దూసుకెళుతున్నారు. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో 17 ఏళ్ల అనహత్ 11-1, 11-7, 11-5తో జపాన్‌కు చెందిన అకారి మిదోరికవాను ఓడించి సెమీఫైనల్ చేరింది. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ వీర్ చోత్రాని 9-11, 11-6, 11-6, 11-7తో ఆరో సీడ్ మహ్మద్ సైఫిక్ కమల్ (మలేసియా)పై గెలిచాడు. సెమీఫైనల్స్‌లో 8వ సీడ్ హెలెన్ తాంగ్ (హాంకాంగ్)తో అనహత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టోర్నీ విజేతలు వచ్చేనెల 9 నుంచి 17 వరకు చికాగోలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధిస్తారు.

'ఫిక్సింగ్'లో ఫ్రాంచైజీ మాజీ యజమానిపై నిషేధం

న్యూఢిల్లీ: ముంబై టీ20 లీగ్-2019 సందర్భంగా క్రికెటర్లు ధవల్ కులకర్ణి, భవానీ ఠక్కర్‌ను ఫిక్సింగ్ ఉచ్చులో లాగేందుకు యత్నించిన.. లీగ్‌లో సోబో సూపర్ సోనిక్స్ జట్టు ఫ్రాంచైజీ మాజీ సహ యజమాని గుర్మీత్ సింగ్ భమ్రాపై వేటు పడింది. ఈమేరకు గుర్మీత్‌పై నిషేధం విధిస్తూ బీసీసీఐ అంబుడ్స్‌మన్, విశ్రాంత జస్టిస్ అరుణ్ మిశ్రా శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. 2019లో ముంబై టీ 20 లీగ్ ఆరంభమైంది. అయితే కొవిడ్ కారణంగా మళ్లీ నిర్వహించలేదు. ఈ ఏడాది తిరిగి లీగ్‌ను ప్రారంభిస్తున్నారు. కాగా గుర్మీత్‌పై ఎన్నేళ్ల నిషేధం విధిస్తున్నది మాత్రం వెల్లడించలేదు.

పంజాబ్ అదుర్స్

సొంతగడ్డపై బెంగళూరుకు హ్యాట్రిక్ ఓటమి



నేహల్ వధేరా (33 నాటౌట్)

బెంగళూరు: పంజాబ్ కింగ్స్ నుంచి మరో అదిరిపోయే ప్రదర్శన. పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ కలిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఆ జట్టు బౌలర్లు వంద పరుగుల్లోపే కట్టడి చేయగా.. బ్యాటింగ్‌లో నేహల్ వధేరా (19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 33 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ లోస్కోరింగ్ థ్రిల్లర్‌లో పంజాబ్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. అటు తమ సొంత మైదానంలో బెంగళూరుకిది హ్యాట్రిక్ ఓటమి. అంతకుముందు సాయంత్రం నుంచే వర్షం కురవడంతో నిర్ణీత సమయానికి టాస్ వీలు పడలేదు. అంతకంతకూ వర్షం తీవ్రం కావడంతో మ్యాచ్ నిర్వహణపై కూడా సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే రాత్రి తొమ్మిది గంటలకు కాస్త తెరిపినివ్వడంతో మ్యాచ్‌ను 14 ఓవర్లకు కుదించారు. దీంతో రాత్రి 9.45కు మ్యాచ్ ఆరంభమైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 14 ఓవర్లలో 9 వికెట్లకు 95 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 నాటౌట్), రజత్ పటీదార్ (18 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 23) మినహా తొమ్మిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పెవిలియన్‌కు చేరారు. జాన్సెన్, చాహల్, హర్‌ప్రీత్, అర్ష్‌దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో పంజాబ్ 12.1 ఓవర్లలో 5 వికెట్లకు 98 పరుగులు చేసి నెగ్గింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా టిమ్ డేవిడ్ నిలిచాడు.

నేహల్ అండతో..: స్వల్ప ఛేదనే అయినా పంజాబ్ కూడా తడబడింది. బెంగళూరులా టపటపా వికెట్లు కోల్పోకున్నా.. పరుగులు మాత్రం అంత సులువుగా రాలేదు. చివర్లో నేహల్ వధేరా అండగా నిలిచి జట్టును గట్టెక్కించాడు. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (16), ప్రభ్‌సిమ్రన్ (13) మాత్రం ఉన్న కాసేపే అయినా జోరు ప్రదర్శించారు. తొలి వికెట్‌కు 22 పరుగులు జోడించాక మూడో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్‌ను భువీ అవుట్ చేశాడు. హాజెల్‌వుడ్ తన వరుస ఓవర్లలో ప్రియాన్ష్, శ్రేయాస్ (7)లతో పాటు కుదురుకున్న ఇంగ్లిస్ (14)ను అవుట్ చేయడంతో పంజాబ్‌పై ఒత్తిడి పెరిగింది. అయితే ఆరంభంలో ఇబ్బందిపడిన నేహల్ ఆ తర్వాత బ్యాట్ ఝుళిపించాడు. తొమ్మిదో ఓవర్‌లో 4,6తో 10 రన్స్ సాధించగా.. హాజెల్‌వుడ్ తన చివరి ఓవర్‌లో రెండు పరుగులే ఇచ్చి కట్టడి చేశాడు. ఈ దశలో నేహల్ 11వ ఓవర్‌లో 6,4తో పాటు బైస్ రూపంలో బౌండరీ రావడంతో 15 రన్స్ సమకూరాయి. అయినా 18 బంతుల్లో 17 రావాల్సి ఉండడంతో ఈ పిచ్‌పై ఏమైనా జరగవచ్చని అంతా అంచనా వేశారు. పైగా 12వ ఓవర్‌లో శశాంక్ (1)ను భువీ అవుట్ చేసి బెంగళూరులో కాస్త జోష్ నింపాడు. కానీ వధేరా అదే ఓవర్ ఆఖరి రెండు బంతులను 6,4గా మలిచి సమీకరణం 12 బంతులు 5 పరుగులకు మార్చడంతో ఫలితం అర్థమైంది. అటు స్టొయినిస్ (7 నాటౌట్) సిక్సర్‌తో 11 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

డేవిడ్ ఒక్కడే..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఇన్నింగ్స్‌లో ఏడో నెంబర్ బ్యాటర్ టిమ్ డేవిడ్ ఆటతీరు మినహా చెప్పుకోవడానికేమీ లేదు. అతనొక్కడే 50 పరుగులు చేయగా.. మిగిలిన జట్టు చేసింది 45 పరుగులే కావడం గమనార్హం. కెప్టెన్ రజత్ పటీదార్ ఫర్వాలేదనిపించాడు. ఇక మిగిలిన బ్యాటర్లు పంజాబ్ బౌలర్ల జోరుకు ఇలా వచ్చి అలా పెవిలియన్ చేరారు. పిచ్ స్లోగా మారినా భారీ స్కోరు ప్రత్యర్థి ముందుంచాలనే ఆలోచనతో షాట్లకు వెళ్లడం దెబ్బతీసింది. అటు పంజాబ్ ఫీల్డర్లు అద్భుత క్యాచ్‌లతో ఆకట్టుకున్నారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (4)ను అవుట్ చేసిన పేసర్ అర్ష్‌దీప్, తన తర్వాతి ఓవర్‌లోనే విరాట్ కోహ్లీ (1) పనిబట్టాడు. ఇక ఆ తర్వాత బౌలర్లు జాన్సెన్, చాహల్ కట్టడి చేయడంతో 42/7 స్కోరుతో బెంగళూరు పీకల్లోతు కష్టాల్లో పడింది. అప్పటికి తొమ్మిది ఓవర్లు కూడా పూర్తి కాలేదు. ఈ స్థితిలో జట్టుకు టిమ్ డేవిడ్ ఆపద్బాంధవుడయ్యాడు. భువనేశ్వర్ (8)తో ఎనిమిదో వికెట్‌కు 21 పరుగులు జోడించాడు. ఇక, చివరిదైన 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో జట్టు స్కోరును 90 దాటించిన డేవిడ్.. 26 బంతుల్లో అర్ధ సెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు. అలాగే హాజెల్‌వుడ్ (0 నాటౌట్)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు అజేయంగా 32 పరుగులు జోడించాడు.



డేవిడ్ (50 నాటౌట్)

నాలుగేళ్ల ఐపీఎల్ కెరీర్‌లో టిమ్ డేవిడ్ హాఫ్ సెంచరీ సాధించడం ఇదే తొలిసారి.

1 ఒకే వేదికపై ఎక్కువ మ్యాచ్‌లు (బెంగళూరులో 46) ఓడిన జట్టుగా ఆర్‌సీబీ.

నేటి మ్యాచ్‌లు

మ్యాచ్	సమయం	వేదిక
గుజరాత్ x ఢిల్లీ	మ.3.30 నుంచి	అహ్మదాబాద్
రాజస్థాన్ x లఖ్‌నవూ	రా.7.30 నుంచి	జైపూర్

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (సి) ఇంగ్లిస్ (బి) అర్ష్‌దీప్ 4, కోహ్లీ (సి) జాన్సెన్ (బి) అర్ష్‌దీప్ 1, పటీదార్ (సి) బార్ట్‌లెట్ (బి) చాహల్ 23, లివింగ్‌స్టోన్ (సి) ఆర్య (బి) బార్ట్‌లెట్ 4, జితేశ్ (సి) వధేరా (బి) చాహల్ 2, క్రునాల్ (సి అండ్ బి) జాన్సెన్ 1, టిమ్ డేవిడ్ (నాటౌట్) 50, మనోజ్ భండగె (ఎల్బీ) జాన్సెన్ 1, భువనేశ్వర్ (సి) బార్ట్‌లెట్ (బి) హర్‌ప్రీత్ 8, యశ్ దయాల్ (ఎల్బీ) హర్‌ప్రీత్ 0, హాజెల్‌వుడ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 14 ఓవర్లలో 95/9; వికెట్ల పతనం:** 1-4, 2-21, 3-26, 4-32, 5-33, 6-41, 7-42, 8-63, 9-63; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-23-2, బార్ట్‌లెట్ 3-0-26-1, జాన్సెన్ 3-0-10-2, చాహల్ 3-0-11-2, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-25-2.

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య (సి) డేవిడ్ (బి) హాజెల్‌వుడ్ 16, ప్రభ్‌సిమ్రన్ (సి) డేవిడ్ (బి) భువనేశ్వర్ 13, శ్రేయాస్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 7, ఇంగ్లిస్ (సి) సుయాశ్ (బి) హాజెల్‌వుడ్ 14, నేహల్ వధేరా (నాటౌట్) 33, శశాంక్ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 1, స్టొయినిస్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 12.1 ఓవర్లలో 98/5; వికెట్ల పతనం:** 1-22, 2-32, 3-52, 4-53, 5-81; **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-26-2, యశ్ 2.1-0-18-0, హాజెల్‌వుడ్ 3-0-14-3, క్రునాల్ 1-0-10-0, సుయాశ్ 3-0-25-0.

పారా స్విమ్మర్ గణేష్ రికార్డు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి భారత్‌లోని ధనుష్కోటి తీరాన్ని అత్యంత తక్కువ సమయంలో ఈదిన పారా స్విమ్మర్‌గా గణేష్ రికార్డు సృష్టించాడు. శుక్రవారం ఉదయం 5.50 గంటలకు శ్రీలంకలో ఈత మొదలు పెట్టిన గణేష్ సాయంత్రం 4.20 గంటలకు ధనుష్కోటి తీరానికి చేరుకున్నాడు. మొత్తం 28 కిలోమీటర్ల దూరాన్ని గణేష్ 10 గంటల 30 నిమిషాల్లో ముగించాడు. ఎన్ఐఎస్ కోచ్ అయిన గణేష్ ప్రస్తుతం ఏలూరులో జిల్లాలో శాప్ స్విమ్మింగ్ కోచ్‌గా పని చేస్తున్నాడు.

హంపి-హారిక గేమ్ డ్రా

పుణె: ఇద్దరు తెలుగు గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి-ద్రోణవల్లి హారిక మధ్య అత్యంత ఆసక్తి రేపిన మహిళల గ్రాండ్ ప్రీ చెస్ ఐదో రౌండ్ గేమ్ డ్రా అయ్యింది. శుక్రవారం జరిగిన ఈ గేమ్‌లో హంపి-హారిక అతి జాగ్రత్తగా ఆడడంతో కేవలం 19 ఎత్తులలో ఫలితం తేలకుండా ముగిసింది. ఈ రౌండ్ అనంతరం హంపి (3.5 పాయింట్లు) తన రెండో స్థానాన్ని కొనసాగిస్తోంది. హారిక (2.5) ఐదో స్థానంలో నిలిచింది. ఝు జినెర్ (చైనా, 4) అగ్రస్థానంలోనే నిలిచింది.

హిమాన్షుకు స్వర్ణం
ఆసియా అండర్-18 అథ్లెటిక్స్



న్యూఢిల్లీ: భారత యువ అథ్లెట్ హిమాన్షు ఆసియా అండర్-18 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు. సౌదీ అరేబియాలోని దమ్మామ్‌లో శుక్రవారం జరిగిన జావెలిన్ త్రోలో హిమాన్షు.. ఈటెను 67.57 మీటర్లు విసిరి విజేతగా నిలిచాడు. ఇక దేవక్ భూషణ్ హైజంప్‌లో రజతం నెగ్గగా, పురుషుల మెడ్లే రిలే ఈవెంట్‌లో భారత జట్టు రజతం సాధించింది. ఇక, ఇప్పటికే డిస్కస్ త్రోలో కాంస్యం సాధించిన 16 ఏళ్ల నిశ్చయ్.. తాజాగా షాట్‌పుట్‌లో రజతంతో టోర్నీలో రెండో పతకం అందుకున్నాడు. మహిళల 200 మీటర్ల రేసులో ఆర్తి కాంస్యం పతకం గెలిచింది.

రూ.6.83 లక్షల కోట్లు

ఆర్‌బీఐ వద్ద ఉన్న బంగారం విలువ ఇది



879 టన్నులకు చేరిన నిల్వలు

మన విదేశీ మారక నిల్వల్లో 11.4 శాతానికి పెరిగిన వాటా

ముంబై:భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వద్ద ఎంత బంగారం ఉందో తెలుసా..? ఈ ఫిబ్రవరి నాటికి ఆర్‌బీఐ 879 టన్నులు పోగేసింది. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం.. ఈ నిల్వల ప్రస్తుత విలువ 7,999 కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో దాదాపు రూ.6.83 లక్షల కోట్లు. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలను వివిధీకరించడంతో పాటు మారకం రేటు హెచ్చుతగ్గుల కారణంగా నిల్వల విలువ తగ్గకుండా ఉండేందుకు ఆర్‌బీఐ గడిచిన కొన్నేళ్లుగా పసిడి నిల్వలను వేగంగా పెంచుకుంటూ వస్తోంది. గత ఏడాది చివరి నాటికి మన ఫారెక్స్ నిల్వల్లో బంగారం వాటా 11.4 శాతానికి పెరిగింది. 2019లో ఇది కేవలం 6.7 శాతంగా ఉంది.

3,300 డాలర్లు దాటిన ఔన్స్ గోల్డ్

అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు 3,300 డాలర్లు దాటేసింది. గురువారం ఒక దశలో ఔన్స్ ధర 3,371 డాలర్ల వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. ట్రంప్ సుంకాలు, వాణిజ్య యుద్ధం, మాంద్యం భయాలు పసిడిని రోజుకో రికార్డు స్థాయికి చేరుస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు గోల్డ్ రేటు 25 శాతం పెరిగింది. 2024లోనూ 28 శాతం ఎగబాకింది. 2023లో 15 శాతం వృద్ధి నమోదైంది. గడిచిన ఏడాది కాలంలో ఔన్స్ గోల్డ్ 1,000 డాలర్ల మేర పెరిగింది. పసిడి చరిత్రలో ఇదే అత్యంత వేగవంతమైన వార్షిక ధర పెరుగుదల. మాంద్యం భయాలు, డాలర్ బలహీనపడుతుండటం, సెంట్రల్ బ్యాంక్‌ల కొనుగోళ్లతో మున్ముందు బంగారం ధర మరింత ఎగబాకేందుకే అవకాశాలెక్కువని బులియన్ విశ్లేషకులు అంటున్నారు. సుంకాల విధ్వంసం తీవ్రతరమైతే ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ గోల్డ్ 4,500 డాలర్ల వరకు పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంతర్జాతీయ ఆర్థిక సలహాల సంస్థ డెవెర్ గ్రూప్ అంటోంది.

సంవత్సరాల వారీగా ఈ నెలలో ఔన్స్ గోల్డ్ ధర

ఏప్రిల్	డాలర్లు
2021	1,725
2022	1,920
2023	2,000
2024	2,350
2025	3,300

2024లో 72.6 టన్నులు కొనుగోలు

ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) డేటా ప్రకారం.. గత సంవత్సరంలో ఆర్‌బీఐ 72.6 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. తద్వారా వీటి నిల్వలను మరో 9 శాతం పెంచుకుంది. ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు 2024లో మొత్తం 1,045 టన్నుల బంగారాన్ని పోగేయగా.. అందులో ఆర్‌బీఐదే రెండో అత్యధిక కొనుగోలు. గత ఏడాదిలోని 12 నెలల్లో 11 నెలలు ఆర్‌బీఐ ఈ నిల్వలను పెంచుకుంటూ వచ్చింది.

- 2023లో పోగేసిన 16 టన్నులతో పోలిస్తే, 2024లో ఆర్‌బీఐ నాలుగు రెట్లకు పైగా బంగారం కొనుగోలు చేసింది.
- ఇంతక్రితం 2021లోనూ ఇదే స్థాయిలో కొనుగోళ్లు జరిపింది. ఆ ఏడాది నిల్వలను 77.5 టన్నుల మేర పెంచింది.
- ఈ ఏడాదిలోనూ మొదటి రెండు నెలల్లో (జనవరి, ఫిబ్రవరి) 2.8 టన్నులు కొనుగోలు చేసింది.
- ఆర్‌బీఐ సహా ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లన్నీ పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటున్నాయి. గత మూడేళ్లుగా ఏటా 1,000 టన్నులకు పైగా కొనుగోళ్లు జరిపాయి.

పసిడి కొనుగోళ్లు (టన్నులు)

ఏడాది	ఆర్‌బీఐ	ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు
2021	77.5	------
2022	33.3	1,082
2023	16.2	1,037
2024	72.6	1,045
2025	2.8	44

(ఫిబ్రవరి వరకు)

67,783 కోట్ల డాలర్లకు ఫారెక్స్ నిల్వలు

ఈ నెల 11తో ముగిసిన వారంలో మన విదేశీ మారక నిల్వలు మరో 156.7 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 67,783.50 కోట్ల డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ వెల్లడించింది. ఫారెక్స్ నిల్వలు పెరగడం వరుసగా ఇది ఆరో వారం. కాగా, గత సెప్టెంబరులో నిల్వలు ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 70,488.5 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఆ తర్వాత కాలంలో మళ్లీ తగ్గుతూ వచ్చిన నిల్వలు గత నెల నుంచి కాస్త పుంజుకున్నాయి.

బంగారం దిగుమతులు 192% అప్

మార్చిలో 447 కోట్ల డాలర్లకు చేరిక

గత నెలలో దేశంలోకి బంగారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 192.13 శాతం పెరిగి 447 కోట్లకు డాలర్లకు చేరాయని కేంద్ర వాణిజ్య శాఖ శుక్రవారం వెల్లడించింది. ఈ మధ్యకాలంలో బంగారం ధరలు వేగంగా పెరగడం దిగుమతుల విలువ పెరుగుదలకు కారణమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ఏడాది తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో పసిడి దిగుమతులు 27.27 శాతం పెరిగి 5,800 కోట్ల డాలర్లకు చేరాయి. గత ఏడాదిలో ఇదే కాలానికి దిగుమతులు 4,554 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ట్రంప్ సుంకాల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు పెరిగాయి. ఈ సమయంలో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరుండటంతో మదుపరులు పసిడిలో పెట్టుబడులు పెంచుకుంటున్నారు.

బిజినెస్

అంతర్జాతీయ ఫార్మా కంపెనీతో
దివీస్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయంగా పేరొందిన ఫార్మా కంపెనీతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందం కుదుర్చుకున్నట్లు దివీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. అయితే ఆ కంపెనీ పేరును మాత్రం దివీస్ వెల్లడించలేదు. ఈ ఒప్పందం అమలులో భాగంగా తమ తయారీ కేంద్రాల్లో అదనపు సామర్థ్యాల జోడింపుపై రూ.650-700 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. ఈ సొమ్మును అంతర్గత వనరుల ద్వారానే సమీకరించుకోనున్నట్లు దివీస్ తెలిపింది. రెండు కంపెనీల మధ్య కుదిరిన వాణిజ్య నిబంధనావళి ప్రకారం దివీస్.. అడ్వాన్స్‌డ్ ఇంటర్మీడియేటరీలు తయారుచేసి, సరఫరా చేస్తుంది.

ఎంఎస్ఎన్ రియల్టీ నుంచి వన్ బై ఎంఎస్ఎన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎంఎస్ఎన్ గ్రూప్ అనుబంధ సంస్థ ఎంఎస్ఎన్ రియల్టీ.. హైదరాబాద్‌లో తొలి రెసిడెన్షియల్ రియల్టీ ప్రాజెక్టును ప్రారంభించింది. కోకాపేట నియోపోలిస్‌లో వన్ బై ఎంఎస్ఎన్ పేరుతో 7.7 ఎకరాల్లో రూ.2,750 కోట్లతో ఈ లగ్జరీ ప్రాజెక్ట్‌ను కంపెనీ అభివృద్ధి చేస్తోంది. 55 ఫ్లోర్లతో మొత్తం ఐదు టవర్లలో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో 655 ఫ్లాట్లు ఉంటాయని ఎంఎస్ఎన్ గ్రూప్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి తెలిపారు. 5,250 నుంచి 7,460 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఫ్లాట్స్ ఉంటాయని ఆయన చెప్పారు. ఒక్కో ఫ్లాట్ ధర రూ.7 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు ఉండనుంది. 2030 నాటికల్లా వన్ బై ఎంఎస్ఎన్ పూర్తిగా అందుబాటులోకి రానుందన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ

హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	395
చిత్తూరు	460	విశాఖపట్నం	425

డజను గుడ్లు రూ. 60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	120
కరీంనగర్	120	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	85
కర్నూలు	120	నెల్లూరు	90
విశాఖపట్నం	109	అనంతపురం	90
గోదావరి	120		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,580 ▲	89,450 ▲	1,09,800 ▼
విజయవాడ	98,600 ▲	91,000 ▼	98,500 ▲
విశాఖపట్నం	97,580 ▼	89,450 ▼	1,10,000 ▼
రాజమండ్రి	97,580 ▲	89,450 ▲	98,100 ▼
ప్రొద్దుటూరు	94,200 ▼	86,670 ▼	98,500 ▲
ముంబై	94,910 ▲	86,940 ▲	95,150 ▼

విజయవాడలో ఆర్ఎస్ బ్రదర్స్ రెండో షోరూమ్



విజయవాడ (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ బ్రదర్స్ విజయవాడలో రెండో షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్‌లో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను టాలీవుడ్ నటి కీర్తి సురేశ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, వీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎన్. బాలస్వామి హాజరయ్యారు. అనంతరం కీర్తి సురేశ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆర్.ఎస్. బ్రదర్స్‌ను సందర్శించాలని కోరారు. ఆర్ఎస్ బ్రదర్స్‌లో ఆఫర్స్ చాలా బాగున్నాయని, కలెక్షన్స్ చాలా డిఫరెంట్‌గా ఉన్నాయని అన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో తమ బ్రాండ్ శరవేగంగా విస్తరిస్తోందని ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్లు పీ వెంకటేశ్వర్లు, ఎన్ రాజమౌళి, టీ ప్రసాద్ రావు అన్నారు.

మళ్లీ ట్రూజెట్ విమాన సర్వీసులు!
అనుమతుల కోసం ప్రయత్నాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రాంతీయ విమానయాన సంస్థ 'ట్రూజెట్' మళ్లీ తన విమాన సర్వీసులు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం తన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్ఓసీ) పునరుద్ధరించాలని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ (ఎంఓసీఏ)కు ట్రూజెట్ దరఖాస్తు చేసినట్లు తెలిసింది. ఎంఓసీఏ ఇందుకు ఆమోదం తెలిపితే పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి కంపెనీ తన పాత ఎయిర్ ఆపరేషన్స్ పర్మిట్ (ఏఓపీ)ను పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. వీటికి తోడు కంపెనీ బోర్డులోని సభ్యుల నియామకాలకూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి అవసరం. ఈ అనుమతులన్నీ పూర్తి చేసి ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబరు మధ్య కాలంలో హైదరాబాద్ నుంచి మళ్లీ కొద్దిపాటి ఏటీఆర్ టర్బో విమానాలతో ప్రాంతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలని ట్రూజెట్ భావిస్తోంది.

రూ.100 కోట్ల పెట్టుబడి: విమాన సర్వీసుల పునరుద్ధరణ కోసం ట్రూజెట్ యాజమాన్యం రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్టు సమాచారం. దీంతో ఐదు ఏటీఆర్ విమానాలతో పాటు దేశంలోని కొన్ని ప్రధాన నగరాల మధ్య ఎయిర్‌బస్ ఏ-320 విమాన సర్వీసులూ ప్రారంభించాలని యోచిస్తోంది. ఖర్చులు తగ్గించుకునేందుకు ఏ-320 పాత విమానాలను ఆఫ్రికా లేదా ఇతర దేశాల నుంచి కొనాలని కంపెనీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సంవత్సరాంతం నాటికి లేదా వచ్చే ఏడాది ఆరంభంలో ఈ విమానాలను అందుబాటులోకి తీసుకురావాలని ట్రూజెట్ చూస్తోంది. ఈ ఎయిర్‌బస్ విమానాలకు విశాఖ విమానాశ్రయం, ఏటీఆర్ విమానాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవాలని ట్రూజెట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రంగా 2015 నుంచి 2022 వరకు ట్రూజెట్ కార్యకలాపాలు సాగించింది. అయితే కొవిడ్ కారణంగా పరిస్థితులు తలకిందులు కావటంతో 2022 ఫిబ్రవరిలో తన కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసింది.



హైదరాబాద్.. ప్రేమ నగరం

» మహేష్‌బాబు అంటే ఇష్టం.. తెలుగులో నటిస్తానేమో!

» 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో చదువులకు నిలయమైన కోటా నగరంలో.. రైతు కుటుంబంలో పుట్టి.. 19ఏళ్ల వయసులో మిస్ ఇండియా పోటీల్లో రన్నరప్‌గా నిలిచి.. మిస్ వరల్డ్ 2025 వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అందాల సుందరి.. నందినీ గుప్తా! బాహ్యసౌందర్యం కాదు.. అంతఃసౌందర్యమే అసలైన అందం అని భావించి.. దివ్యాంగులకు అండగా నిలుస్తున్న మన సున్న మనిషి. 'హైదరాబాద్ ప్రేమ నగరం.. ఇక్కడి ప్రజలు నన్నెంతగానో ఆదరించారు' అంటూ.. 'ఆంధ్రజ్యోతి'కి ఆమె ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

మీకు ఎదురైన సంక్లిష్టమైన సందర్భం ఏంటి? దాన్నెలా అధిగమించారు?

నేను ఆశావాదిని. కష్టాలవైపు చూడను. ఏదీ కష్టం అనుకోను. ఎప్పుడూ సానుకూలత వైపే ఉంటా. నా రంగం, నా లక్ష్యంపై పూర్తి శ్రద్ధ పెడతా. సవాళ్లు ఎదురైతే.. వాటిని ఎంతవరకూ అవకాశాలుగా మార్చుకోవచ్చు అనే ఆలోచిస్తాను.

మిస్ ఇండియా పోటీల్లో ఏక్తా(ఐక్యత) అన్న థీమ్ తీసుకున్నారు. ఎందుకు?

మిస్ ఇండియా వరల్డ్ అయినా ఇంకే అందాల పోటీలైనా కేవలం అందమే కాదు. మనసు, తెలివితేటలు అన్నీ చూస్తారు. మిస్ వరల్డ్ పోటీల్లో 1972 నుంచి ఒక థీమ్ ఉంది. అది.. 'ఒక లక్ష్యం కోసం అందం'. అంటే పోటీల్లో పాల్గొన్న వారి లక్ష్యం? ఆ దిశగా వారు చేయబోయే కార్యక్రమాల గురించి కూడా అడుగుతారు. ఇందులో భాగంగా మిస్ ఇండియా వరల్డ్ పోటీల్లో కూడా నా థీమ్ ఏంటని అడిగినప్పుడు.. ఏక్తా(ఐక్యత, కలిసి ఉండడం, అంతా ఒక్కటే) అని చెప్పా. దీనివెనక ఒక చిన్న కథ ఉంది. మా మావయ్యకు డౌన్ సిండ్రోమ్ ఉంది. కానీ, ఆయన ఎప్పుడూ మానసిక స్థైర్యంతో ఉండేవారు. హోటల్‌కు వెళ్లినప్పుడు ఇలాంటివారిని వేరే టేబుల్‌పై కూర్చోమనేవారు. నాకు ఏడుపొచ్చేది. అలాంటి వారికి స్థైర్యం ఇచ్చి దగ్గరకు తీసుకోవాలి కానీ.. అలా దూరం పెట్టడం సరికాదు. అందుకే నేను ఏక్తా థీమ్ తీసుకున్నా.

సొంత దేశంలో పోటీలతో ఒత్తిడి ఏమైనా ఉందా?

నేను ఆశావాదిని. దేశ ప్రజలందరి మద్దతూ నాకు ఉంటుందనే సంపూర్ణ విశ్వాసంతో ఈ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నా. కాబట్టి ఒత్తిడి ఏమీ లేదు.

మీ జీవితంలో అత్యంత ఆనందకరమైన సందర్భం ఏది?

మిస్ ఇండియా వరల్డ్ పోటీలో గెలిచాక మా నాన్న ఏడుస్తూ నన్ను కౌగిలించుకున్నారు. ఆయన నన్ను హత్తుకోవడం జీవితంలో అదే మొదటిసారి. కొడుకు పుడితే బాగుండనుకునే సంప్రదాయ కుటుంబంలో పుట్టిన నేను.. నాన్న కళ్లల్లో నీళ్లు తెప్పించేంత సంతోషం ఇవ్వగలిగా. ఆ క్షణం ఎంతో సంతోషకరంగా అనిపించింది.

యాడ్స్‌లో కనిపిస్తున్నారు.. సినిమాల్లోకి వచ్చే అవకాశం ఉందా?

కచ్చితంగా. సినిమాల్లోకి రావడానికి ఆసక్తిగా ఉన్నా. తెలుగులో కూడా రావొచ్చు. మహేష్‌బాబు అంటే ఇష్టం.

రైతు కుటుంబంలో పుట్టిన మీకు అందాలపోటీలపై ఆసక్తి ఎలా కలిగింది?

నాకు తొమ్మిది, పదేళ్ల వయసులో ఉండగా ఐశ్వర్యరాయ్ గురించి తెలిసింది. ఆమె ఎవరు? మిస్ వరల్డ్‌గా ఎలా ఎంపికైంది అని అమ్మను అడిగా. 'దేవదాస్' సినిమాలో ఐశ్వర్యరాయ్ అందం చూసి ఆశ్చర్యపోయా. ఆ రోజే నేను కూడా అందాల కిరీటం దక్కించుకోవాలని అనుకున్నా. తర్వాత కాలంలో ముంబై వచ్చి చదువుకుంటూనే నా లక్ష్యం వైపు దృష్టిపెట్టా. తొలుత మిస్ రాజస్థాన్ పోటీల్లో కిరీటం దక్కించుకున్నా. 2023లో 'ఫెమినా మిస్ ఇండియా' పోటీల్లో గెలిచి.. ఇప్పుడు తెలంగాణలో జరిగే మిస్ వరల్డ్ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించబోతున్నా.

అందాలపోటీల్లో పాల్గొంటూనే మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఇంత బిజీలో అదెలా సాధ్యమైంది?

మా నాన్నకు చదువంటే ఇష్టం. చిన్నప్పటినుంచి చదువుపైనే దృష్టి పెట్టాలని చెప్పేవారు. అందాల పోటీల వైపు వెళ్లేటప్పుడు కూడా ముందు తటపటాయించారు. కానీ నా కష్టం, శ్రమ, తపన చూసి.. నా ఆకాంక్షను అర్థం చేసుకున్నారు. మిస్ రాజస్థాన్‌గా గెలిచాక ఆయన మనస్ఫూర్తిగా మద్దతు ఇచ్చారు. మరి ఆయన కోరికను కూడా నెరవేర్చాలి కదా! అందుకే చదువు కొనసాగించా. ముంబైలోని లాలా లజపతిరాయ్ కళాశాల నుంచి మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశా.

హైదరాబాద్ చూశారు కదా.. ఎలా అనిపించింది?

హైదరాబాద్ ఒక ప్రేమ నగరం (ఏ సిటీ ఆఫ్ ప్యార్, ఇష్క్, మొహబ్బత్). ఇక్కడి నిర్మాణరీతులు అద్భుతం. చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్‌లను సందర్శించా. ఆ కట్టడాలు నా మనసుపై చెరగని ముద్రవేశాయి. ఉత్తరాది నుంచి వచ్చినా ఇక్కడి ప్రజలు నన్ను ఎంతో ఆదరించారు. హైదరాబాద్ నా సొంత ఇల్లులా అనిపించింది.

బలమైన నెట్‌వర్క్‌తోనే నిరంతరాయ విద్యుత్తు

» పురోగతిపై సమీక్షించిన కె.విజయానంద్

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బలమైన నెట్‌వర్క్‌తోనే సుస్థిరమైన, నిరంతరాయమైన కరెంటు సరఫరా సాధ్యమని ట్రాన్స్‌కో అధికారులకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించారు. ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్కింగ్ పనులపై శుక్రవారం ట్రాన్స్ జేఎండీ కీర్తి చేకూరి, డైరెక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో విజయానంద్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో 1,095కోట్లతో 400 కేవీ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు ఏడు, 220 కేవీ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు 11పూర్తయ్యాయని.. వీటివల్ల విద్యుత్తు ట్రాన్స్‌మిషన్ సామర్థ్యం పెరుగుతుందని, లోటల్టేజీ సమస్యలు నివారించవచ్చని వెల్లడించారు. రూ.4,065 కోట్లతో 55 ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయని కీర్తి చేకూరి వివరించారు.

తెలుగు అధికారి రాజశేఖరరెడ్డికి సీబీడీటీలో చోటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డులో (సీబీడీటీ) ఐఆర్ఎస్ అధికారి ఎల్.రాజశేఖరరెడ్డికి చోటు దక్కింది. సీబీడీటీలో ఖాళీగా ఉన్న పదవుల్లో రాజశేఖరరెడ్డి సహా నలుగురు ఐఆర్ఎస్ అధికారులను కేబినెట్ నియమకాల కమిటీ శుక్రవారం నియమించింది. ఆయన ఇదివరకు ఆదాయపన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా చెన్నైలో బాధ్యతలు నిర్వహించారు.

మైనార్టీలకిచ్చిన హామీలు నెరవేర్చడమే లక్ష్యం

» పాస్టర్లకు రూ.30కోట్ల గౌరవ వేతనం జమ: మంత్రి ఫరూక్

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పాస్టర్లకు ఒకేసారి 7నెలల గౌరవ వేతనం కింద రూ.30 కోట్లు విడుదల చేయడమే కాకుండా, 24 గంటల లోపలే ఆ మొత్తాన్ని వారి ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.35వేల మొత్తాన్ని జమ చేశామని పేర్కొన్నారు. క్రైస్తవులకు పవిత్రమైన గుడ్ ఫ్రైడే రోజున పాస్టర్లకు సంబంధించిన గౌరవవేతనాన్ని విడుదల చేసిన కూటమి ప్రభుత్వం.. ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దిరాల జోసఫ్ ఇమ్మాన్యూల్ పేర్కొన్నారు.

ప్రాథమికోన్నత స్కూళ్లలో ఎస్జీటీలా?



(మొదటి పేజీ తరువాయి)

టీచర్ల(ఎస్జీటీ)నే ఇవ్వడం సరికాదనే వాదన వినిపిస్తోంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117కు పాఠశాల విద్యాశాఖ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దాని ప్రకారం ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుంచి 8 తరగతులకు కూడా ఎస్జీటీలే బోధిస్తారు. వైసీపీ హయాంలో ప్రవేశ పెట్టిన ఈ విధానంపై పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా తక్కువ మంది ఉన్న చోట్ల అప్పటి ప్రభుత్వం మొత్తం ఎస్జీటీలనే కేటాయించింది. ఎక్కువ మంది విద్యార్థులుంటే స్కూల్ అసిస్టెంట్లను నియమించింది. 6వ తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లు బోధించాల్సి ఉంటుంది. కానీ, ఎస్జీటీలతో బోధించడం ఏంటని అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు దాదాపు 700 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చారు. ప్రాథమికోన్నత పాఠశాలలుగానే మిగిలిన వాటిలో మాత్రం 6 నుంచి 8 తరగతులకు ఎస్జీటీలను కేటాయించాలని విద్యాశాఖ ప్రతిపాదించింది. దీంతో దాదాపు 1200 ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధనపై ప్రతికూల ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తోంది. అలాగే, ప్రాథమిక తరగతుల బోధనకు ఎస్జీటీల కేటాయింపులోనూ మూడు రకాల విధానాలు పెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. కొత్తగా 1,557 ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులను కూడా చేర్చారు. ఇక, 1 నుంచి 5 తరగతుల్లో 10 మంది విద్యార్థులకు ఇద్దరు ఎస్జీటీలను కేటాయించారు. 11 నుంచి 30 మంది విద్యార్థులుంటే ముగ్గురు, 31 నుంచి 40 మంది విద్యార్థులుంటే నలుగురు, 40 మంది దాటితే ఐదుగురు ఎస్జీటీలను నియమిస్తారు.

ఫౌండేషన్ పాఠశాలల్లో ఇలా..

కేవలం 1, 2 తరగతులు మాత్రమే ఉండే ఫౌండేషన్ పాఠశాలల్లో 30 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని ఇస్తారు. 31 నుంచి 60 మంది వరకు ఇద్దరు ఎస్జీటీలను కేటాయిస్తారు. 1 నుంచి 5 తరగతులుండే బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో 20 మంది విద్యార్థుల వరకు ఒక టీచర్‌ను ఇస్తారు. 21 నుంచి 60 మందికి ఇద్దరిని నియమిస్తారు. ఇలా ప్రాథమిక తరగతులకు టీచర్ల కేటాయింపులో వ్యత్యాసం ఉండటంపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మరోవైపు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో 59 మంది విద్యార్థులకు నలుగురు ఎస్జీటీలను కేటాయిస్తారు. మిగులు టీచర్లు ఉంటే ఐదో టీచర్‌ను హెడ్ మాస్టర్(హెచ్ఎం)గా నియమిస్తారు. 150 మంది దాటితే ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని ఇస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో నలుగురు ఎస్జీటీలను కేటాయిస్తారు. ఉన్నత పాఠశాలల్లో 75 మంది కంటే తక్కువ విద్యార్థులుంటే హెచ్ఎం, పీఈటీ పోస్టు ఇవ్వరు. ఆ పాఠశాలల్లో సీనియర్ స్కూల్ అసిస్టెంట్ హెచ్ఎంగా వ్యవహరిస్తారు. 75 మంది విద్యార్థులు దాటే ఉన్నత పాఠశాలలకు హెచ్ఎం, పీఈటీ పోస్టులు కేటాయిస్తారు. 400 మంది విద్యార్థులు దాటితే రెండో పీఈటీ, 751 దాటితే మూడో పీఈటీ, ఆ తర్వాత ప్రతి 350 మంది విద్యార్థులకు ఒక పీఈటీ పోస్టు ఇస్తారు. ఈ విధానాలపైనే ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టెక్సాస్‌లో రోడ్డు ప్రమాదం.. గుంటూరు విద్యార్థిని మృతి

» రెండు నెలల్లో ఎంఎస్ పూర్తికానుండగా పెను విషాదం

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని టెక్సాస్‌లో ఎంఎస్ చదువుతున్న గుంటూరు నగరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన వి.దీప్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. టెక్సాస్‌లోని డెంటాన్ సిటీలో దీప్తి ఈ నెల 12వ తేదీన రోడ్డు పక్కన నడుచుకొంటూ వెళుతుండగా ట్రక్ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో దీప్తి స్నేహితురాలు స్నిగ్ధకు గాయాలయ్యాయి. స్నిగ్ధకు అక్కడి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుత ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. కాగా, ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండకు సమీపంలోని పెదకంచర్ల దీప్తి స్వగ్రామం. దీప్తి, ఆమె సోదరిని ఉన్నత చదువులు చదివించేందుకు వాళ్ల తండ్రి హన్మంతరావు గుంటూరు నగరంలోని రాజేంద్రనగర్‌కు వలస వచ్చారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో దీప్తి బీటెక్ పూర్తి చేసింది. ఉన్నత చదువు కోసం ఆమె యూఎస్ వెళ్లింది. దీప్తి మే నెలలో ఎంఎస్ చదువు పూర్తి కానుండగా రోడ్డు ప్రమాదం ఆమె ఉసురు తీసింది. అన్ని ఫార్మాలిటీలు పూర్తి చేసిన తర్వాత దీప్తి మృతదేహాన్ని శనివారం యూఎస్ నుంచి పంపించనున్నట్లు సమాచారం అందింది. సోమవారానికి హైదరాబాద్ విమానాశ్రయానికి దీప్తి మృతదేహం చేరుకొనే అవకాశం ఉంది.

ఏపీఎస్పీ కానిస్టేబుల్ హత్య

» ఓ మహిళతో వివాహేతర సంబంధం

» ఆమె కుమార్తెతో అసభ్య ప్రవర్తన

» తీవ్రంగా గొడవపడ్డ యువతి స్నేహితుడు

» తర్వాత పక్కా ప్లాన్‌తో హతమార్చిన వైనం

నంద్యాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నంద్యాలలో ఓ ఏపీఎస్పీ కానిస్టేబుల్ హత్యకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన ఫరూక్(33) మంగళగిరి ఆక్టోపస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. భార్య, పిల్లలతో మంగళగిరిలో నివాసం ఉంటున్నారు. ఆయన స్వగ్రామంలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు సమాచారం. సదరు మహిళను భర్త వదిలేయడంతో తన కుమార్తెతో కలిసి నంద్యాల శివారు నందమూరినగర్‌లో నివాసం ఉంటోంది. ఫరూక్ స్వగ్రామంలో పని ఉందని భార్యకు చెప్పి, 4రోజుల సెలవు తీసుకుని ఈ నెల 8న మంగళగిరి నుంచి వచ్చాడు. స్వగ్రామానికి వెళ్లకుండా ఆ మహిళ ఇంటికి వచ్చాడు. అక్కడ ఆమె కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. కుమార్తె స్నేహితుడు ఫరూక్‌తో గొడవ పడ్డాడు. ఈ నెల 9న మాట్లాడుదామని.. ఆ యువకుడు ఫరూక్‌ను పిలిచాడు. ఫరూక్‌ను తన వాహనంలో ఎక్కించుకుని ఆళ్లగడ్డ నియోజకవర్గం చాగలమర్రి మండల సమీపంలోకి తీసుకెళ్లాడు. పథకం ప్రకారం యువతి స్నేహితులు నలుగురు అక్కడకు వచ్చి కానిస్టేబుల్‌ను హతమార్చి నంద్యాల-గిద్దలూరు అటవీ ప్రాంతంలోని ఓ వంతెన కింద పడేసి పరారయ్యారు. మృతుడి భార్య ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫరూక్ హత్యకు గురైనట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్యకు పాల్పడిన వారితో పాటు మహిళను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చిత్రజ్యోతి

SINCE 1965

అలరించే ప్రేమగీతం



పాతతరం గ్రామీణ ప్రేమకథ నేపథ్యంలో అల్లుకున్న ఓ ఆసక్తికర కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'దూరదర్శని'. 'కలిపింది ఇద్దరినీ' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకుడు. బి. సాయిప్రతాప్‌రెడ్డి, జయశంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై రూపొందించిన ప్రేమగీతాన్ని దర్శకుడు సుకుమార్ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. సురేశ్ బనిశెట్టి సాహిత్యం అందించగా, ఆనంద్ గుర్రాన బాణీలు సమకూర్చారు. సింధుజ, శ్రీనివాసన్ ఆలపించారు. తొంభైల నాటి కాలానికి ప్రేక్షకులను తీసుకెళ్లి, నాటి ప్రేమకథలను గుర్తుకు తెచ్చేలా ఈ చిత్రం ఉంటుందని దర్శకుడు చెప్పారు. చాలా పరిశోధన చేసి రూపొందించిన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని నిర్మాతలు తెలిపారు.

క్లైమాక్స్ మెప్పిస్తోంది

కల్యాణ్‌రామ్

'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన ఆనందాన్ని ఇస్తోంది. విజయశాంతి గారితో కలసి ఈ సినిమా చేయడం గొప్ప అనుభూతినిచ్చింది. తల్లీ కొడుకుల అనుబంధం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. శ్రీకాంత్ గారి పాత్రకు ప్రేక్షకుల నుంచి చక్కని స్పందన వస్తోంది. 'ఇలాంటి క్లైమాక్స్ ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటివరకూ చూడలేదు' అని ప్రశంసలు అందుతున్నాయి. దర్శకుడు ప్రదీప్, నిర్మాత సునీల్, అశోక్ కష్టం వల్లే ప్రేక్షకులకు చేరువయ్యాం' అని కల్యాణ్‌రామ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి చక్కటి ప్రేక్షకాదరణ దక్కుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. దర్శకుడు ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ 'కల్యాణ్‌రామ్, విజయశాంతి గారి నటన ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు. ఒక మంచి సినిమాలో భాగమైనందుకు సంతోషంగా ఉందని నిర్మాత సునీల్ బలుసు తెలిపారు. అన్ని ఏరియాల నుంచి సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది అని శ్రీకాంత్ తెలిపారు.





ఒక్కరూ 'ఐ లవ్ యూ' చెప్పలేదు

కమల్ హాసన్

మణిరత్నం దర్శకత్వంలో తాను హీరోగా నటించిన 'థగ్‌లైఫ్' చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు నటించారని, వారిలో ఏ ఒక్కరూ తనకు ఐ లవ్ యూ చెప్పలేదని అగ్ర నటుడు కమల్ హాసన్ చమత్కరించారు. రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం జూన్ 5న విడుదలకానుంది. శుక్రవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో మూవీలోని తొలి పాటను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మణిరత్నం, కమల్ హాసన్, ఏఆర్ రెహ్మాన్, శింబు, త్రిష, అభిరామి తదితరులు పాల్గొన్నారు. ఇందులో కమల్ హాసన్ మాట్లాడుతూ, 'మణిరత్నం దర్శకత్వంలో 37 యేళ్ళ క్రితం 'నాయగన్' చిత్రంలో నటించాను. ఆయనలో అప్పటికీ ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదు. అది ఆయన గొప్పతనం. త్రిష, అభిరామి హీరోయిన్లుగా నటించారు. వారిలో ఒక్కరు కూడా ఐ లవ్ యూ చెప్పలేదు. ఏఆర్ రెహ్మాన్ సంగీతం నా మనసుకు దగ్గరగా ఉంటుంది. చిత్రపరిశ్రమలో హీరో శింబు లాంటి వ్యక్తి చాలా అరుదుగా ఉంటారు. ఈ సినిమాలో భాగమైన అందరికీ కృతజ్ఞతలు. ఇప్పుడు భారతీయ చిత్రపరిశ్రమ ఎంతగానో అభివృద్ధి చెందింది. తమిళం తర్వాత భారతీయ అనుసంధాన భాష ఆంగ్లమే' అని కమల్ హాసన్ స్పష్టం చేశారు. దర్శకుడు మణిరత్నం మాట్లాడుతూ, 'చాలా సంవత్సరాల తర్వాత కమల్‌తో పనిచేసే అవకాశం వచ్చింది. ఆయన గొప్ప నటుడు. సినిమాను ప్రేమిస్తారు. షూటింగ్ సమయంలో ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అన్నారు. హీరోయిన్ త్రిష మాట్లాడుతూ, "థగ్‌లైఫ్' మూవీలో కమల్ వంటి గొప్ప నటుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. హీరో శింబు మాట్లాడుతూ, 'ఎంతో మంది గొప్ప నటులు ఈ సినిమా కోసం పనిచేశారు. వారితో కలిసి నటించినందుకు ఆనందంగా ఉంది. ఏఆర్ రెహ్మాన్ నాకు గురువుతో సమానం' అన్నారు. ఏఆర్ రెహ్మాన్ మాట్లాడుతూ, 'కమల్ - మణిరత్నంలది హిట్ కాంబినేషన్. ఈ సినిమా పాటల్లో ఒక మేజిక్ ఉంది. ఈ పాటలు ఎంతగానో ఆలరిస్తాయి. నాలుగు నెలలుగా సినిమా కోసం శ్రమిస్తున్నాం' అన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠకు గురిచేసే రాత్రి



లవ్, సెంటిమెంట్, హారర్, సస్పెన్స్ అంశాల మేళవింపుగా తెరకెక్కుతోన్న చిత్రం 'బ్లైండ్ స్పాట్'. నవీన్‌చంద్ర కథానాయకుడిగా రాకేశ్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. రామకృష్ణ వీరపనేని నిర్మించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిదని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ సందర్భంగా నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా కథ ఉంటుంది. ఒక రాత్రిలో జరిగే సంఘటనలతో కొందరి జీవితాలు ఎలా ప్రభావితమయ్యాయి అనేది ఆసక్తికరంగా చూపించబోతున్నాం. నటుడిగా నాకు కొత్త అనుభూతిని ఇచ్చిన చిత్రమిది' అన్నారు. రాశీ సింగ్ మాట్లాడుతూ 'కథలో నాది కీలకపాత్ర. నాకు ఇష్టమైన జానర్‌లో రూపొందిన చిత్రమిది' అని చెప్పారు. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం అని దర్శకుడు చెప్పారు.

మేలో శుభం విడుదల



హీరోయిన్ సమంత తన సొంత బేనర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బేనర్‌పై నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. శుక్రవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. మే 9న 'శుభం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. మన జీవితాలతో ముడిపడిన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని ప్రేక్షకులను ఆకట్టుకొనే అన్ని అంశాలతో తెరకెక్కించిన చిత్రమిదని యూనిట్ తెలిపింది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. హర్షిత్‌రెడ్డి, శ్రియా కొంతం, గవిరెడ్డి శ్రీనివాస్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, క్లింటన్ సెరజో

వినోదం పంచుతుంది



ఆమిర్‌ఖాన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'సితారే జమీన్ పర్'. ఆయన స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'తారే జమీన్ పర్' చిత్రానికి ఇది సీక్వెల్. ఆర్ ఎస్ ప్రసన్న దర్శకుడు. ఆమిర్‌ఖాన్ సరసన జెనీలియా నటిస్తున్నారు. మే 1న ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు యూనిట్ శుక్రవారం ప్రకటించింది. "తారే జమీన్ పర్' ప్రేక్షకులను భావోద్వేగానికి గురి చేసింది. మనవైన జీవితాల్ని, పరిస్థితుల్ని ఆవిష్కరిస్తూ తెరకెక్కించిన చిత్రమది. కానీ 'సితారే జమీన్ పర్' వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. అందరినీ నవ్విస్తుంది' అని ఆమిర్‌ఖాన్ ఈ సందర్భంగా తెలిపారు. జూన్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

యూఎఫ్ఓ.. క్యూబ్‌లకు సీసీఐ జరిమానా

ప్రముఖ డిజిటల్ సినిమా డిస్ట్రిబ్యూషన్, సినిమా అడ్వర్టైజింగ్ సంస్థ యూఎఫ్ఓ మూవీస్‌పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జరిమానాను విధించింది. అలాగే దాని అనుబంధ సంస్థలైన క్యూబ్ సినిమా టెక్నాలజీస్, స్క్రాబిల్ డిజిటల్స్‌తో సహా మూడింటికీ కలిపి దాదాపు రూ.2.70 కోట్ల పెనాల్టీని విధించింది. ఈ సంస్థలు.. అక్రమ వ్యాపార విధానాలను అవలంబిస్తున్నట్లు సీసీఐ పేర్కొంది. ఈ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్న థియేటర్ల నుంచి పోస్ట్ ప్రొడక్షన్ సర్వీసులు, సినిమా కంటెంట్‌ను అందించే ఇతర పోటీ సంస్థలకు ఎలాంటి వ్యాపార అవకాశాలు దక్కకుండా గుత్తాధిపత్య ధోరణిని ప్రదర్శిస్తున్నట్లు తెలిపింది. ఇకపై ఇలాంటి అనైతిక పద్ధతులను కొనసాగించవద్దని ఆ సంస్థలను ఆదేశించింది.

బెట్టింగ్ యాప్స్‌పై కఠిన చర్యలు: లోకేశ్



తిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఆ ముప్పునకు చరమ గీతం పాడటానికి చట్టపరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. కొంతకాలంగా బెట్టింగ్ యాప్‌లపై 'నా అన్వేషణ' యూట్యూబర్ అన్వేష్ పోరాటం చేస్తున్నాడు. గోవిందా అనే పేరుతో బెట్టింగ్ యాప్స్ నడుపుతున్నారని, వాటిని అడ్డుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ను కోరుతూ ఎక్స్‌లో అతను పోస్ట్ చేశాడు. దీనిపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "బెట్టింగ్ యాప్స్ జీవితాలను నాశనం చేస్తున్నాయి. ఇక ఇది ఆగాలి. బెట్టింగ్ యాప్‌ల బారిన పడకుండా అవగాహన కల్పించడంతో పాటు ఆ యాప్‌లపై కఠిన చర్యలు తీసుకోవడమే పరిష్కారం. దేశానికి ఆదర్శంగా నిలిచేలా యాంటీ బెట్టింగ్ పాలసీని రూపొందిస్తున్నాం" అని పేర్కొన్నారు.

వైసీపీ.. డైవర్షన్ రాజకీయం

మంత్రులు అనగాని, గొట్టిపాటి, సత్యకుమార్, సవిత ధ్వజం



విలేకరుల సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు

మడకశిర, అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): 'జగన్ ఆస్తులను ఈడీ అటాచ్ చేస్తుందనే విషయం తెలిసే టీటీడీ గోశాలపై వైసీపీ రాజకీయం చేస్తోంది. జగన్ అక్రమాల గురించి చర్చ జరగకుండా నీచమైన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు' అని మంత్రులు అనగాని, గొట్టిపాటి, సవిత, సత్యకుమార్ మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో శుక్రవారం నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, భూమి పూజలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మట్లాడారు. మంత్రి అనగాని మాట్లాడుతూ, 'ఉమ్మడి అనంతపురం జిల్లాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. సోలార్ ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నారు. జగన్ అక్రమ ఆస్తుల కేసులో దాల్మియా ఆస్తులను ఈడీ అటాచ్ చేస్తున్న విషయాన్ని తెలుసుకొని డైవర్షన్ రాజకీయాలకు వైసీపీ నాయకులు తెరతీశారు. ప్రతి గోవుకు జియో ట్యాగింగ్ చేశాం. గో సంరక్షణ భేషుగ్గా ఉందని అందరూ ప్రశంసిస్తున్నారు. వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తాం. దోషులను కఠినంగా శిక్షిస్తాం' అన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ, మడకశిర నియోజకవర్గంలోని చివరి ఎకరాకు కూడా సాగునీరు అందిస్తామని అన్నారు. మడకశిరలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం మరో మూడు సబ్‌స్టేషన్లను మంజూరు చేశామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. తమ అవినీతి బాగోతాలు బయటకు వస్తున్నాయని గ్రహించి ప్రజల దృష్టిని మళ్లించడానికి టీటీడీ గోశాలను రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, ప్రశాంతంగా ఉన్న తిరుమలలో అలజడులు సృష్టించేందుకు వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్ విమర్శించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఏకవచనంతో సంబోధించిన రోజా వెంటనే యాదవ సామాజికవర్గానికి క్షమాపణ చెప్పాలని నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు.

ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి చర్యలు: కొండపల్లి

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి అవసరమైన భూముల గుర్తింపు, మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై ఏపీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఇతర అధికారులతో శుక్రవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇక నుంచి ప్రతి మంగళవారం ఈ పార్కుల పురోగతి, స్థితిగతులపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు.

తిరుమల వేదికగా రాజకీయాలు... జగన్‌కు కొత్తేమీ కాదు: రమేశ్ నాయుడు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను సీఎం చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ నాయుడు అన్నారు. సీఎంగా ఉన్న రోజుల్లో ఏనాడూ జగన్ సతీసమేతంగా పట్టువస్త్రాలు ఒంటిమిట్టకు తీసుకురాలేదని విమర్శించారు. శుక్రవారం, ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జగన్ ఆయన సొంత జిల్లాలో ఏటా జరిగే ఒంటిమిట్ట, అన్నమయ్య ఉత్సవాలను ఏరోజు ఘనంగా నిర్వహించలేదు. ఒంటిమిట్ట ఉత్సవాలను పక్కదారి పట్టించేందుకు వైసీపీ నేతలు రాష్ట్రంలో ఆవు కథను తీసుకొచ్చారు. తిరుమలను వేదికగా చేసుకుని రాజకీయాలు చేయడం జగన్ ఫ్యామిలీకి కొత్తకాదు' అని రమేశ్ నాయుడు విమర్శించారు.

టికెట్ల వ్యాపారం పోవడంతో రోజాకు పిచ్చెక్కింది: బొలిశెట్టి

విశాఖపట్నం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నాయకురాలు రోజా మంత్రిగా పనిచేసినప్పుడు టీటీడీ దర్శనాల టికెట్లను సినిమా టికెట్లలా అమ్ముకొని లాభపడ్డారు. ఇప్పుడు ఆ వ్యాపారం పోవడంతో పిచ్చెక్కినట్టు ఏవేవో మాట్లాడుతున్నారు' అని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య ఆరోపించారు. విశాఖలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజా గురించి మాట్లాడాలంటేనే సిగ్గుగా ఉందన్నారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ని విమర్శించే హక్కు రోజాకు లేదన్నారు. పవన్ కల్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు ఆమె వారం రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లకు మంత్రుల కమిటీ


అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ మే 2న అమరావతి పర్యనటకు రానున్నారు. రాజధాని అమరావతిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చేసేందుకు ఆరుగురు మంత్రులతో కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మానవ వనరులశాఖ మంత్రి లోకేశ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రతో కమిటీ సభ్యులుగా, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను నోడల్ అధికారిగా నియమించారు.

గవర్నర్లందరూ ఆర్ఎస్ఎస్ వాళ్లే

- గోశాల విషయాన్ని ఇంతటితో ఆపండి: నారాయణ, రామకృష్ణ

అమరావతి/తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల గవర్నర్లందరూ ఆర్ఎస్ఎస్ వాళ్లేనని, ప్రజాస్వామ్యానికి వారు పాతరేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం తిరుపతిలో నారాయణ, విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. న్యాయ వ్యవస్థలను ధ్వంసం చేసే రీతిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన బిల్లులను తొక్కిపెట్టే అధికారం గవర్నర్‌లకు లేదంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రజాస్వామ్యవాదులంతా స్వాగతించారని చెప్పారు. అయితే ఉప రాష్ట్రపతి న్యాయవ్యవస్థపై వ్యాఖ్యలతో దాడి చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ఇటీవల వక్ఫ్ సవరణ బిల్లు విషయంలోనూ ఆయన అవమానకరమైన వ్యాఖ్యలు చేశారన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల ప్రజలకున్న విశ్వాసాలతో స్వార్థ రాజకీయాల కోసం చెలగాటమాడవద్దని నారాయణ నేతలను కోరారు. గోశాల విషయాన్ని ఇంతటితో ఆపాలని చేతులెత్తి జోడించి చెబుతున్నానన్నారు. కాగా, అమరావతిలో రాజధాని నిర్మాణానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని రామకృష్ణ తెలిపారు. వైఎస్ జగన్ హయాంలో తెచ్చిన మూడు రాజధానుల అంశాన్ని పూర్తిగా వ్యతిరేకించామని గుర్తు చేశారు. రాజధాని విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. కేవలం ప్రచారం కోసమే ప్రధాని నరేంద్రమోదీ వచ్చేనెల 2న అమరావతికి వస్తున్నారని విమర్శించారు.

సూత్రధారి కసిరెడ్డే



(మొదటి పేజీ తరువాయి)

జరిగిందా? అని ప్రశ్నించారు. ఆ రెండు చోట్ల జరిగిన భేటీల్లో నేను పాల్గొన్నట్టు తమకు సమాచారం ఉందని అధికారులు తెలిపారు. వాటిల్లో పాల్గొన్నట్టు నేను అంగీకరించాను. మొదటి భేటీలో నాటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్, ఎంపీ మిథున్‌రెడ్డి, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి(ఎస్పీవై బిజ్లరీస్) హాజరయ్యారని, వారే రెండో సమావేశంలోను పాల్గొన్నారని తెలిపాను. ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి హాజరు కాలేదని చెప్పాను. ఈ సమావేశాల్లో లిక్కర్ పాలసీపై చర్చించినట్టు చెప్పాను. ముడుపుల విషయం తెలియదన్నాను. వ్యాపారం చేసుకుంటామని రాజ్ కసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, మిథున్ రెడ్డి కోరిక మేరకు అరబిందో కంపెనీ నుంచి రూ.100కోట్లు ఇప్పించానని చెప్పాను. రాజ్ కసిరెడ్డి చెప్పిన అడాన్ కంపెనీకి రూ.60కోట్లు, డీకార్ట్ కంపెనీకి రూ.40కోట్లు రికమండ్ చేసి ఇప్పించారా? ఎవరు చెబితే ఇప్పించారని అధికారులు ప్రశ్నించారు. నేనే రికమండ్ చేసి ఇప్పించానని చెప్పాను. అడాన్ కంపెనీని ఎవరు తీసుకువచ్చారు? ఎలా తీసుకువచ్చారు? ఏ కారణంతో తీసుకువచ్చారు? అన్న విషయం నాకు తెలియదని చెప్పా. ఒడిశాలో అమ్మకందారు, చెన్నైలో కొనుగోలుదారు ఉండగా ఏపీ మీదుగా సరుకు వెళ్తున్నప్పుడు దానికి డ్యూటీ లేకుండా మళ్లించి అమ్మకాలు చేశారా అని అడిగారు. వాటికి రాజ్ కసిరెడ్డి మాత్రమే సమాధానం చెప్పగలరని చేశాను. రాజ్ కసిరెడ్డి స్థానికంగా ఉన్న ఈబీ స్పిరిట్స్‌తో పాటు మరో రెండు కంపెనీలను లీజుకు తీసుకుని అందులో తయారు చేసిన కొత్త బ్రాండ్లను ఎలాంటి డ్యూటీ లేకుండా బెల్టు షాపుల ద్వారా అమ్మారా అని అధికారులు ప్రశ్నించారు. ఇది రాజ్ కసిరెడ్డి బదులు ఇవ్వవలసిన అంశమని చెప్పా.. పిలిస్తే మరోసారి విచారణకు వస్తానని చెప్పాను." అని విజయసాయి వివరించారు.

అది మిథున్‌రెడ్డినే అడగండి

మిథున్‌రెడ్డికి లిక్కర్ స్కాంతో సంబంధం ఉందో లేదో ఆయననే అడిగి తెలుసుకోవాలని అధికారులకు తెలిపానని విజయసాయి వివరించారు. మీడియా వేసే ఊహాజనిత ప్రశ్నలకు స్పందించలేనన్నారు. "కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి లిక్కర్ స్కామ్‌కు కర్త, కర్మ, క్రియ అని ఇంతకుముందు చెప్పాను. ఇప్పుడు కూడా చెబుతున్నాను. తెలియని విషయాలను తెలిసినట్టుగా చెప్పను. స్కాం జరిగిందా లేదా అన్న విషయం పరారీలో ఉన్న రాజ్ కసిరెడ్డిని పట్టుకున్నతర్వాత ఆయననే అడగండి. దీని వెనుక బిగ్‌బాస్ ఉన్నారో లేదో నాకు తెలియదు. రాజ్ కసిరెడ్డితో ఎవరెవరు కలిసి పనిచేశారని, నెట్‌వర్క్‌లో ఎవరున్నారని అధికారులు అడిగారు. రాజ్ కసిరెడ్డి, ఆయన కో బ్రదర్ (తోడల్లుడు) అవినాశ్‌రెడ్డి, అనుచరుడు చాణుక్య అలియాస్ ప్రకాశ్, కిరణ్, సుమిత్, సైఫ్‌తోపాటు చాలామంది నెట్‌వర్క్‌లో ఉన్నారని వివరించాను." అని వివరించారు.

నంబరు 2 అనేది లేదు..

యూట్యూబ్, శాటిలైట్ చానళ్లలో సాయిరెడ్డి నంబరు 2 అని చెబుతున్నారని, కానీ ప్రాంతీయ పార్టీల్లో నంబరు 2 స్థానం ఉండదని మాజీ ఎంపీ వివరించారు. "ఒకటి నుంచి 100 వరకు ఎవరూ ఉండరని, 101 నుంచే ఉంటారని అప్పట్లో మా పార్టీ అధ్యక్షుడు స్వయంగా చెప్పారు. నంబరు 2 స్థానం ఒక మిథ్య. అధికారంలో లేనప్పుడు, 2014 నవంబరు నుంచి 2019 వరకు ఒంటి చేత్తోతో పార్టీని నడిపాను. జగన్ ఆదేశాలను నేను, ప్రశాంత్ కిషోర్ అమలు చేశాం. అప్పుడూ నన్ను నేను నంబరు 2గా భావించుకోలేదు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే నంబరు 2 మిథ్య అన్న విషయాన్ని గమనించాను. నా విషయంలో తినగ తినగ వేము తియ్య అన్న సామెత నిజమనిపిస్తోంది. కోటరీ నా మీద జగన్‌కు చెప్పారు. సాయిరెడ్డి ఎప్పటికైనా వెన్నుపోటుదారుడవుతాడు, ఏ రోజైనా స్థానభ్రంశం చేస్తాడు అని చెప్పారు. నేను ఏదో వేల కోట్ల రూపాయలు దోచేశానని ఆయనకు చెప్పి అపవాదును మోపారు. ఈ కోటరీ మీడియా అనుకుంటున్న రెండో స్థానం నుంచి నెమ్మదిగా తగ్గించుకుంటూ 2000 స్థానంలో నన్ను పడేసింది. చాలా అవమానాల పాలయ్యాను. అవమాన భారం భరించలేక, కోటరీ వేధింపులు తట్టుకోలేక అప్పటి మా నాయకుడి మనస్సులో స్థానం లేదని గ్రహించి పార్టీని వీడాను." అని విజయసాయి తెలిపారు

'సాక్షి'ని నేనే పెట్టించా

సాక్షి పత్రిక, చానల్‌ను తానే పెట్టించానని విజయసాయి తెలిపారు. ఆ ముసలోడు(విజయసాయిరెడ్డి) వ్యవసాయం చేసుకుంటానని చెప్పి రాజకీయాలు చేస్తున్నాడంటూ సాక్షి చానల్‌లో కేఎస్ఆర్ లైవ్‌షోలో వ్యాఖ్యలు చేయించారన్నారు. "రాజీనామా చేసినప్పుడు ఒకసారి, సీఐడీ విచారణకు పిలిచినప్పుడు మరోసారి మాత్రమే నేను రాజకీయాలు మాట్లాడాను. కానీ, కొంతమంది ఏదోదో మాట్లాడుతున్నారు. నన్ను రాజ్యసభకు పంపుతున్నారని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని చేస్తున్నారని, వేరే రాష్ట్రానికి ఇన్‌చార్జిగా పంపుతున్నారని.. ఏదేదో ఊహించుకుంటున్నారు. నేను ఏ రోజూ ఎంపీ సీటు అడగలేదు. ఇప్పుడు నేను వైసీపీలో లేను. అందువల్ల ఏదైనా చేయవచ్చు. రాజకీయాల్లోకి రావాలంటే మీ (సాక్షి చానల్‌ను ఉద్దేశించి) అనుమతి కావాలా? వ్యవసాయాన్ని వదిలేసి వ్యాపార రంగంలోకి వెళ్లాను. అది నా ఇష్టం." అని విజయసాయి స్పష్టం చేశారు.

సాయిరెడ్డి 'భ్రాంతి'!

- 'ఆంధ్రజ్యోతి'పై తప్పుడు ఆరోపణలు
- రాయనిది రాసినట్లుగా 'భ్రమలు'

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విజయ సాయి రెడ్డి వైసీపీని వీడినా... భ్రమలు, భ్రాంతులు మాత్రం ఆయనను వీడలేదు. అసందర్భంగా, అనవసరంగా 'ఆంధ్రజ్యోతి'ని ఆయన ఆడిపోసుకున్నారు. శుక్రవారం ఆయన విజయవాడలో 'సిట్' విచారణకు హాజరైన తర్వాత... మీడియాతో మాట్లాడారు. శుక్రవారం (18న) విచారణకు రావాలని విజయసాయిరెడ్డికి సిట్ కొద్దిరోజుల కిందట నోటీసులిచ్చింది. అయితే, శుక్రవారం ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలున్నందున, 17నే వస్తానని ఆయన సమాచారమిచ్చారు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. 'మద్యం స్కామ్ కర్త, కర్మ, క్రియ రాజ్ కసిరెడ్డి' అని గతంలో ఆయన చెప్పిన మాటలనే గుర్తు చేసింది. అయితే... శుక్రవారం మీడియాతో మాట్లాడిన సాయిరెడ్డి అనవసరంగా 'ఆంధ్రజ్యోతి'ని ఆడిపోసుకున్నారు. "ముందుగా రావడానికి నాకేమీ అత్యుత్సాహం లేదు. మీకు ఉన్నట్లుంది. సాయిరెడ్డి ముందే విచారణకు వచ్చి జగన్‌పై ఏదో చెప్పబోతున్నాడనే భ్రాంతిని ఆంధ్రజ్యోతి కలిగించింది" అని వ్యాఖ్యానించారు. ఉన్నది ఉన్నట్లు రాయడం భ్రాంతా? లేనిది ఉన్నట్లుగా మాట్లాడటం భ్రాంతా అన్నది సాయి రెడ్డికే తెలియాలి!

బెయిలివ్వండి.. అరెస్టు నుంచి కాపాడండి

- దర్యాప్తునకు సహకరిస్తా.. కోరినప్పుడు అందుబాటులో ఉంటా
- మద్యం స్కాం కేసులో హైకోర్టులో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పిటిషన్

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణానికి సంబంధించి గత ఏడాది సెప్టెంబరు 23న సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఐటీ మాజీ సలహాదారు, జగన్‌కు అత్యంత సన్నిహితుడైన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టు నుండి రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు రానుంది. 'మద్యం కొనుగోళ్లలో నేను కీలకపాత్ర పోషించానంటూ ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీబీసీఎల్) అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి, మరో అధికారి సత్యప్రసాద్ సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద వాంగ్మూలం ఇచ్చినట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఆ తర్వాత సాక్షిగా తమ ముందు విచారణకు హాజరుకావాలని దర్యాప్తు అధికారి పలుమార్లు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179(సీఆర్‌పీసీ సెక్షన్ 160) కింద నాకు నోటీసులిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సలహాదారుగా పనిచేసినందునే కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారు. దర్యాప్తునకు సహకరించాడనే కారణంతో ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న వాసుదేవరెడ్డిని బాధ్యతల నుంచి రిలీవ్ చేసి మాతృసంస్థ రైల్వేలో చేరేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతించినట్లు పత్రికలో కథనం వచ్చింది. అన్నీ తానై వ్యవహరించిన వాసుదేవరెడ్డిని రిలీవ్ చేసి.. గత ప్రభుత్వంతో సంబంధం ఉన్న నాలాంటివారిని లక్ష్యంగా చేసుకోవడం చట్టవిరుద్ధం. మా కార్యాలయం, నివాసంతో పాటు బంధువుల ఇళ్లలో అధికారులు ఇటీవల సోదాలు నిర్వహించి రికార్డులను సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంది. దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. కోరినప్పుడు విచారణకు అందుబాటులో ఉంటాను. ముందస్తు బెయిల్ మంజూరు చేయండి' అని పిటిషన్‌లో కోరారు.

మీ అబ్బాయిని రమ్మనండి

- విచారణకు సహకరిస్తే మీకే మంచిది.. రాజ్ కసిరెడ్డి తండ్రికి సిట్ సూచన
- ఆచూకీ తెలియదన్న ఉపేందర్‌రెడ్డి.. చివరకు తన వంతు ప్రయత్నం చేస్తానని వెల్లడి

మీ అబ్బాయిని విచారణకు రమ్మనండి.. మాకు సహకరిస్తే మీకే మంచిది..' అని సిట్ అధికారులు రాజ్ కసిరెడ్డి తండ్రి ఉపేందర్‌రెడ్డికి సూచించారు. మిమ్మల్ని గౌరవంగా చూశాం కదా..! వాసుదేవరెడ్డిని, విజయసాయిరెడ్డిని అరెస్టు చేశామా అని కూడా అన్నారు. మద్యం కుంభకోణం కేసు విచారణలో భాగంగా సిట్ అధికారులు విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో వరుసగా రెండో రోజూ ఉపేందర్‌రెడ్డిని మూడు గంటలపాటు ప్రశ్నించారు. తన కుమారుడు ఎక్కడున్నాడో తనకు తెలియదని ఆయన బదులిచ్చారు. ఎన్ని సార్లు ప్రశ్నించినా తనకు ఎలాంటి సమాచారం లేదనే చెప్పారు. 'మేము రాజ్‌ను ఎలాగైనా పట్టుకుంటాం. సహకరిస్తే మీకే మంచిది.. చట్టాన్ని గౌరవించండి' అని సిట్ అధికారులు అన్నారు. కాసేపు మౌనం వహించిన ఉపేందర్‌రెడ్డి.. మీరు చెప్పింది విన్నానని, తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అనంతరం అధికారులు ఆయన్ను పంపివేశారు.

గనుల ఆదాయం పెంచుదాం

(మొదటి పేజీ తరువాయి)

సూక్ష్మ ఖనిజాల పాలసీ-2025ని విడుదల చేస్తూ గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు (జీవో 57) జారీ చేశారు. దీనికి నూతన పాలసీ డాక్యుమెంట్‌ను జతచేసి తగిన చర్యలు తీసుకోవాలని గనుల శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.

పాలసీలోని ముఖ్యాంశాలు..

వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్

జగన్ హయాంలో 2022 నాటికి పెండింగ్‌లో ఉన్న లీజు వివాదాలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను అమలు చేయాలని ప్రభుత్వం నూతన పాలసీలో పొందుపరిచింది. ఆనాటి దరఖాస్తుదారులకు ఎవరు ముందు వస్తే వారికే అవకాశం (ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్) ప్రాతిపదికన అమలు చేయనున్నారు. దరఖాస్తుదారులకు ఒక సంవత్సరానికి మాత్రమే లెటర్ ఆఫ్ ఇండెంట్ (ఎల్ఓఐ) ఇవ్వనున్నారు. ఎల్ఓఐ అందని వారికి అనర్హులుగా భావించాల్సి ఉంటుంది. ఎల్ఓఐ ఇచ్చే సమయంలో 3 రెట్ల వార్షిక డెడ్‌రెంట్ (ఏడీఆర్), క్వారీ లీజులు ఇచ్చే సమయంలో మరో రెండు రెట్ల ఏడీఆర్‌ను ప్రీమియం రూపంలో చెల్లించాలి. నిజానికి జగన్ ప్రభుత్వం హయాంలో తీసుకున్న నిర్ణయం కారణంగా 6 వేల దరఖాస్తులు అనర్హతకు గురయ్యాయి.

ఇక సులభంగా లీజులు..

జగన్ సర్కారు తీసుకొచ్చిన పాలసీ అన్ని లీజులను వేలం విధానానికి మళ్లించింది. దీనివల్ల పెత్తందారులు, ఆర్థికంగా బలాన్ని ప్రదర్శించిన వారికే కీలక లీజులు దక్కాయి. ఇప్పుడు ఈ విధానాన్ని ప్రభుత్వం మార్చివేసింది. కొత్తగా దరఖాస్తు విధానంలో లీజులు ఇవ్వనుంది. పట్టా, డీకేటీ, అటవీ భూముల్లో మైనర్ మినరల్స్‌కు దరఖాస్తు పద్ధతిలోనే లీజులు మంజూరు చేయనుంది. నివాసాలు, నీటిపారుదల రంగం, మౌలిక వసతుల ప్రాజెక్టుల అవసరాలను తీర్చేందుకు గ్రానైట్, బిల్డింగ్ మెటీరియల్స్ (రోడ్‌మెంట్, గ్రావెల్, బిల్డింగ్‌స్టోన్స్) వంటి వాటిని దరఖాస్తు పద్ధతిలో మంజూరు చేస్తారు. సిలికాశాండ్, క్వార్ట్జ్, డోలమైట్ వంటి పారిశ్రామిక ఖనిజాలు ప్రీమియంతో వేలం ద్వారా మంజూరు చేస్తారు. ఇందులో వన్‌టైమ్ ప్రీమియం బదులు సీనరేజీ ఫీజు శాతాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు.

ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్ట్

ప్రస్తుతం ఏడు ఉమ్మడి జిల్లాల్లోనే సీన రేజీ కాంట్రాక్ట్ అమల్లో ఉంది. ఇకపై రాష్ట్రమంతా దీన్ని అమలు చేయనున్నారు. దీనివల్ల స్థిరమైన ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అంటే, ఇకపై అన్ని జిల్లాల్లో సీనరేజీ కాంట్రాక్ట్ అమలు కానుంది. ఫీజుల వసూళ్లలో గనులశాఖ అధికారుల పెత్తనం ఉండదన్నమాట. ప్రభుత్వం తాజాగా సీనరేజీ కాంట్రాక్ట్ కాలపరిమితిని 73 రోజుల మేర పొడిగింపు ఇచ్చింది. ఈ కాంట్రాక్ట్ కాలపరిమితి ముగిశాక ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 13 జిల్లాలకు టెండర్లు నిర్వహించి కాంట్రాక్ట్ సంస్థలను ఎంపిక చేయనుంది.

ఆర్థిక భారం ఉండదు..

జగన్ ప్రభుత్వం కరోనా కాలంలో గనులపై ఇబ్బడిముబ్బడిగా ఫీజుల భారం వేసింది. పెండింగ్ దరఖాస్తులు, కొత్త ప్రాంతాలు, రెన్యువల్స్‌పై లీజులు మంజూరు చేసేందుకు ఫీజుల భారం ఎక్కువగా ఉంది. కొత్త పాలసీ ద్వారా ఫీజుల భారం తగ్గనుంది. 10 రెట్లుగా ఉన్న డెడ్‌రెంట్‌ను ఐదు రెట్లకు తగ్గించారు. ఈ మొత్తాన్ని 2-3 ఏళ్లలో రెండు సులభతర వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల లీజుదారులపై ఆర్థిక ఒత్తిడి తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. లైమ్‌స్టోన్ శ్లాబ్స్ కోసం ప్రీమియం మొత్తం 3 రెట్ల డెడ్‌రెంట్‌కు తగ్గించారు. డెడ్‌రెంట్‌ను ఇకపై వార్షికంగా ఫైనల్ చేయనున్నారు. రెన్యువల్స్‌కు సంబంధించి ప్రీమియం 1-2 రెట్ల వార్షిక డెడ్‌రెంట్ నుంచి 5 రెట్లకు తగ్గించారు. డెడ్‌రెంట్లను కూడా ఖనిజాల ప్రాతిపదికన సవరించారు. మొత్తంగా డెడ్‌రెంట్లను ప్రీమియం రూపంలో పరిగణించి వసూలు చేస్తారు. దీనివల్ల కొత్తగా ఎలాంటి అదనపు భారం ఉండదని ప్రభుత్వం చెబుతోంది. తప్పులు జరిగినప్పుడు లీజుదారులపై విధించే జరిమానాలను 10 రెట్ల నుంచి 2 రెట్లు, ఐదు రెట్ల నుంచి ఒక రెట్టుకు ప్రభుత్వం తగ్గించింది. అలాగే గనుల ముందస్తు అనుమతుల కోసం లీజుదారులు రోజుల తరబడి ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఏకీకృత విధానంలో పర్మిషన్‌లు ఇచ్చేలా ఇంటర్ డిపార్ట్‌మెంట్‌ల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. లీజుదారులు లీజును బదిలీ చేయాలనుకుంటే ఇప్పటి వరకు భారీగా ఫీజులు చెల్లించాలి. కొత్త పాలసీలో దీన్ని రద్దు చేశారు. కుటుంబ సభ్యుల పేరిట లీజు బదిలీపై వసూలు చేసే ఫీజును పూర్తిగా మాఫీ చేశారు.

పెరిగిన లీజు కాలం..

గతంతో పోలిస్తే సూక్ష్మ ఖనిజాల మైనింగ్ లీజుల కాలపరిమితిని భారీగా పెంచారు. కొత్తగా మంజూరయ్యే గ్రానైట్ లీజు కాలపరిమితిని 20 నుంచి 30 ఏళ్లకు, రోడ్‌మెటల్ యూనిట్ లీజు కాలపరిమితిని 15 నుంచి 30 ఏళ్లకు, మిగిలిన ఖనిజాల లీజు కాలపరిమితిని 5 నుంచి 10ఏళ్లకు పెంచారు. కొవిడ్ ఖర్చుల నిమిత్తం 2021లో విధించిన కన్సిడరేషన్ అమౌంట్‌ను పూర్తిగా రద్దుచేసింది. కొత్త పాలసీలో టన్నేజ్ ఆధారిత సీనరేజీ ఫీజు విధానం అమలవుతుందని తెలిపింది.

గనుల సీనరేజీ వసూలు కాంట్రాక్టు పొడిగింపు

- 73 నుంచి 113 రోజుల వరకు 3 విడతల్లో బకాయిలు చెల్లించాలి
- ఆ 5 జిల్లాల్లో మళ్లీ బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి
- బకాయిల్లో తొలివిడత చెల్లించాలి.. ఉత్తర్వులు జారీ

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గనుల శాఖలో సీనరేజీ వసూలు కాంట్రాక్టు కాలపరిమితిని ప్రభుత్వం పొడిగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ప్రభుత్వ ఆదేశాలతో గత ఏడాది జూన్ నుంచే ఏడు ఉమ్మడి జిల్లాల పరిధిలో సీనరేజీ వసూళ్లు నిలిచిపోయాయి. ఖజానాకు రావలసిన ఆదాయం పడిపోయింది. ఈ నేపథ్యంలో పనిచేయని కాలంలో చెల్లించాల్సిన బకాయిలను మాఫీ చేయడంతోపాటు ఆ కాలాన్ని కొనసాగింపుగా పరిగణించాలని కాంట్రాక్టు సంస్థలు ఇటీవల కోరాయి. దీనికి సర్కారు సానుకూలంగా స్పందించింది. సీనరేజీ వసూళ్లను నిలిపివేసిన జిల్లాల్లో ఆయా సంస్థల కాంట్రాక్టు కాలపరిమితిని సగటున 73 రోజుల నుంచి 113 రోజుల వరకు పొడిగించింది. అధికారిక లెక్కల ప్రకారం.. ఏడు ఉమ్మడి జిల్లాలకు గాను ఐదు జిల్లాల్లో కాంట్రాక్టు గడువు ఇప్పటికే ముగిసింది. ఆ జిల్లాల్లో సంబంధిత కంపెనీలు తమకు పొడిగింపు కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. ఇందుకోసం మళ్లీ కొత్తగా బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలని స్పష్టంచేసింది. పెండింగ్ బకాయిల్లో తొలి విడత సొమ్మును చెల్లించాలని షరతు విధించింది. కాగా.. కాంట్రాక్టు సంస్థలు బకాయిలను మూడు విడతల్లో చెల్లించాలని గనుల శాఖ కార్యదర్శి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పనిచేయని కాలానికి బకాయిలు వర్తించవన్నారు. అవసరమైన మేర జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్), మెరిట్ ఫీజులను చెల్లించాలన్నారు.

జిల్లాల వారీగా సీనరేజీ కాంట్రాక్టు పొడిగింపు ఇలా

చిత్తూరు జిల్లా రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు, కడప హిల్‌సైడ్ ఎస్టేట్స్, అనంతపురం అమిగోస్ మినరల్స్ శ్రీకాకుళం విశ్వసముద్ర ఇంజనీరింగ్ , తూర్పుగోదావరి సుధాకర ఇన్‌ఫ్రాటెక్, విజయనగరం రాఘవ కన్‌స్ట్రక్షన్స్ గుంటూరు ఏఎంఆర్ ఇండియా.



వక్ఫ్ చట్టంపై నిర్వహించిన వర్క్ షాపునకు హాజరైన బీజేపీ కార్యకర్తలు

వక్ఫ్ సవరణలపై ప్రతిపక్షాల అసత్య ప్రచారం: బీజేపీ



అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దేశంలోని 97% మంది పేద ముస్లింల సొమ్ము కేవలం మూడు శాతం మంది ధనిక ముస్లింలు దోచేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరవింద్ మీనన్ అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ బిల్లు సవరణ కేంద్రం ఎందుకు చేసిందో వివరించారు. దేశంలోని ముస్లింలకు బీజేపీ ద్రోహం చేసిందంటూ ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అనంతరం కార్యాలయంలో నిర్వహించిన వర్క్ షాపులో వక్ఫ్ చట్టం గురించి పార్టీ శ్రేణులకు వివరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ... 'ధార్మిక వ్యవస్థ అయిన వక్ఫ్‌తో కేంద్రానికి ఎలాంటి సంబంధం లేదు. బిల్లుకు సవరణలు చేస్తే విపక్షాలకు వచ్చిన నష్టమేంటి? బీజేపీ అధికారంలో లేనప్పుడు నేషనల్ హెరాల్డ్ కేసు నమోదయింది. ఆ కేసులో బెయిలుపై ఉన్న సోనియా, రాహుల్ బీజేపీపై బురద జల్లడం విడ్డూరంగా ఉంది. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌లో వాటాలను యంగ్ ఇండియా తీసుకుంది. అందులో 76 శాతం వాటాదారులు సోనియా, రాహుల్. ఇదే విషయాన్ని ఈడీ చార్జిషీట్‌లో తెలిపింది' అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నేతలు షేక్ బాజీ, వల్లూరు జయప్రకాశ్ నారాయణ, పాతూరి నాగభూషణం, సయ్యద్ బాషా పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు వద్దన్నందుకే జగన్‌తో గొడవ

- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



బలిజేపల్లి గ్రామంలో ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): '2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు కోడెల శివప్రసాదరావు గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. వారిని అడ్డుకొని పదవులకు వన్నె తెచ్చే వారి గురించి చిల్లరగా మాట్లాడవద్దని చెప్పా. దీంతో గత సీఎం జగన్‌తో నాకు గొడవ జరిగింది' అని శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. శుక్రవారం పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని బలిజేపల్లి గ్రామంలో ఎన్టీఆర్, నవ్యాంధ్ర తొలి సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావుల విగ్రహావిష్కరణ, సచివాలయ ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కోడెల సభ నడిపిన తీరు, క్రమశిక్షణ ఆచరణీయమన్నారు. ఆయన స్ఫూర్తితోనే సభను నడిపిస్తున్నట్లు చెప్పారు. తనకు స్ఫూర్తి ఇచ్చిన నాయకులలో కన్నా ఒకరని చెప్పారు.

డాక్టర్ ప్రభావతికి జ్ఞాపక శక్తి తిరిగిరావాలని కోరుకున్నా

తన కస్టోడియల్ టార్చర్ కేసు విషయంలో నిందితురాలిగా ఉన్న గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతికి జ్ఞాపక శక్తి తిరిగి రావాలని ఇటీవలే తిరుపతి వెళ్లినప్పుడు కోరుకొన్నట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఆమెకు జ్ఞాపకశక్తి తిరిగి రావాలంటే కోర్టు నుంచి కల్పించిన తాత్కాలిక రక్షణ రద్దు కావాలి. అందుకోసం నేను నిరీక్షిస్తున్నా. కేసు 24కి వాయిదా పడింది. బహుశ ఆ రోజున ఆమెకు జ్ఞాపకశక్తి తిరిగొస్తుందని ఆశిస్తున్నా' అని రఘురామ అన్నారు.

'బనకచర్ల'పై ప్రతిపాదనలు పంపండి

- కేంద్ర జలసంఘం సానుకూల స్పందన
- కేంద్ర, రాష్ట్ర అధికారులతో సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్
- కంపెనీల రిజిస్ట్రార్ వద్ద 'జలహారతి కార్పొరేషన్' రిజిస్ట్రేషన్

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి కావలసిన అనుమతుల కోసం తమకు ప్రతిపాదనలు పంపాలని కేంద్ర జలసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్.. జలసంఘం అధికారులు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పర్యావరణం-అటవీ శాఖ, శ్రీశైలం పులుల అభయారణ్యం అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనుమతులపై చర్చించారు. రూ.80,112 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రస్తుతం రూపకల్పన దశలో ఉంది. ఇది సిద్ధమయ్యాక కేంద్రానికి అందించి నిధులు మంజూరు చేయాలని కోరేందుకు ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో పూర్తి చేయాలనుకుంటోంది. ఒక్కో దశకు విడివిడిగా కేంద్ర సంస్థల అనుమతులు పొందడం కంటే.. మొత్తం ప్రాజెక్టు ఒకే యూనిట్‌గా అనుమతి తీసుకోవాలని వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్ణయించారు. ఇందుకు జలసంఘం కూడా సానుకూలంగా స్పందించి పై సూచన చేసింది. జూన్ 1న టెండర్లను పిలవాలనుకుంటున్న ఈ ప్రాజెక్టుకు.. ముందుగానే నిధుల సమీకరణ చేయాలని జలవనరుల శాఖ యోచిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్పెషల్ పర్పస్ వెహికిల్ 'జలహారతి కార్పొరేషన్'ను కంపెనీల రిజిస్ట్రార్ వద్ద రిజిస్టర్ చేశారు.

మే 22న జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం

- షార్‌కు చేరిన రాకెట్ పరికరాలు



ప్రత్యేక వాహనంలో షార్‌కు వెళ్తున్న రాకెట్ పరికరాలు

సూళ్లూరుపేట, చెన్నై, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి మే 22న జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగానికి సన్నాహాలు చేస్తోంది. ఈ రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన నిషార్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనుంది. ఇప్పటికే షార్‌లో రెండో ప్రయోగ వేదిక వద్దనున్న వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్ (వ్యాబ్‌లో)లో రాకెట్ అనుసంధాన పనులు వేగంగా సాగుతున్నాయి. దీంతో పాటు పీఎస్ఎల్వీ-సీ61, ఎల్వీఎం-3-జీ1, ఎల్వీఎం3-ఎం5 రాకెట్ల అనుసంధాన పనులు కూడా జరుగుతున్నాయి. జీఎస్ఎల్వీ-ఎఫ్16 అనుసంధానానికి సంబంధించిన రాకెట్ పరికరాలు కేరళలోని తిరువనంతపురం నుంచి భారీ భద్రత నడుమ రోడ్డు మార్గాన రెండు ప్రత్యేక వాహనాల్లో శుక్రవారం షార్‌కు తీసుకొచ్చారు. ప్రయోగించే విదేశీ ఉపగ్రహాన్ని కూడా నెలాఖరులో షార్‌కు తీసుకురానున్నారు.

రెండేళ్లలో కులశేఖరపట్టణం నుంచి ప్రయోగాలు: నారాయణన్

రాబోయే రెండేళ్లలో కులశేఖరపట్టణం నుంచి రాకెట్ ప్రయోగాలు చేపడతామని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. తమిళనాడులోని నాగర్‌కోవిల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కన్నియాకుమారిలోని సూర్యాస్తమయ ప్రాంతం వద్ద స్పేస్ పార్క్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. అందుకు అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కులశేఖరపట్టణంలో 95 శాతం భూమి స్వాధీనం చేసుకున్నామని, రెండేళ్లలోపు ఇక్కడి నుంచి రాకెట్ ప్రయోగం చేపడతామని తెలిపారు. 2025లో ఇస్రో అనేక విజయాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శ్రీహరికోటలో 42 నెలల్లో మూడవ ల్యాండ్ పాడ్ ఏర్పాటు చేయనున్నామని, అందుకు కేంద్రం రూ.4,000 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. అమెరికాకు చెందిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ త్వరలోనే భారత్‌కు రానున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు.

ఎండ.. వాన!

- రాష్ట్రంలో విచిత్ర వాతావరణం.. అల్లూరి జిల్లాలో పెనుగాలుల బీభత్సం
- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు.. అంధకారంలో ఏజెన్సీ గ్రామాలు
- నేడు, రేపు ఈదురుగాలులతో వర్షం


పాడేరు-విశాఖ మెయిన్ రోడ్‌పై కూలిపోయిన విద్యుత్ స్తంభం

అమరావతి, విశాఖపట్నం, పాడేరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వాతావరణ అనిశ్చితితో రాష్ట్రంలో విచిత్ర వాతావరణం నెలకొంది. రాయలసీమ మరికొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతుంటే, ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. రాష్ట్రంలో శని, ఆదివారాల్లో చాలా ప్రాంతాల్లో ఎండలు, వడగాడ్పులు ఉన్నా.. మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు, అక్కడక్కడా మోస్తరు వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, రాయలసీమ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. వాతావరణ అనిశ్చితితో ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు రాయలసీమలో శుక్రవారం అక్కడక్కడా క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి వర్షాలు కురిశాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 36.2, అల్లూరి జిల్లా అరకులో 32.5, శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో 30.2, అన్నమయ్య జిల్లా నగరిమడుగులో 28 మిల్లీమీటర్ల వాన పడింది. 21 ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్ పరిధిలో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. డి.గొందూరు సమీపంలో హైవేపై భారీ వృక్షం కూలిపోయింది. కొయ్యూరు మండలం పి.మాకవరం, నడింపాలెం మార్గంలో చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అల్లూరి ఏజెన్సీలో అంధకారం నెలకొనడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు యంత్రాంగం రంగంలోకి దిగింది. మరోవైపు నంద్యాల జిల్లా దొర్నిపాడులో 41.7, కడప జిల్లా కొంగలవీడులో 41.6, అన్నమయ్య జిల్లా కంభాలకుంటలో 40.9, తిరుపతి జిల్లా యాతలూరులో 40.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శనివారం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, పల్నాడు జిల్లా అమరావతి, పెదకూరపాడు మండలాల్లో తీవ్రంగా, విజయనగరం, మన్యం, అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని 73 మండలాల్లో మోస్తరు వడగాడ్పులకు అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

గోవిందుడి ఖజానా...
మరింత భద్రం!



- భక్తులు సమర్పించే కానుకల డిపాజిట్లపై టీటీడీ దృష్టి
- వడ్డీ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ప్రణాళికలు

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

శ్రీవారి భక్తులు హుండీలో సమర్పించే కానుకల డిపాజిట్లపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. స్వామి సొమ్ముకు భద్రతతో పాటు ఆదాయంపై కూడా శ్రద్ధ వహిస్తోంది. ఈ విషయమై నియమించిన 'ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పర్ట్ కమిటీ' చేసిన కీలక ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకుని గోవిందుడి ఖజానాను మరింత పెంచే దిశగా అడుగులు వేస్తోంది. స్వామివారిని దర్శించుకునే భక్తులు తమ స్థాయిని బట్టి హుండీలో కానుకలు సమర్పిస్తుంటారు. హుండీలో నగదుతో పాటు బంగారం, వెండి కూడా అందుతుంటుంది. గతేడాది ఏప్రిల్ నాటి లెక్కల ప్రకారం వివిధ బ్యాంకుల్లో టీటీడీ బంగారు డిపాజిట్లు 11,329 కేజీల వరకు ఉన్నాయి. వీటి విలువ రూ.8,496 కోట్లు ఉండవచ్చని అంచనా. ఇక నగదు ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.18వేల కోట్లకు చేరాయి. బంగారు, నగదు డిపాజిట్ల ద్వారా 2024-25 వార్షిక సంవత్సరానికి రూ.1,253 కోట్ల వడ్డీ లభించినట్టు టీటీడీ బడ్జెట్‌లోనూ పొందుపరిచింది.

డిపాజిట్ల భద్రతపై చైర్మన్, ఈవో ఆరా

ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్న శ్రీవారి డిపాజిట్లపై టీటీడీ ప్రత్యేక దృష్టి పెట్టింది. వాటి భద్రతపై చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు ఆరా తీశారు. ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లు తిరిగి తీసుకుని ప్రభుత్వ బ్యాంకుల్లో డిపాజిట్లు చేయగలమా? ఇందులో ఇబ్బందులు ఉన్నాయా? అనే అంశాలపై అధ్యయనం చేయాలని గతేడాది నవంబరులో జరిగిన బోర్డు సమావేశంలో తీర్మానం చేశారు. 'పబ్లిక్ సెక్టార్ బ్యాంక్- ఓన్లీ పాలసీ' విధానంపై మాజీ ఎన్నికల కమిషనర్, టీటీడీ ఈవోగానూ పనిచేసిన నిమ్మగడ్డ రమేశ్‌తో పాటు ఆర్‌బీఐ రిటైర్డ్ డిప్యూటీ గవర్నర్ గాంధీ, చెన్నై ఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ చైర్మన్ సుందరరాజన్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ పటియాలా రిటైర్డ్ ఎండీ రమేశ్‌తో నిపుణుల కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ గతేడాది చివర్లో నివేదిక సమర్పించింది.

నిపుణుల కమిటీ ఏం చెప్పిందంటే...

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేయాలని భావిస్తే వడ్డీ రేట్లు కోల్పోవాల్సి వస్తుందని, కొన్ని ప్రైవేట్ బ్యాంకులతో పోలిస్తే వడ్డీ తక్కువ కాబట్టి మంచి ఫలితాలు రాకపోవచ్చని కమిటీ పేర్కొంది. ప్రస్తుతం ప్రైవేట్ బ్యాంకులైనా, పబ్లిక్ బ్యాంకులైనా ఆర్బీఐ నిబంధనలకు అనుగుణంగానే పనిచేస్తున్న క్రమంలో భద్రత విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ చట్టాలు కూడా ప్రైవేట్ బ్యాంకుల్లో పెట్టుబడులు పెట్టుకోవచ్చని చెబుతున్న అంశాలను ప్రస్తావించింది. ప్రభుత్వ బ్యాంకుల్లోనే పెట్టుబడులు పెట్టాలని భావిస్తే తక్షణమే ప్రైవేట్ బ్యాంకుల్లో చేసే డిపాజిట్లను నిలిపివేయాలని సూచించింది. ఇప్పటికే ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్న పెట్టుబడులను నిర్ణీత వ్యవధి పూర్తయ్యాకే విత్‌డ్రా చేయాలని, వడ్డీ నష్టం నివారించవచ్చని అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల్లోనే కాకుండా కేంద్ర సెక్యూరిటీల్లో కూడా పెట్టుబడులు పెడితే లాభాలొస్తాయని, ఏటా కార్పస్ ఫండ్‌ను విత్‌డ్రా చేసుకుని మళ్లీ వేరే బ్యాంకుల్లో పెట్టేబదులు 3, 4, 6 ఏళ్లకు ప్రభుత్వ బ్యాంకుల్లో లాంగ్‌టర్మ్ పెట్టుబడులు పెడితే ఎక్కువ వడ్డీ వస్తుందని తెలిపింది. ప్రైవేట్ బ్యాంకులు అందించే పేమెంట్ గేట్‌వే, ఆన్‌లైన్ డొనేషన్ కలెక్షన్లు, క్యాష్ మేనేజ్మెంట్ వంటి సర్వీసులను టీటీడీ వినియోగించుకోవాలని సూచించింది. అలాగే బంగారాన్ని 12 ఏళ్లకు డిపాజిట్ చేసి లాక్ చేయకుండా ఐదారేళ్లకు బ్యాంకులతో అగ్రిమెంట్ చేసుకోవాలంటూ పలు కీలక అభిప్రాయాలు, సూచనలు చేసింది. కమిటీ సూచనల మేరకు ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకుల్లో డిపాజిట్లను కొనసాగించాలని టీటీడీ తాజాగా నిర్ణయం తీసుకుంది. అయితే కమిటీ సిఫారసుల ఆధారంగా భక్తులు ఎంతో భక్తితో సమర్పించే కానుకలను సరైన పద్ధతిలో భద్రంగా పొదుపు చేయడంతో పాటు వడ్డీ ద్వారా ఆదాయాన్నీ కూడా పెంచే దిశగా ప్రణాళికలు రూపొందించుకుంటోంది. త్వరలో మరో భేటీ ఏర్పాటు చేసి డిపాజిట్ల భద్రతపై మరికొన్ని నిర్ణయాలు తీసుకోనుంది.

ఎస్సీ వర్గీకరణ రూల్స్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తారు. ఏయే గ్రూపులలో ఏయే కులాలు ఉన్నాయన్న జాబితాను ఇప్పటికే విడుదల చేశారు. అదే విధంగా 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని రెండు విడతలుగా అమలు చేయనున్నారు. మహిళలకు దక్కాల్సిన 33.33 శాతం రిజర్వేషన్లు ఆయా గ్రూపులు మూడింటికీ సమాంతరంగా అమలు చేస్తారు. అంటే, ప్రతి గ్రూపులో ఆయా మహిళలకు 33.33 శాతం దక్కేలా చూస్తారు. ఏదైనా నోటిఫికేషన్‌కు సంబంధించి రోస్టర్ ప్రకారం ఓ గ్రూప్‌కు సంబంధించిన అర్హులైన వారు లేకపోతే అదే గ్రూపునకు తదుపరి నోటిఫికేషన్‌లో అవకాశమిస్తారు. రెండో నోటిఫికేషన్‌లో కూడా ఆయా గ్రూప్‌నకు అభ్యర్థులు లేకపోతే మూడో నోటిఫికేషన్‌లో అవకాశం కల్పిస్తారు. ఉదాహరణకు ఎవరైనా ఎస్సీ గ్రూప్-1కి చెందిన అభ్యర్థి మొదటి నోటిఫికేషన్‌లో అర్హులు కాకపోతే ఆ పోస్టును రెండో నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తారు. రెండో నోటిఫికేషన్‌లో కూడా అర్హత కలిగిన వారు గ్రూప్-1లో లేకపోతే ఎస్సీ గ్రూప్-2కు చెందిన వారితో మూడో నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తారు. ప్రతి శాఖ ఎస్సీ గ్రూపులకు సంబంధించి రోస్టర్ రిజిస్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. రెండు సైకిల్స్‌లో 200 పాయింట్ల రోస్టర్ విధానం అమలు చేయాలి. ఈ రూల్స్ రాష్ట్ర ప్రభుత్వం నియంత్రణలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో అమలవుతాయి. విద్యాసంస్థల్లో సీట్లు భర్తీ చేసే క్రమంలో ఒక గ్రూపు నుంచి అభ్యర్థులు భర్తీ కాకపోతే మరో గ్రూపు నుంచి భర్తీ చేస్తారు. భవిష్యత్తులో విద్యాసంస్థల నియామకాలు/అడ్మిషన్లకు ఈ రూల్స్ వర్తిస్తాయి. ఈ రూల్స్‌కు సంబంధించి ఏదైనా అనుమానాలు ఉంటే ప్రభుత్వం చర్చించి తదుపరి ఆదేశాలు ఇస్తుంది. సాధారణ పరిపాలనశాఖ, పాఠశాల విద్య, ఉన్నత విద్య, ఇతర అన్ని సచివాలయ శాఖలు ఈ రూల్స్‌కు అనుగుణంగా సవరణలు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వైరస్ లేదు

- భోపాల్ ల్యాబ్‌లో నిర్ధారణ.. వెటర్నరీ డైరెక్టర్ వెల్లడి

అమరావతి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): గతంలో విస్తరించిన ప్రాంతాలతో సహా పల్నాడు జిల్లాలోనూ ప్రస్తుతం బర్డ్ ఫ్లూ వైరస్ లేదని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రంలో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోయినపుడు వాటి నమూనాలను భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబ్‌కు పంపగా అప్పుడు బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిందన్నారు. దాంతో వైరస్ ఉన్న ప్రాంతాలను రెడ్ జోన్లుగా ప్రకటించి, వ్యాధి నియంత్రణ చర్యలు చేపట్టామని చెప్పారు. తర్వాత ఆ పరిసరాలతో పాటు పల్నాడు జిల్లాలో కూడా కోళ్లు, తాగునీరు, పర్యావరణ సమూహాల నుంచి నమూనాలు సేకరించి భోపాల్‌కు పంపామన్నారు. తాజాగా ఆ ల్యాబ్ ఇచ్చిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వైరస్ కనిపించలేదని, ఆ విషయం శాస్త్రీయంగా నిర్ధారణ అయిందని వివరించారు.

కాలేయంలో
కలకలం




- లివరే కదాని లైట్ తీసుకోవద్దు
- తెలియకుండానే కబళిస్తున్న కాలేయ సంబంధ వ్యాధులు
- అధిక కొవ్వు పదార్థాలొద్దు
- మద్యం ముట్టుకుంటే ముప్పే
- ఊబకాయం, హెపటైటిస్‌తో ఇన్ఫెక్షన్

శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాల్లో కాలేయం ఒకటి. అది ఏమాత్రం దెబ్బతిన్నా సమస్యలు తప్పవు. కానీ కొన్నేళ్లుగా కాలేయ వ్యాధుల బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. కాలేయ క్యాన్సర్లు నిశ్శబ్దంగా కబళిస్తున్నాయి. సమస్య ఏమిటో గుర్తించే సరికే ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కాలేయ సమస్యలను నివారించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే, అసలు కాలేయ వ్యాధులు రాకుండా చూసుకోవడానికి మనం తీసుకునే ఆహారమే దివ్య ఔషధమని పేర్కొంటున్నారు. హైపటైటిస్-బీ, విపరీతంగా మద్యం అలవాటు, అధిక కొవ్వు ఉండే ఆహారం తీసుకోవడం, ఊబకాయంతో ఏర్పడే ఫ్యాటీ లివర్, కొన్ని రకాల మందుల దుష్ప్రభావాలు వంటివి కాలేయ సమస్యలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా 42 ఏళ్లు దాటిన వారిలో కాలేయ సమస్యలు పెరిగిపోతున్నట్టు చెబుతున్నారు.

ఎలా గుర్తించవచ్చు: ఆకలి తగ్గిపోవడం, కడుపు నొప్పి, రక్తపు వాంతులు, కామెర్లు, మల విసర్జనలో రక్తం పడటం, బరువు తగ్గిపోతుండటం, తరచూ జ్వరం, ముఖం, కాళ్ల వాపు వంటివి కాలేయ సమస్యలకు లక్షణాలని వైద్యులు చెబుతున్నారు. ఆల్కాహాల్ అలవాటును వదులుకోవడం, బరువును నియంత్రించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

కాలేయం భద్రం: మంత్రి సత్యకుమార్

ఆధునిక జీవన విధానంలో కాలేయ వ్యాధుల్ని అరికట్టడానికి సరైన ఆహారం, జీవన అలవాట్లను అనుసరించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా పోషకాలతో కూడిన ఆహారం ద్వారా కాలేయ వ్యాధుల్ని అరికట్టే దిశగా ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. 38 శాతం ప్రజలు ఫ్యాటీ లివర్ సమస్యను ఎదుర్కోవడం పట్ల మంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు కాలేయ దినోత్సవం

ప్రతి ఏటా ఏప్రిల్ 19న ప్రపంచకాలేయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మానవ శరీరంలో కాలేయ ప్రాధాన్యం, దానిని కాపాడుకునే విధానం వంటి కీలక విషయాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం.. 'ఆహారమే ఔషధం' ఇతివృత్తంతో ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. తీసుకునే ఆహారంలో స్వల్ప మార్పుల ద్వారా కాలేయాన్ని కాపాడుకోవచ్చన్న సందేశాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంటోంది.

దానం చేయొచ్చు!

కాలేయ వ్యాధిగ్రస్తులకు లివర్ మార్పిడి చికిత్సతో మంచి జీవితాన్ని అందించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో కాలేయం కొంత భాగాన్ని కోసి తీసినా.. తిరిగి పెరుగుతుంది. అందువల్ల కాలేయ దానం చేసిన వారు కొన్ని రోజుల్లోనే సాధారణ జీవనం గడపవచ్చని వైద్యులు చెబుతున్నారు. కానీ, అవగాహన లేకపోవడంతో ఎవరూ పెద్దగా ముందుకు రావడం లేదని అంటున్నారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

కాలేయమే కర్త!

మనిషి శరీరంలో అనేక అంగాలు ఉన్నప్పటికీ.. కాలేయమే ఈ శరీరాన్ని నడిపించే కర్త!. మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేయడంలోను, జీర్ణమైన ఆహారాన్ని రక్తం రూపంలో జీవక్రియలకు అందించడంలోనూ కాలేయమే కీలకం. అంతేకాదు.. శరీరంలోని వివిధ అంగాలు నిర్వర్తించే కార్యక్రమాలకు బాధ్యత వహించే కీలకమైన అవయవం. రక్తాన్ని ఫిల్టర్ చేయడంలోను, రసాయన స్థాయిలను నియంత్రించడంలోను, విటమిన్లు, ఖనిజాలు మూత్రం ద్వారా బయటకు వెళ్లకుండా నిల్వచేయడంలోనూ కాలేయమే ముఖ్య భూమిక పోషిస్తుంది. మరీ ముఖ్యంగా ఇన్‌ఫెక్షన్లు సోకినప్పుడు సమర్థవంతంగా పోరాడే శక్తిని కూడా శరీరానికి అందించేది కాలేయమే. అందుకే మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే కాలేయ ఆరోగ్యం అత్యంత ప్రధానమని వైద్యులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకుంటే...

అనారోగ్యకర జీవనశైలి, ఇతర సమస్యలతో కాలేయ క్యాన్సర్లు పెరిగిపోతున్నాయి. కొన్ని జాగ్రత్తలు పాటించటం ద్వారా కాలేయ క్యాన్సర్ల బారినపడకుండా తప్పించుకోవచ్చు. ప్రాసెస్డ్ ఆహారం, కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలు, కృత్రిమ రంగులు కలిగిన పానీయాలకు దూరంగా ఉండాలి. తాజా ఆహారం, తక్కువ కొవ్వు, ఫైబర్ అధికంగా ఉన్న పదార్థాలను తీసుకోవాలి. బీ, సీ, ఈ విటమిన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం కాలేయాన్ని రక్షించడానికి దోహదపడుతుంది. నీరు సమృద్ధిగా తాగాలి. హెపటైటిస్ వైరస్ నుంచి కాపాడుకోవటానికి వాక్సినేషన్ చేయించుకోవాలి. మద్యపానం మానాలి. తగినంత శారీరక శ్రమ ఉండాలి. వ్యాయామం చేయాలి. బరువును అదుపులో ఉంచుకోవాలి.

- డాక్టర్ నయీమ్, క్లినికల్ డైరెక్టర్, కేర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైజెస్టివ్ డిసీజెస్


గ్రీన్‌కో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

గ్రీన్‌కో ప్రాజెక్టు అద్భుతం

- ఒకేచోట సోలార్, విండ్, జల విద్యుత్ కేంద్రాలు మోదీ, బాబు నాయకత్వానికి నిదర్శనం
- కర్నూలు జిల్లాలోని ప్రాజెక్టును పరిశీలించిన కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రి ప్రహ్లాద్

కర్నూలు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో భారత్ ప్రగతి పథాన దూసుకుపోతూ ప్రపంచంలోనే 5వ స్థానంలో నిలిచిందని, త్వరలో మూడో స్థానానికి కూడా చేరుకుంటుందని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు.కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుమ్మితంతండా, పాణ్యం మండలం పిన్నాపురం ప్రాంతాల్లో గ్రీన్‌కో కంపెనీ 6,680 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దాదాపు పూర్తయింది. త్వరలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రహ్లాద్‌జోషి శుక్రవారం ఆ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు టన్నెల్, టర్బైన్లను పరిశీలించారు. అంతకుముందు ఓర్వకల్లు మండలం గని గ్రామ ప్రాంతంలో నిర్మించిన సోలార్ ప్రాజెక్టును గ్రీన్‌కో కంపెనీ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అప్పర్ డ్యాం, లోయర్ డ్యాం, టన్నెల్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. నిర్మాణం అద్భుతమని, ప్రపంచంలోనే తొలి ప్రాజెక్టు ఇదే కావడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. ఇందుకు కృషి చేసిన ఎండీ అనిల్, ఇంజనీర్లను ప్రశంసించారు. ప్రాజెక్టు పరిశీలన కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకమైన రెన్యూవబుల్ ఎనర్జీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు ఇదేనన్నారు. ఒకే ప్రాంతంలో సోలార్, విండ్, జల విద్యుత్ కేంద్రాలను నిర్మించడం గొప్పతనమన్నారు. ఒకప్పుడు ఎందుకూ పనికిరాని అటవీ భూముల్లో దేశానికి గర్వకారణమైన ఈ ప్రాజెక్టు నిర్మాణం మోదీ, చంద్రబాబుల దార్శనిక నాయకత్వానికి నిదర్శనమని, బాబు నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నానన్నారు. ఓర్వకల్లు ప్రాంత ఆర్థిక వృద్ధిని పెంచుతుందని, మరిన్ని అనుబంధ పరిశ్రమలు రాబోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి, నిల్వ, డిమాండ్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి ఈ ప్రాజెక్టు లక్ష్యమన్నారు. అనంతరం నంద్యాల జిల్లా అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

ఈ మట్టి సీఎం ఇంటికి..
అడ్డొస్తే తొక్కించేస్తాం


మట్టి తరలిస్తున్న లారీలను అడ్డగించిన గ్రామస్థులు


ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా మట్టి తవ్వుతున్న దృశ్యం

- ముఖ్యమంత్రి పేరిట.. మట్టి అక్రమాలు
- అడ్డుకున్న వారికి బెదిరింపులు
- అమాత్యుని ఇలాకాలో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలకు తెగబడుతున్న వైనం
- ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో పేట్రేగిన ముఠా

ఆగిరిపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి పేరుచెప్పి, మంత్రి పార్థసారథి సొంత నియోజకవర్గం నూజివీడులో యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న ముఠా దౌర్జన్యకాండ శుక్రవారం వెలుగు చూసింది. నెల రోజుల నుంచి నూజివీడు నియోజకవర్గం పరిధిలోని ఆగిరిపల్లి మండలం నరసింగపాలెంలో ఒక పెద్ద గ్రావెల్ కొండ నుంచి రాత్రిళ్లు యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు సాగుతోంది. శుక్రవారం నుంచి ఉదయం పూట కూడా అక్రమ క్వారీయింగ్‌కు తెరదీశారు. పెద్ద సంఖ్యలో టిప్పర్ల ద్వారా గ్రామంలోని మట్టి కొండ నుంచి మట్టిని తరలిస్తున్నారు. గమనించిన గ్రామస్థులు టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో అక్రమ తవ్వకాల నిర్వాహకుడు ఫోన్‌లో గ్రామస్థులతో మాట్లాడుతూ.. "సీఎం ఇంటికి మట్టి తవ్వుతుంటే అడ్డుకుంటారా!. అడ్డొస్తే తొక్కించేస్తాం." అని బెదిరింపులకు దిగడంతో గ్రామస్థులు నిర్ఘాంతపోయారు. ఇటీవలే చంద్రబాబు రాజధానిలోని వెంకటపాలెంలో తన స్వగృహ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అంశాన్ని ఇలా వాడుకున్నారన్న మాట. ఈ అక్రమ క్వారీయింగ్‌ను గ్రామస్థులు ఇటీవల గుర్తించారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు సైతం సీఎం ఇంటికే తరలిస్తున్నారేమోనని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు నిఘా పెట్టారు. ఈ గ్రావెల్ గన్నవరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు వెళ్లడం గమనించిన ఈ గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన ఒక యువకుడు శుక్రవారం ఉదయం టిప్పర్లను అడ్డగించాడు. నిర్వాహకులు బెదిరింపులకు దిగడంతో గ్రామస్థులు అనుమతులు చూపాలంటూ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో మట్టి తవ్వకాల విషయమై నిన్న మొన్నటి వరకు మంత్రి పార్థసారథి పేరును స్థానిక అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా వాడుకున్నారు. ఇప్పుడు ఏకంగా సీఎం పేరును ఉపయోగించవరకు వ్యవహారం వెళ్లింది. అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడిన మంత్రి అనుచరుడు(నూజివీడు పట్టణ టీడీపీ ముఖ్యుడు) శుక్రవారం సాయంత్రం నరసింగపాలెం గ్రామస్థులు అడ్డగించిన టిప్పర్ల వద్దకు వచ్చి వారికి క్షమాపణ చెప్పారు. ఇక క్వారీయింగ్ చేయబోనని చెప్పారు. ఈ విషయంలో మంత్రి పాత్ర లేదని తెలిసిన గ్రామస్థులు మౌనం వహించారు.

విజిలెన్స్ విచారణ జరపాలి

నూజివీడు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని అన్ని క్వారీలపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. 15 ఏళ్ల క్రితం ఇచ్చిన అనుమతులనే అడ్డం పెట్టుకొని చాలా మంది అక్రమ క్వారీయింగ్ పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో ఈ విషయంపై విచారణ చేసిన అధికారుల బృందం ఆగిరిపల్లి మండలంలోని ఓ క్వారీ నిర్వాహకులపై కాకుండా అక్కడ పనిచేసే వాచ్‌మెన్‌పై రూ.3 కోట్ల వరకు అపరాధ రుసుము విధించింది. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఏలూరు జిల్లా పరిధిలోకి వచ్చిన నూజివీడు నియోజకవర్గంలో ఉన్న మొత్తం క్వారీలపై విజిలెన్స్ విచారణ నిర్వహిస్తే మట్టి లూటీ వ్యవహారం బయటకు వస్తుందని స్థానికులు చెబుతున్నారు.

భూకబ్జాలను సహించం!

(మొదటి పేజీ తరువాయి)

అందుతున్నాయన్నారు. విశాఖ, కాకినాడ, తిరుపతి, కడప ప్రాంతాల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, అందువల్ల తొలుత కాకినాడ, విశాఖలో పర్యటిస్తానని తెలిపారు. "గత ప్రభుత్వంలో కాకినాడ జిల్లా పరిధిలో ఓ వైసీపీ నాయకుడు, ఆయన అనుచరులు బ్రాహ్మణుల ఆస్తులు లాగేసుకున్నారు. సత్రం భూములు, దేవదాయ, ధర్మాదాయ ఆస్తులను కబ్జా చేశారు. కాకినాడలో వ్యాపారుల భవనాలను తీసుకునేందుకు బెదిరింపులకు దిగారు. తిరుపతిలోనూ మఠం భూములను ఆక్రమించి గేట్లు పెట్టారు. విశాఖనగర శివార్లు, పారిశ్రామికంగా విస్తరించిన ప్రాంతాల్లోని భూముల విషయంలో నాడు వివాదాలు సృష్టించారు. వీటన్నింటిపైనా నాకు ఫిర్యాదులు అందుతున్నాయి" అని చెప్పారు. ప్రజల ఆస్తులకు భరోసా కల్పిస్తూ చర్యలు తీసుకోవాలనీ, భూదందాలు, అక్రమాలు చేసే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందనే సంకేతం పంపాలని పవన్ ఆదేశించారు. "నేనే స్వయంగా జిల్లా కేంద్రాలకు వెళ్లి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల సమక్షంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తా. వారి బాధలు తెలుసుకొని, భరోసా ఇస్తా. ఒకవేళ కూటమి నేతలు భూఆక్రమణలకు పాల్పడినట్టు తేలినా ఉపేక్షించం" అని స్పష్టం చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.